




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బొగ్గువేలం రద్దు చేయాలి

నాగార్‌కర్నూల్ జిల్లాలో విషాదం

ఫ్రాన్స్ ఎన్నికలలో ఎవరికి లభించని మెజారిటీ

లోపలి పేజీల్లో..

సంపుటి 07, సంచిక: 211 | మంగళవారం | 02-07-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## పంద్రాగస్టుకు ఖైదీలు రిలీజ్

### ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఓకే



రాధాకృష్ణన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు, గవర్నర్ కోటా ఎంఎల్‌సిలపై చర్చ

యూనివర్సిటీల్లో విసిల నియామకం, రాష్ట్ర విభజన అంశాలపై చర్చ!

ప్రజాపక్షం / హైదరాబాద్: ఆగస్టు 15న ఖైదీల విడుదలకు గవర్నర్ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఖైదీల విడుదలకు సంబంధించి ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదముద్ర వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌తో రాజ్ భవన్‌లో సోమవారం సమావేశం అయ్యారు. దా దాపు రెండు గంటల పాటు ఇరువురి మధ్య భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా గవర్నర్‌తో పలు అంశాలపై సిఎం చర్చించారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు, గవర్నర్ కోటా ఎంఎల్‌సిలపై, యూని వర్సిటీల్లో విసిల నియామకం, ఆగస్టు 15న ఖైదీల విడుదల, రాష్ట్ర విభజన అంశాలపై వారు ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జైళ్లలో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర తరువాయి 2లో

## హింసను, ద్వేషాన్ని వ్యాప్తి చేసే వారు హిందువులే కాదు

హిందుత్వం పేరుతో బిజెపి అందరినీ భయపెడుతోంది

లోక్‌సభలో అధికార పార్టీపై విరుచుకుపడిన రాహుల్‌గాంధీ

ప్రతిపక్షనేత వ్యాఖ్యలపై మోదీ, అమిత్‌షా తీవ్ర అభ్యంతరం



**న్యూఢిల్లీ:** అధికార బిజెపిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ సుదీర్ఘ ప్రస ంగం చేశారు. తమని తాము హిందువులమని 24 గంటలపాటు చెప్పుకు నేవారిలో హింస, ద్వేషం, అసత్యం కూరుకుపోయి ఉంటుందన్నారు. దీంతో అధికారపక్ష సభ్యుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. రాహుల్ హిందూ సమాజాన్ని హింసాత్మకంగా అభివర్ణించారని ప్రధాని మోదీ ఆరోపించారు. అయితే తాను మొత్తం హిం దూ సమాజాన్ని అనలేదని, కేవలం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లేదా మోడీ గురించి మాత్రమే మాట్లాడానని వివరణ ఇచ్చారు. రాహుల్.. శివుడి ఫొటో చూపిస్తూ.. 'హిందుత్వ పేరు చెప్పి బిజెపి అందరినీ భయపెడుతోంది. తమని తాము హిందువులని ప్రచారం చేసుకునేవారు విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. అలాంటి వాళ్లు హిందువులే కాదు. అసలు హింసని ప్రేరేపించే వాళ్లను హిందువులని ఎలా అనగలం. శివుడి మెడలో ఉన్న పాము మరణానికి భయపడకూడదని సూచిస్తుంది. అదే నమ్మకంతో మేంప్రతిపక్షంలో పోరాడతాం. ప్రతిపక్షం గా వ్యవహరిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది మన సంకల్పాన్ని బలపరుస్తుంది. సత్యం కోసం పని చేస్తాం' అని అన్నారు. రాహుల గాంధీల్ వ్యాఖ్యలు సభలో దుమారాన్ని లేపాయి. బిజెపి సభ్యు లు తమ లేచి నిలబడి నిరసనకు దిగారు. కొట్లాది మంది హిందువుల మనోభావాలను రాహుల్ దెబ్బతీశారని,యావత్ దేశానికి, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమా ండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించారని, 1984లో సిక్కుల వ్యతిరేక అల్లర్లు జరిగాయని అమిత్ షా ఎదురుదాడి చేశా రు. దేశంలో భయాందోళనలు వ్యాప్తి చేసిన కాం గ్రెస్‌కు అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. అయితే నిర్భయత ప్రాముఖ్యతను నొక్కిచెప్పడానికి తరువాయి 2లో

## 'నీట్'పై చర్చకు ప్రతిపక్షాల పట్టు

### స్పష్టమైన హామీ రాకపోవడం సభ నుంచి వాకౌట్

రెండు రోజుల విరామం తర్వాత పార్లమెంట్ సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై లోక్‌సభలో చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. విపక్షాల నిరసన మధ్యే వివిధ కమిటీల నియామకాలకు సంబంధించిన ప్రతిపాదనలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభ ముందుంచారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించారు. బిజెపి హమీర్‌పూర్ ఎంపి అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించారు. అయితే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంపై ప్రత్యేకంగా ఒక రోజంతా చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల నుంచి లేచి నిలబడి ఆందోళన చేశారు. ప్రభుత్వ నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో సభను వాకౌట్ చేశారు. అంతకు ముందు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నీట్‌లో జరిగిన తరువాయి 2లో

## కెసిఆర్‌కు హైకోర్టులో చుక్కెదురు

### 'విద్యుత్' కమిషన్ రద్దుపై పిటిషన్ కొట్టివేత



**హైదరాబాద్:** బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. 'విద్యుత్' కమిషన్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సిజె ధర్మాసనం కొట్టేసింది. విద్యుత్ కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ కెసిఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు.ఈ క్రమంలో ఆయన తరఫు న్యాయవాదుల వాదనతో హైకోర్టు విభేదించింది. మరోవైపు నిబంధనల మేరకే విద్యుత్ కమిషన్ వ్యవహరిస్తోందని అడ్వొకేట్ జనరల్(ఎజి) తెలిపారు. కెసిఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. ఎజి వాదనలను హైకోర్టు సమర్థించింది. విద్యుత్ కమిషన్ విచారణను కొనసాగించొచ్చంటూ స్పష్టం చేసింది. జస్టిస్ తరువాయి 2లో

## ఢిల్లీ హైకోర్టులో కవితకు నిరాశ

### బెయిల్ పిటిషన్లు తిరస్కరణ



**న్యూఢిల్లీ :** బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ హైకోర్టులో నిరాశ ఎదురైంది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆమె బెయిల్ కోరుతూ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. సిబిఐ, ఇడి తనపై నమోదు చేసిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మద్యం కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో మార్చి 15న ఇడి అధికారులు కవితను అరెస్టు చేసి ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. వారం రోజుల ఇడి కస్టడీ అనంతరం జ్యుడీషియల్ కస్టడీకి తరలించాక.. ఏప్రిల్‌లో విచారణ సందర్భంగా సిబిఐ రెండు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించింది. ఆ తర్వాత ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించింది. తర్వాత ఆమెను కోర్టులో హాజరు పరచగా.. తరువాయి 2లో

## హైకోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

03

## కొత్త క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలి



**న్యూఢిల్లీ :** సవరించిన ఐపిసి, క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని, పార్లమెంటులో చర్చకు వాటిని తిరిగి పంపాలని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్తగా సవరించిన క్రిమినల్ చట్టాలు, ఐపిసిలను జులై 1 నుండి అమలు జరపాలని భారత ప్రభు త్వం నిర్ణయించింది. సిపిఐ ఇప్పటికే పార్లమెంటులో వాటిని వ్యతిరేకించింది. వాటికి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, ప్రభుత్వం 140 మంది పార్లమెంటేరియన్‌లను సభ నుండి సస్పెండ్ చేశాక ఆ సవరణ చట్టాలను ప్రభుత్వం ఏకపక్షంగా ఆమోదించింది. ఆ సవరణలో, చట్టాల అమలును వాయిదా వేయాలని సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రజాస్వామిక ప్రయోజనం రీత్య వాటిని చర్చకై తిరిగి పార్లమెంటుకు పంపాలి. అదు వల్ల వాటి అమలును వాయిదా వేయాలని సిపిఐ డిమాండ చేసింది.

## రాష్ట్రంలో తొలి కేసు




ప్రజాపక్షం/ హైదరాబాద్ రాష్ట్రంలో అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలతో మొట్టమొదటి కేసు చార్మినార్ పోలీసు స్టేషన్‌లో నమోదైనదని డిజిపి రవి గుప్తా తెలిపారు. ఎఫ్‌ఐఆర్ నెంబర్ 144/ 2024తో కేసు నమోదు చేశారు. నెంబర్ ప్లేట్ కనిపించకుండా ద్విచక్ర వాహనంపై తిరుగుతున్న యువకుడిని చార్మినార్ పోలీసులు పట్టుకున్నారు. సదరు యువకుడిపై 281 భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), 80 (ఎ) 177 మోటర్ వాహనాల చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుపై సదరు యువకుడిని కోర్టు ముందు హాజరుపరుస్తారు. బెయిలబుల్ సెక్షన్ కిందకు వస్తుంది.




## నీట్ రద్దు కోసం రాజ్‌భవన్ ముట్టడి



అడ్డుకున్న పోలీసులు

విద్యార్థి, యువజన నేతల అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించడంతో పాటు పరీక్ష నిర్వహించిన ఎన్‌టిఎను రద్దు చేయాలని కోరుతూ ఎన్‌ఎస్‌యుఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, యూత్ కాంగ్రెస్, ఎఐవైఎఫ్, డివైఎఫ్‌ఐ, పివైఎల్, వైజెఎస్, తదితర విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ అపాయింట్‌మెంట్ కోరగా ఆయన స్పందించపోవడంతో రాజభవన్ ముట్టడి చేపట్టారు. ఇందులో భాగంగావిద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థి, తరువాయి 2లో

## 6న హైదరాబాద్‌లో కలుసుకుందాం

ఉభయ రాష్ట్రాల విభజన అంశాలను పరిష్కరించుకుందాం

సిఎం రేవంత్ రెడ్డికి ఏపి సిఎం ప్రతిపాదన

లేఖను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన చంద్రబాబు



ప్రజాపక్షం/ హైదరాబాద్ ఉభయ రాష్ట్రాల అంశాలను చర్చించుకుని పరిష్కరించుకునేందుకు జులై 6న (శనివారం) హైదరాబాద్‌లో కలుసుకుందామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. లేఖను చంద్రబాబు తన 'ఎక్స్' ఖాతాలో సోమవారం రాత్రి పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సుస్థిర అభివృద్ధి, సుసంపన్నత కోసం తెలుగు భాష మాట్లాడే రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా మరింత సన్నిహితంగా కలిసి పని చేయాల్సి ఉన్నదని తరువాయి 8లో

## రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 22,50లక్షల ఇళ్లు

ఈ ఏడాది రూ.22,500 కోట్లతో 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు

బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు భట్టి, పొంగులేటి సమీక్ష



ప్రజాపక్షం/ హైదరాబాద్ నిరుపేదల చిరుకాల స్వప్నమైన సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్లకు పెద్ద పీట వేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మలుల, గృహ నిర్మాణ శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోనిఉపముఖ్యమంత్రి కార్యాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హౌజింగ్, రెవెన్యూ, ఐ అండ్ పిఆర్ శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షిం చారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఇతర రాష్ట్రాలల్లో అధ్యయనం : భట్టి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపించి అధ్యయనం చేయించి త్వరగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హౌజింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. ఇతర రాష్ట్రాల్లో పేదలకు అక్కడి ప్రభుత్వాలు నిర్మిస్తున్న ఇండ్ల నమూనాలు, లబ్ధిదారుల ఎంపిక విధానం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సూచించారు. కాలుష్యం లేనటువంటి గ్రీన్ ఎనర్జీని ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున ఇందిరమ్మ ఇండ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. రాష్ట్ర రాజధాని హైదరబాద్ మహానగరం శర వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఔటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ ఇండ్ల నిర్మాణంపై హౌజింగ్ శాఖ తరువాయి 2లో

## ఇక ఎంఎల్‌సిల వంతు!

### త్వరలోనే కారు దిగి కాంగ్రెస్ గూటికి

సంప్రదింపులు జరుపుతున్న నాయకులు

శాసన మండలిలో బలం పెంచుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు



ప్రజాపక్షం/హైదరాబాద్ త్వరలోనే కొందరు బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు 'కారు'దిగే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు ఎంఎల్‌సిలతో కాంగ్రెస్ ముఖ్యనేతలు సంప్రదింపులు జరిపినట్టు సమాచారం.శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందే బిఆర్‌ఎస్‌కు చెందిన ఎంఎల్‌సిలు అధికార పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాసనమండలిలో కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్, బ ల్మూరి వెంకట్, తీన్మార్‌మల్లన్న ఉండగా, బిఆర్‌ఎస్‌కు చెందిన పట్నం మహేంద ర్‌రెడ్డి, దామదర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. త్వరలోనే మరి కొందరు ఎంఎల్‌సిలు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎంఎల్‌సిలతో ఇది వరకే కొందరు కాంగ్రెస్ ముఖ్యులు సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. అయితే వీరంతా ఒకేసారి కాంగ్రెస్‌లో చేరుతారా? లేదా? ఎంఎల్‌ఎల తరహాలో ఒక్కక్కరుగా పార్టీకి రాజీనామా చేస్తారా? అనేది త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ప్రభుత్వ బిల్లులపై చర్చ, వాటి ఆమోదం అంశంలో శాసనమండలిలో సభ్యుల మద్దతు కీలకం కానుంది. ప్రస్తుతం శాసనమండలిలో 38 మంది సభ్యులు ఉండగా, గవర్నర్ కోటాలో మరో రెండు ఎంఎల్‌సి పదవులు ఖాళీగా ఉన్నాయి. కాగా బిఆర్‌ఎస్‌కు 29 మంది సభ్యుల బలం ఉండగా ఇందులో ఇప్పటికే ఇద్దరు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం ఆరు ఎంఎల్‌సిలకు చేరింది. మిగతా స్థానాల్లో ఎంఐఎంకు రెండు, బిజెపికి ఒక్కటి, మరో రెండు ఉపాధ్యాయ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఎంఎల్‌సిలు ఉన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడం, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం ఒక్క సీటు తరువాయి 8లో

## మేధా పాట్కర్‌కు ఐదు నెలల జైలు



**న్యూఢిల్లీ :** ఓ పరువు నష్టం కేసులో సామాజిక కార్యకర్త, 'నర్మదా బచావో ఆందోళన్' ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష విధించింది. 23 ఏళ్ల క్రితం నాటి ఈ కేసును ప్రస్తుతం ఢిల్లీ ఎల్‌జిగా ఉన్న వికె సక్సేనా దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈ ఏడాది మేలో ఆమెను దోషిగా నిర్ధరిస్తూ తీర్పు వెలువరించారు. తాజాగా ఐదు నెలల సాధారణ జైలు శిక్షను ఖరారు చేయడంతోపాటు రూ.10 లక్షల జరిమానా విధించారు. అయితే.. తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు వీలుగా శిక్షను ఒక నెల పాటు నిలుపుదల చేశారు. మేధా పాట్కర్, వికె సక్సేనాల మధ్య 2000 సంవత్సరం నుంచి న్యాయపోరాటం సాగుతోంది. తనతో పాటు 'నర్మదా బచావో ఆందోళన్'కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారనే ఆరోపణలపై సక్సేనాపై ఆమె అప్పట్లో కేసు వేశారు. ఆ సమయంలో ఆయన గుజరాత్‌లోని అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న 'నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే ఎన్జీవోకు చీఫ్‌గా ఉన్నారు. మరోవైపు.. ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో తనను కించపరిచేలా తరువాయి 8లో

## రెండు క్షిపణులను ప్రయోగించిన ఉత్తర కొరియా



దక్షిణ కొరియా, అమెరికా, జపాన్‌ల సైన్యాల సంయుక్త విన్యాసాల నేపథ్యంలో ఉత్తర కొరియా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ఉత్తర కొరియా సైన్యం వెల్లడించింది. అందులో ఒకటి విఫలమైందని పేర్కొంది. మూడు దేశాల విన్యాసాలను 'ఆసియా నాటో'గా పోల్చిన ఉత్తర కొరియా, అందుకు తీవ్ర స్పందన తప్పదని హెచ్చరించింది. ఆ మేరకు సోమవారం నాడు క్షిపణులు ప్రయోగించినట్లు భావిస్తున్నారు.



ఉత్తర కొరియా నైరుతి జంగ్యాంగ్ పట్టణ నుండి ఈశాన్య దిశగా పది నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను ప్రయోగించారని దక్షిణ కొరియా మిలిటరీ జాయింట్ ఛీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి క్షిపణి 600 కిలోమీటర్లు, రెండవ క్షిపణి 120 కిలోమీటర్లు ప్రయాణించాయని, వి ఎక్కడ పడిపోయాయో తెలియనది పేర్కొన్నారు. రెండవ క్షిపణిలో సమస్య తలెత్తి మధ్యలోనే పేలిపోయిన అవకాశం ఉందని దక్షిణ కొరియా మిలిటరీ అధికార ప్రతినిధి లీ సుంగ్ జూన్ వెల్లడించారు.

## భద్రతా మండలిలో రష్యా వ్యతిరేక వాతావరణం: పెస్కోవ్

### నెల రోజుల పాటు రష్యాకు అధ్యక్ష స్థానం



ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో రష్యాకు అత్యంత వ్యతిరేక వాతావరణం ఉందని రష్యా అధ్యక్ష అధికార ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో రష్యాకు ఒక నెల అధ్యక్షత నిర్వహించే అవకాశం జూలై 1వ తేదీ నుండి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నెల రోజులలో భద్రతా మండలిలో నిష్పాక్షికత తీసుకురాగలుగుతారా అని మీడియా అడిగిన ప్రశ్నకు పెస్కోవ్ స్పందిస్తూ భద్రతా మండలిలో రష్యా పట్ల అత్యంత ఘర్షణపూరిత వాతావరణం నేపథ్యంలో వచ్చే నాలుగు వారాలలోనే మార్పు కష్టమేనని అన్నారు. సోమవారం నాడు భద్రతా మండలిలో అధ్యక్ష స్థానంలో రష్యా తొలి సమావేశం నిర్వహించి, వచ్చే నెల రోజుల ఎజెండాను ఆమోదించింది.

## డ్రోన్ దాడిలో 18 మంది ఇజ్రాయిల్ సైనికులకు గాయాలు

ఇజ్రాయిల్ ఆక్రమిత గొలన్ హైట్స్ ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో 18 మంది ఇజ్రాయిల్ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు వెల్లడించారు. ఈ దాడులు గొలన్ హైట్స్‌కు ఉత్తర ప్రాంతం నుండి జరిగాయని, అయితే డ్రోన్ ఎక్కడి నుండి వచ్చిందని మాత్రం ఇజ్రాయిల్ రక్షణ దళాలు వెల్లడించలేదు. అయితే, హెజ్బుల్లానే డ్రోన్ దాడులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. లెబనాన్‌కు చెందిన గొలన్ హైట్స్‌ను ఆక్రమించడంతో ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చునని అనుకుంటున్నారు.

# ఫ్రాన్స్ ఎన్నికలలో ఎవరికీ లభించని మెజారిటీ

* తొలిరౌండ్‌లో మితవాద పార్టీ ఆర్‌ఎన్ ముందంజ, ద్వితీయ స్థానంలో వామపక్ష కూటమి
* జూలై 7న రెండవ రౌండ్ ఎన్నికలు
* విశాల కూటమితో 'ఆర్‌ఎన్'ను నిలవరిద్దామని అధ్యక్షుడు మ్యాక్రోన్ పిలుపు
* మితవాదపార్టీ ముందంజపై ఆందోళనలో ఫ్రెంచ్ పౌరులు, పలునగరాలలో నిరసనలు



మెరైన్ లీ పెన్ (ఆర్‌ఎన్)



జీన్ లక్ మెలెంకాన్ (వామపక్షం)



ఎమ్మాన్యుయెల్ మ్యాక్రోన్ (ఎన్‌సెంబుల్ కూటమి)

ఫ్రాన్స్ దేశంలో జాతీయ అసెంబ్లీకి జరిగిన ఆకస్మిక ఎన్నికల తొలి రౌండ్‌లో అతి మితవాద నేషనల్ ర్యాలీ(ఆర్‌ఎన్) పార్టీ ముందంజలో ఉంది. మెరైన్ లీ పెన్ ఆధ్వర్యంలోని ఆర్‌ఎన్, దాని మిత్రపక్షాలకు 33.14 శాతం (1.63 కోట్లు) ఓట్లు లభించాయి. మరోవైపు వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌ఎఫ్‌పి) 28 శాతం (90 లక్షల) ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మ్యాక్రోన్ నేతృత్వంలోని ఎన్‌సెంబుల్ కూటమి 20 శాతం (64 లక్షల)ఓట్లతో తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. కాగా, ఫ్రెంచ్ ఎన్నికలలో 1997 తరువాత అత్యధికంగా 68 శాతం మంది ఓట్లేశారు. తొలి రౌండ్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఫ్రాన్స్ దేశంలోని ప్యారిస్, లయాన్, నాంంట్లెస్, తదితర పెద్ద నగరాలలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి.

వేలాది మంది ఆర్‌ఎన్ పార్టీ వ్యతిరేకులు వామపక్ష కూటమి ప్యారిస్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్ ఎన్నికల ఫలితాలను ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా విడుదల చేసింది. జాతీయ అసెంబ్లీలోని 577 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 78 చోట్ల అభ్యర్థులు 50 శాతానికి పైగా ఓట్లు సాధించి విజయం సాధించారు. అందులో 38 స్థానాలు ఆర్‌ఎన్ పార్టీకి చెందినవి. గెలిచిన వారిలో లీపెన్ కూడా ఉన్నారు. ఆర్‌ఎన్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన మంత్రి అభ్యర్థి జోర్డన్ బార్డెల్లా ఫలితాలపై స్పందిస్తూ రెండవ రౌండ్ ఎన్నికలు ఫ్రాన్స్ దేశానికి అత్యంత ముఖ్యమైనవని అన్నారు. మ్యాక్రోన్ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని, వామపక్ష పార్టీలు ఉనికి సంక్షోభంలో ఉన్నాయని, ఫ్రాన్స్ దేశానికి అసలైన ప్రమాదరకమైనవని అన్నారు.

**విశాల ప్రజాస్వామిక కూటమి కోసం మ్యాక్రోన్ పిలుపు**

ఆర్‌ఎన్ పార్టీ విజయ, ప్రభుత్వ ఏర్పాటు అవకాశాలు, ఆ పార్టీ ప్రత్యర్థులు రానున్న రోజుల్లో తీసుకునే వైఖరిపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో అతి మితవాద పార్టీని అధికారం నుండి దూరం పెట్టేందుకు మధ్యేవాద–మితవాద, మధ్యేవాద–వామపక్ష పార్టీలు కలిసి పని చేశాయి. ఈ నేపథ్యంలో అతి మితవాద పార్టీ ఆర్‌ఎన్‌కు వ్యతిరేకంగా విశాల ప్రజాస్వామిక కూటమి ఏర్పాటుకు మ్యాక్రోన్ పిలుపునిచ్చారు. 'రెండవ రౌండ్ ఎన్నికల్లో అతి మితవాద ఆర్‌ఎన్ పార్టీని ఎదుర్కొనేందుకు విశాల, స్పష్టమైన ప్రజాతంత్ర, గణతంత్ర కూటమి ఏర్పాటుకు సమయం ఆసన్నమైందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రౌండ్ పోలింగ్‌లో అత్యధిక ఓటర్లు ఓటేయ్యడాన్ని ప్రస్తావిస్తూ, మన సహపౌరులంతా తమ ఓటు ద్వారా రాజకీయ పరిస్థితుల పట్ల తమ ఆకాంక్షను వ్యక్తం



చేశారని అన్నారు. మరోవైపు ప్రధాని గ్యాబ్రియెల్ అట్టల్ మాట్లాడుతూ అతి మితవాదులు అధికార తలుపుల వద్ద ఉన్నారని, ఆర్‌ఎన్ పార్టీకి ఒక్క ఓటు కూడా పోకూడదని అన్నారు.




**మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థులను ఉపసంహరిస్తాం: వామపక్షం**

వామపక్ష కూటమి న్యూపాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎస్)కు నేతృత్వం వహిస్తున్న జీన్ లక్ మెలెంకాన్ మాట్లాడుతూ తొలి రౌండ్ ఎన్నికల్లో మూడవ స్థానంలో నిలిచిన వామపక్ష అభ్యర్థులను రెండవ రౌండ్ ఎన్నికల్లో ఉపసంహరించుకుంటామని, తద్వారా ద్విముఖ పోటీలో అతివాద ఆర్‌ఎన్ అభ్యర్థులను అధిక సంఖ్యలో ఓడించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. తొలి రౌండ్ ఎన్నికల్లో ఎవరికీ 50 శాతం ఓట్లు లభించకపోతే, మొదటి ఇద్దరు అభ్యర్థులు రెండవ రౌండ్ ఎన్నికకు అర్హులవుతారు. వారితో పాటు 12.5 శాతం ఓట్లు నమోదైన అభ్యర్థులు కూడా పోటీలో ఉంటారు. వారిలో అత్యధిక ఓట్లు పొందే వారిని విజేతగా ప్రకటిస్తారు. తమ సిద్ధాంతాలు, గత ఎన్నికల వైఖరుల దారిలోనే తాము ఆర్‌ఎన్‌కు ఎన్నటికీ విజయం దక్కనీయబోమని మెలెంకాన్ స్పష్టం చేశారు.

ఆర్‌ఎన్ పార్టీ అధికారం ముంగిట నిలవడంతో మన ప్రజాస్వామ్యం, గణతంత్ర విలువలు ప్రమాదంలో పడ్డాయని ఫ్రెంచ్ డెమోక్రటిక్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ మాజీ సెక్రెటరీ జనరల్, ప్రస్తుత యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ అధ్యక్షులు లారెంట్ బెర్గర్ వ్యాఖ్యానించారు. ప్రమాదం ముంగిట అతి మితవాదాన్ని అడ్డుకోవడం అత్యంత కీలకమని అన్నారు.

## ఖైదీలు రిలీజ్ (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది.సీతక్కకు హోం శాఖ వచ్చే అవకాశాలు : త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు,చేర్పులు ఉంటాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంత్రి సీతక్కకు హోం శాఖ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో తనను కలిసిన జర్నలిస్టులతో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కొత్తగా ఐదుగురికి మంత్రి వర్గంలో చోటు దక్కనుందని, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దానం నాగేందర్‌తో పాటు నిజామాబాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలోనికి తీసుకునే అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 161 ప్రకారం గవర్నర్ ఖైదీలకు క్షమాభిక్ష కల్పించడం, శిక్షల నుంచి ఉపశమనం కల్పించే అధికారం ఉన్నది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి, జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

## ఢిల్లీ హైకోర్టులో కవితకు నిరాశ..

(మొదటి పేజీ తరువాయి)

14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉంటున్నారు. దీంతో తనపై సిబిఐ, ఇడి నమోదు చేసిన కేసులపై బెయిల్ కోరుతూ గతంలో రెండు వేర్వేరు పిటిషన్లను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కవిత దాఖలు చేయగా.. విచారించిన ఆ న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులను ఆమె ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. కవితను నిరాధార ఆరోపణలతో అరెస్టు చేశారని, ఒక పార్టీకి కీలక నేతగా ఉన్నా ఆమెకు ఎలాంటి అవకాశాలు కల్పించకుండా ఉంచారంటూ ఆరోపిస్తూ ఆమె తరఫు న్యాయవాదులు వాదించారు. ఇడి, సిబిఐ తరఫున వాదనలు వినిపిస్తూ.. ఢిల్లీ మద్యం కేసులో కవిత కీలక పాత్రధారి, సూత్రధారి అని కోర్టుకు తెలిపారు. ప్రస్తుత ం ఢిల్లీ మద్యం కేసు కీలక దశలో కొనసాగుతున్న తరుణంలో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని వాదించారు. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో ఆమెకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. సిబిఐ, ఇడి వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## 'నీట్'పై చర్చకు ప్రతిపక్షాల పట్టు

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకల అంశాన్ని లేవనెత్తారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కల్పించుకుని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసేంత వరకు ప్రత్యేక చర్చలు కుదరవని తేల్చి చెప్పారు. దీంతో రాహుల్ మాట్లాడుతూ అతి ముఖ్యమైన అంశమైనందున నీట్‌పై ఒకరోజు చర్చ జరపాలని తాము కోరుతున్నామన్నారు. దాదాపు రెండు కోట్ల మందిపై నీట్‌లో జరిగిన అవకతవకల ప్రభావం పడిందన్నారు. 70 సందర్భాల్లో పేపర్లు లీక్ అయ్యాయన్నారు. అంశంపై ప్రత్యేక చర్చకు అనుమతిస్తే తాము చాలా సంతోషిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఉపపక్షనేత అయిన రాజ్‌నాథ్ మాట్లాడుతూ సభకు కొన్ని నియమాలు, విధానాలు ఉన్నాయని, ఆరోగ్యవంతమైన సంప్రదాయం కూడా ఉందని గుర్తుచేశారు. ఒక పార్లమెంట్ సభ్యుడిగా తన సుదీర్ఘ అనుభవంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చర్చ కంటే ముందు ఏ అంశంపై కూడా ప్రత్యేక చర్చ జరగడం చూడలేదన్నారు. ఏ సమస్యనైనా ధన్యవాద తీర్మానం చర్చ ముగిసిన తరువాతే లేవనెత్తాలన్నారు. రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై రాహుల్, ఇతర ప్రతిపక్ష సభ్యులు స్పందిస్తూ ధన్యవాద తీర్మానం చర్చ ముగిసిన నీట్ వ్యవహారంపై సభలో చర్చించాలని పట్టుబట్టారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. నీట్ అంశం అతి ముఖ్యమైనదని, పార్లమెంట్ వేదికగా మనం విద్యార్థులకు ఒక సందేశం పంపాలని రాహుల్ సూచించారు. స్పీకర్ ఓమ్ బిర్లా కల్పించుకుని మాట్లాడుతూ ధన్యవాద తీర్మానం చర్చ సందర్భంగా మరే ఇతర అంశంపై కూడా చర్చ చేపట్టలేమన్నారు. నీట్‌పై చర్చకు ప్రత్యేక నోటీసు ఇవ్వాలని ప్రతిపక్ష సభ్యులకు సూచించారు. దీంతో నీట్‌పై ప్రత్యేక చర్చ జరిపేందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని తమ ఆందోళనను కొనసాగించి కొద్దిసేపటి తరువాత సభను వాకౌట్ చేశారు.

## రాజ్‌భవన్ ముట్టడి (మొదటి పేజీ తరువాయి)

యుజన సంఘాల నేతలు పీపుల్స్ ప్లాజా నుంచి రాజభవన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. అదే సమయంలో రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమావేశమైయ్యారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు విద్యార్థి సంఘాల నేతలను ఐమ్యాక్స్ సర్కిల్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చేసుకోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తతచోటు చేసుకుంది. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమైన ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పిడిఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు పి. మహేష్, పి. రామకృష్ణ, విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్,పి.వై.ఎల్.రాష్ట్ర అధ్యక్షులు .కె.ఎస్.ప్రదీప్, యువ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా,వివిధ సంఘాల నేతలు చందన రెడ్డి, విష్ణు, అభిజిత్ యాదవ్,మన్నే జీవన్, జాన్, సోహయల్ ఎస్.ఎఫ్.ఐ అశోక్ రెడ్డి,రజినీకాంత్, శంకర్, మమత, రామకృష్ణ, మహేష్, రఘురాం నాయక్, రఘు , ఆజాద్,ఎస్వీ. శ్రీకాంత్, నరేందర్, సురేష్,గడ్డం శ్యామ్, శ్రీను శేఖర్, గోపి, దిలీప్, వీర నాయక్ శ్రీమాన్,సత్య ప్రసాద్, ఆర్. బాల కృష్ణ షేక్ మహమూద్, జావీద్,హాష్మీ బాబు,క్రాంతి, కృష్ణ బి.ఎస్ కృష్ణ,రవి కుమార్‌లను పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీసు మైదానానికి తరలించారు.

**కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేవరకు ఉద్యమం :** ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థుల పక్షాన మాట్లాడకుంటే సంఘటిత ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకులు సర్వసాధారణంగా మారాయని, ఈ లీకుల కారణంగా దేశ ప్రతిష్ట మసకబారుతోందని ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్‌తో పాటు విద్యార్థి , యువజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా కేంద్ర ప్రభుత్వం పరీక్షలు రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో గత 20 రోజులుగా నీట్ ను పరీక్షను తక్షణమే రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపడుతున్నామని ఇందులో భాగంగానే గవర్నర్‌ను కలిసిందుకు అనుమతి కోరితే ఆయన నిరాకరించడంతోనే రాజ్ భవన్ ముట్టడి చేపట్టామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని లేకపోతే అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ స్పందించకపోతే నీట్ కౌన్సిలింగ్ రోజు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## 22.50లక్షల ఇళ్లు (మొదటి పేజీ తరువాయి)

దృష్టి సారించాలన్నారు.ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన హౌజింగ్ బోర్డు ఇండ్ల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ నుంచి భూమిని సేకరించుకోవాలని సూచించారు.

**పేదవాడికి ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో తలదాచుకోవడానికి నీడ అంతే ముఖ్యం: పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. పేదవాడికి ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో తల దాచుకోవడానికి నీడ అంతకన్నా ముఖ్యమన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ పథకాని భద్రాచలం రాములవారి సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిన విషయాన్ని గుర్తు చేశారు.

వచ్చే 5 ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొద టి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4, 16,500 ఇళ్లతో పాటు రిజర్వ్ కోట కింద మరో33,500 ఇళ్లను నిర్మించనున్నామని, ఇందుకు అవసరమైన రూ.22,500 కోట్లను బడ్జెట్లో కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

గడిచిన 10 ఏళ్లలో సొంత ఇంటి సాకారం అనేది పేదవారికి అందని ద్రాక్షలా మారిందని మంత్రి ఆవేదం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికి కనిపిస్తున్నాయని అన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి పని చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలి అన్నారు. గడిచిన 10 సంవత్సరాలలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం హాయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి వివరాలతో రావాలని అధికారం ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హిందువులే కాదు (మొదటి పేజీ తరువాయి)

ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, జైనమతం, సి క్కు మతాలను ఉదహరిస్తూ అన్ని మతాలు ధైర్యం గురించి మా ట్లాడతాయని రాహుల్ ఉద్ఘాటించా రు. రాజ్యాంగం, భారతదేశ ప్రాథమిక ఆలోచనపై బిజెపి క్రమబద్ధమైన దాడులను ప్రారంభిస్తోందని, అధికార పార్టీ ప్రతిపాదించిన సిద్ధాంతాలను లక్షలాది మంది ప్రజలు ప్రతిఘటించారన్నారు. తనపైనా వ్యక్తిగతంగా దాడి జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు.

కొందరు నేతలు ఇప్పటికీ జై లులో ఉన్నారని చెప్పారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు, తనపై 20 కేసులు నమోదయ్యాయని, తనకు ఇచ్చిన ఇంటిని కూడా లాగేసుకున్నారని ఆరోపించారు. ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) 55 గంటలకు పైగా ప్రశ్నించిందని వివరించారు. అన్ని మతాలు ధైర్యంగా ఉండమనే ప్రబోధిస్తున్నాయని రాహుల్ వివరించారు. అయితే హిందువులుగా చెప్పుకుంటున్న వారు 24 గంటలూ కేవలం అహింస, ద్వేషం, అసత్యమే మాట్లాడుతున్నారని, మీరు అసలు హిందువులేనా అని రాహుల్ ప్రశ్నించారు. అధికారం, సంపద కేంద్రీకరణ, పేదలు, దళితులపై దమనకాండ గురించి ప్రశ్నించిన వారిని అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, రైతుల సమస్యలు కేంద్రానికి పట్టవని అన్నారు.

శివుడి ఫొటోను చూపుతూ తాను శివుడి నుంచి ప్రేరణ పొందానని అన్నారు. శివుడి ఫొ టోను, రాజ్యాంగ ప్రతిని సభలో చూపడం తప్పె లా అవుతుందని ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ, అధికార పక్ష నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

**'నీట్'ను కమర్షియల్‌గా మార్చేశారు : రాహుల్**

కాగా, 'రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, అగ్నివీర్‌ల ప్రస్తావన లేదు. ప్రొఫెషనల్ పరీక్ష అయిన 'నీట్'ను కమర్షియల్‌గా మార్చారు.

గతంలో తీసుకొచ్చిన రైతు చట్టాల వల్ల 700 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. వారికి సంతాపంగా సభలో మౌనం కూడా పాటించలేదు. బిజెపి హయాంలో సంస్థలు నిర్వీర్యమయ్యాయి. దేవుడితో ప్రత్యక్షంగా మాట్లాడతానని స్వయం గా ప్రధాని చెప్పారు. బిజెపి ప్రభుత్వం.. జమ్ముకశ్మీర్‌ను రెండు ముక్కలు చేసింది.

అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోయినా.. ఇప్పటి వరకు ప్రధాని వెళ్లలేదు. అక్కడ నా కళ్లముందే పిల్లలపై బుల్లెట్ల వర్షం కురిసింది. నోట్ల రద్దు వల్ల యువత ఉపాధి కోల్పోయింది. జిఎస్‌టి వల్ల వ్యాపారులు, ప్రజలు అనేక బాధలు పడ్డారు. వీటి వల్ల దేశప్రజలకు కలిగిన లాభం ఏంటి?' అని ప్రశ్నించారు.

## కెసిఆర్‌కు హైకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

నరసింహారెడ్డి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని వాదనల సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. విద్యుత్ కమిషన్ ఛైర్మన్ ముందే ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆధారాలు లేవని చెప్పింది. కేవలం విలేకర్ల సమావేశం నిర్వహించారనే కారణంతో జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరించారని అంటున్నారన్నారు. అనుమానించడం కాదని, దానికి తగిన ఆధారాలు చూపించాలని హైకోర్టు కోరింది. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిపై చేసిన ఆరోపణలను నిరూపించడంలో కెసిఆర్ విఫలమయ్యారని పేర్కొంది. కెసిఆర్‌కు జారీ చేసిన నోటీసుల్లో కమిషన్ ఛైర్మన్ ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదంది. విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణం గురించి తెలుసుకోవడానికే ఆయనకు నోటీసులు జారీ చేశారని స్పష్టం చేసింది. ఇవన్నీ పరిశీలించిన తర్వాత పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చినట్లు హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

## జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌ను చూసి కెసిఆర్ భయపడుతున్నారు

### ఎంఎల్‌ఎ యొన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ కమిషన్‌ను చూసి కెసిఆర్ ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎల యొన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు.హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేశారని, దీర్ఘకాల కొనుగోలుకు,కమిషన్‌లకు కక్కుర్తి పడి అత్యధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేశారని ఆరోపించారు.ఇండియా బుల్ కంపెనీ వద్ద కమీషన్లను తీసుకున్నారని, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కూడా అవినీతి జరిగిందని యొన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ కమిషన్ ద్వారా అవినీతి అక్రమాలు బయటకు వస్తాయని, అందుకే కెసిఆర్ కమిషన్‌ను కూడా బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను తిరస్కరించేలా ప్రవర్తి స్తున్నారని,ఇలాగే చేస్తే బిఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## అత్యుత్తమ భద్రతా ప్రమాణాలకు.. హైదరాబాద్ మెట్రోకు గోల్డెన్ పికాక్ పురస్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో మెట్రో రైలును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి మెట్రో రైల్ లిమిటెడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించడంలో గల నిబద్ధతకు రైల్వేస్ విభాగంలో గోల్డెన్ పికాక్ పురస్కారాన్ని అందుకుంది.



బెంగళూరులో జరిగిన ప్రతిష్టాత్మక 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ 25వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్ కార్యక్రమంలో పురస్కారాల ప్రదానం చేశారు. మొత్తం 778 దరఖాస్తులు రాగా, తీవ్రమైన పోటీలో విజేతగా నెగ్గిన ఎల్ అండ్ టి మెట్రో రైల్ సంస్థ, భద్రతా ప్రమాణాల పాటింపులో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుందని కెవివి రెడ్డి తెలిపారు. ఉద్యోగుల భద్రత, సంక్షేమం విషయంలో కృషికిగానూ ఈ పురస్కారం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ పురస్కారం తమకెంతో స్ఫూర్తినిస్తూ, నిరంతరం కృషి చేసేలా ప్రోత్సాహకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఎల్ అండ్ టిఎంఆర్‌హెచ్‌ఎల్ సిఓఓ సుధీర్ చిప్లుంకర్ సమక్షంలో జస్టిస్ ఉదయ్ యు. లలిత్ చేతుల మీదుగా గోల్డెన్ పీకాక్ పురస్కారాన్ని కెవిబి రెడ్డి అందుకున్నారు.

## కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పర్యాటకశాఖ ఎండిని కలిసిన
చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** టూరిజం శాఖ ఎండిగా ప్రకాశ్ రెడ్డి నూతన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సోమవారం తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియూసి) గౌరవాధ్యక్షులు చాడా వెంకట్ రెడ్డి, అధ్యక్షులు వివిఎస్ బోస్‌ల నేతృత్వంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల సమస్యలపై సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఎండి ప్రకాశ్ రెడ్డితో మాట్లాడుతూ 25 సంవత్సరాల నుండి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, అదే విధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎండి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తానని, అలాగే అందరి సహకారంతో పర్యాటక శాఖను ముందుకు తీసుకువెళ్దామని అన్నారు. ఎండిని కలిసిన వారిలో యూనియన్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి , గోపి , జ్యోతి , రాజలక్ష్మి ,సుఖన్య, రచన, మధురారెడ్డి, మౌలాలీ, ఎలందిర్ రెడ్డి, ఉడుత రమేష్ , ఎక్బాల్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగాల భర్తీని ప్రారంభించండి: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రి యను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామరావు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే బిఆర్‌ఎస్ ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగుల డిమాండ్ల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు తమ నాయకులను అరెస్టు చేయడం పట్ల ఆయన మండిపడ్డారు. గాంధీ ఆసుపత్రికి వెళ్లిన వారిపైన లాఠీ ఛార్జ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అప్రజా స్వామ్య చర్యలను మాను కోవాలని ప్రభుత్వానికి సూచించారు. పోలీసుల అదుపులోనికి తీసుకున్న తమ పార్టీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డ్ ఐఎఎస్ శ్రీనివాసరాజు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కె.ఎస్.శ్రీనివాసరాజు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టులు, ము ఖ్యమైన సిఎస్ఆర్ ప్రాజెక్టులకు సలహాదారుగా శ్రీణివాసరాజు వ్యవహరించనున్నారు.

## వరంగల్ బాలుడికి ఇప్పటికే ప్రభుత్వ సాయం అందింది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంలో చోటుచేసుకున్న ఓ దృశ్యం తాలూకు సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరలైందని కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో తెలిపింది. ఆ బాధితుడికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ పట్టణానికి చెందిన మహమ్మద్ నసీమ్ అహ్మద్ కుమారుడు ఆదిల్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్య ఇదివరకే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అధికార యంత్రాంగం ఆ కుటుంబాన్ని సంప్రదించి, అవసరమైన ప్రక్రియను చేపట్టింది. హైదరాబాద్‌లోని బసవతారం ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వారి పేరు మీద గత జనవరి 9వ తేదీ రోజునే రూ.1 లక్ష ఎల్ఓసి జారీ చేయడం జరిగింది. అంతేకాదు, ముఖ్యమంత్రి సహాయ నిధిని కూడా వారికి చేరవేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారులు ఆ బాలుడి కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఈ సంఘటన ఒక్కటే కాదు, తెలంగాణలో ఏ పేద కుటుంబానికైనా అనుకోని ఆపద వచ్చినా, అత్యవసర సహాయమైనా ఆదుకోవడానికి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా చిన్నపిల్లల సమస్యల విషయంలో ప్రజా ప్రభుత్వం మానవీయ దృక్పథంతోనే ముందుకు వెళుతోందని కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో పేర్కొంది.

## సేవల నిమిత్తం నిమ్స్‌కు రూ.2.1 కోట్ల విరాళం




**ప్రజాపక్షం / హైదరాబాద్:** పిల్లలకు ప్రత్యేక సంరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, పీడియాట్రిక్ ఎపిలెప్సీ సెంటర్ ఏర్పాటు, క్రెష్ సౌకర్యాల పునరుద్ధరణ లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కు ప్రీమియర్ ఎనర్జిస్ లిమిటెడ్ రూ.2.1కోట్ల విరాళం అందజేసింది. రోటరీ క్లబ్‌ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ (రోటరీ డిస్ట్రిక్ట్ 3150, ఇండియా), ప్రీమియర్ ఎనర్జిస్ లిమిటెడ్, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) సహకారంతో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తాన్ని అందజేశారు. ఈ మేరకు రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, ప్రీమియర్ ఎనర్జిస్ లిమిటెడ్, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సోమవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేశాయి. ఈ కార్యక్రమంలో శరత్ చౌదరి, కార్యక్రమంలో గౌరవ అతిథిగా గట్టు జ్ఞాన్ ప్రకాష్ పాల్గొన్నారు.

## ఎస్‌సిఆర్ అధికారిగా సౌరభ్ బందోపాధ్యాయ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్‌గా సౌరభ్ బందోపాధ్యాయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ 1990 బ్యాచ్‌కి చెందినవారు. సౌరభ్ బందోపాధ్యాయ 1990లో భోపాల్‌లోని ప్రతిష్టాత్మకమైన మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో డిగ్రీని పూర్తి చేశారు. 21 సంవత్సరాల వయస్సులో మొదటి ప్రయత్నంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ రైల్వే సంబంధిత టెక్నాలజీల రంగంలో దేశంలోను విదేశాలలో ముఖ్యమైన సెమినార్లు సమావేశాలలో కూడా పాల్గొన్నారు.

# 'బొగ్గు' వేలం రద్దు చేయాలి

5న వామపక్షాలు, కార్మిక సంఘాల నిరసన
రాష్ట్ర వామపక్ష పార్టీల సమావేశం నిర్ణయం
వేలం పాటను రద్దు చేసి బొగ్గు గనుల నేరుగా సింగరేణికి ప్పగించాలని డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వామపక్ష పార్టీలు ప్రకటించాయి. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు, హైదరాబాద్ (రెడ్‌హిల్స్) లోని సింగరేణి భవన్ వద్ద ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించాయి. బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకులు నేరుగా సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్షాలు డిమాండ్ చేశాయి. తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీల సమావేశం సోమవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రమ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డి.జి.నరసింహారావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకురాలు రమ, రామచందర్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ నాయకులు ఎం. శ్రీనివాస్, ఆకుల పాపయ్య, ఎంసిపిఐ నేత వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(యు) నుండి నాయకులు రవితేజ, ఆర్ఎస్‌పి నాయకులు ఎ.జానకి రాములు పాల్గొన్నారు. ఐదవ తేదీన జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు వామపక్షాల సమావేశం విజ్ఞప్తి చేసింది.

**17న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముందు భారీ ధర్నా :**
బొగ్గు గనులను టెండర్లను నిలిపివేయాలని, శ్రావనపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించి కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని కార్మిక సంఘాల రౌండ్ టేండ్ సమావేశం నిర్ణయించింది. ఈ నెల 10న సింగరేణిలోని అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలతో ధర్నాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ నెల 17న సింగరేణి బొగ్గు బావులను వేలం వేస్తున్న రోజున హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముందు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించాలని రౌండ్ టేండ్ సమావేశం తీర్మానించింది. కేంద్రంలో బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి అధికారానికి వచ్చిన వెంటనే 10వ సారి బొగ్గు గనుల వేలం ప్రక్రియ ప్రారంభించడాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల రౌండ్ టేండ్ సమావేశం సోమవారం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అధ్యక్షతన ఎస్‌వి కేంద్రంలో జరిగింది. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్ (సిఐటియు), జనక్ ప్రసాద్ (ఐఎన్‌టియుసి), ఎఐటియుసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహ్మారావు, రెబ్బా రామారావు (హెచ్ఎంఎస్), కె.సూర్యం(ఐఎఫ్‌టియు), ఎం.కె.బోస్ (టిఎన్‌టియుసి), రాంబాబు యాదవ్ (బిఆర్‌టియు), అనురాధ (ఐఎఫ్‌టియు), బి.మధు (సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్), కరుణకుమారి (ఎఐటియుసి), వెంకటేశ్, భూపాల్ (సిఐటియు) తదితరులు ప్రసంగించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ బొగ్గుబావుల ప్రైవేటీకరణ వల్ల సింగరేణికి, తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా, ఐక్యంగా ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై పోరాడి బొగ్గుబావులు సింగరేణికి వచ్చే విధంగా కృషి చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. రానున్న పదేళ్లలో సింగరేణి బొగ్గు బావులు మూతపడే ప్రమాదం ఉందని, కొత్త బావులు కేటాయించకపోతే సింగరేణి పూర్తి స్థాయిలో ప్రైవేటువారి చేతుల్లోకి వెలుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే వందేళ్లలో పాటు బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉండి గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రైవేటు సంస్థలు పాగ వేసి దోచుకునేందుకు టెండర్లలలో పాల్గొని కోట్లల్లో దోపిడీ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని వారు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటానికి కీలకపాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థను కాపాడుకోవాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించారు.

## చరిత్రలో నిలిచేలా మధిరను అభివృద్ధి చేస్తా

పట్టణాన్ని ఐటి హబ్‌గా మారుస్తాం
డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ మధిర:** మధిర చరిత్రలో గుర్తుండి పోయేలా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని తెలంగాణ డిప్యూటీ సిఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా మధిర మున్సిపాల్టీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు రూ.128కోట్లు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఇప్పటికే మధిర నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించటం జరిగిందని తెలిపారు. అలాగే మధిర మున్సిపాల్టీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా పరిష్కరించటం జరుగుతుందని, మధిర పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి అవసరమయ్యే అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు మధిర అభివృద్ధిని చూసి చెప్పుకునేలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని, మధిరకు త్వరలోనే ఐటి హబ్‌ను తీసుకు వస్తామన్నారు. మధిర మండలం యండ్లపల్లి గుట్ట వద్ద ఎంఎస్ఎమ్ఇ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఇ పరిశ్రమలు పెట్టుకునే విధంగా ప్రభుత్వం నుండి రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. అలాగే మహిళల స్వాలంభన కోసం ఇందిరా డైరీ ఏర్పాటు చేసి వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు ఈ ప్రాంత అభివృద్ధికి అన్నివిధాలుగా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## మోతిలాల్ నిరాహార దీక్షతో గాంధీ ఆసుపత్రి వద ఉద్రిక్తత





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గాంధీ ఆసుపత్రి వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుదద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జెఎసి నాయకులు గత వారం రోజులుగా మోతిలాల్ నాయక్ గాంధీ ఆసుపత్రిలో నిరాహార దీక్షను కొనసాగిస్తుండడంతో టెన్షన్ వాతావరణ చోటుచేసుకుంది. ఇదేక్రమంలో ఆదివారం రాత్రి ఎంఎల్‌సి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, మానవత రాయ్ తదితరలు గాంధీ ఆసుపత్రిలోమోతిలాల్ నాయక్‌ను పరామర్శించి ఆయనతో చర్చించారు. ఆయన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో అలర్ట్ అయిన బిఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీలు ప్రజాసంఘాల నాయకులు మోతిలాల్ నాయక్ పరామర్శ పేరుతో సోమవారం పెద్దఎత్తున గాంధీ ఆసుపత్రికి చేరుకుని నిరసన వ్యక్తం చేసే ప్రయత్నం చేశారు. ఈ నిరసన కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అక్కడ భారీగా పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్ బలగాలను మోహరించి వచ్చిన వారిని వచ్చినట్లుగా అరెస్టు చేశారు. అదేవిధంగా రోగులను పరామర్శించేందుకు వచ్చిన బంధులు, కుటుంబ సభ్యులను మా త్రమే ఆసుపత్రి లోపలికి అనుమతించారు. అదేవిధంగా మోతిలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు ఏనుగుల రాజేష్‌రెడ్డిలు గాంధీ ఆసుపత్రికి రాగా, వారిని ఆసుపత్రి బయటే పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పిఎస్‌కు తరలించారు. అదేవిధంగా మోతిలాల్ నాయక్‌కు మద్దతుగా నిరుద్యోగుల జెఎసి నాయకులు గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో వీరందరినీ పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. బిసి జనసభ, రాష్ట్ర విద్యార్థి నిరుద్యోగ సభ గౌరవఆధ్యక్షులు డి.రాజారాం యాదవ్‌తో పాటు పలువురు నిరుద్యోగులు ఆసుపత్రికి రావడంతో వారినిసైతం పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద ఉద్రిక్తత:** నిరుద్యోగుల డిమాండ్లపై సాధన కోసం గాంధీ ఆసుపత్రిలో నిరహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నుంచి పెద్దఎత్తున భారతీయ యువ మోర్చ నాయకులు బయలుదేరడంతో పోలీసులు వారిని అక్కడే అడ్డుకున్నారు. దీంతో బిజెవైఎం, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడమే కాకుండా పోలీసు వలయాన్ని చేధించుకునేందుకు యత్నించడంతో ఒక్కసారిగా ఉద్రిక్తతత చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

## కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్
హైకోర్టు వద్ద న్యాయవాదుల నిరసన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన నేర చట్టాలను నిరసిస్తూ సోమవారం హైకోర్టు ముందు న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఈ నూతన చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. 17వ పార్లమెంట్‌లో దీనికి సంబంధించిన బిల్లును ఆదరబాదరగా పాస్ చేశారన్నారు. ఆ సమయంలో సుమారు 145 పార్లమెంట్ సభ్యులను పార్లమెంట్ నుంచి బయటికి బలవంతంగా పంపించి వేయడం దారుణమన్నారు. సామాన్య ప్రజలకు ఈ కొత్త చట్టాల ద్వారా తీవ్ర ఇబ్బందులు ఉన్నాయన్నారు. భారతీయ న్యాయ సంహిత2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత2023, భారతీయ సాక్ష్య చట్టం2023ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చట్టాలను అమలు చేసే ముందు పార్లమెంట్‌లో క్షుణ్ణంగా చర్చించకుండానే ఏకపక్షంగాలో నిర్ణయం తీసుకోవడం సముచితం కాదన్నారు. ఈ చట్టాలను న్యాయకోవిదులు, మానవ హక్కుల సంఘాలు, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ నూతన చట్టాల అమలు తక్షణ విరిమించాలని కోరినా బలవంతంగా రుద్దడం భావ్యం కాదన్నారు. కొత్త చట్టాలపై ఇప్పటికైనా అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలని సూచించారు.ఈ నిరసన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.రాఘునాథ్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సీనియర్ న్యాయవాది జనగ్‌తో పాటు పలువురు ఆయా కోర్టుల న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎనిమిది మంది ఐపిఎస్‌ల బదిలీలు

**ప్రజాపక్షం/హదరాబాద్:** రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపిఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఐపిఎస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీస్థానం |
|---|---|---|
| పారితోష్ పంకజ్ | అదనపు ఎస్‌పి భద్రాచలం | కొత్తగూడెం ఓఎస్‌డి |
| సిరిసెట్టి సంకీర్త్ | ఎడిసి గవర్నర్ | ఓఎస్‌డి గవర్నర్ |
| గిటె మహేష్ బాబాసాహెబ్ | ఎఎస్‌పి ఏటూరునాగారం | ఓఎస్‌డి ములుగు |
| పాటిల్ కాంతిలాల్ సుభాష్ | ఎఎస్‌పి భైంసా | డిసిపి సౌత్‌ఈస్ట్ జోన్ |
| అంకిత్ కుమార్ శంఖావర్ | అదనపు ఎస్‌పి వరంగల్ | ఎఎస్‌పి భద్రాచలం |
| అవినాష్‌కుమార్ | గ్రేహౌండ్స్ కమాండర్ | ఎఎస్‌పి భైంసా |
| శేశాంద్రినిరెడ్డి | గ్రేహౌండ్స్ కమాండర్ | ఎఎస్‌పి వేములవాడ |
| శివం ఉపాధ్యాయ | గ్రేహౌండ్స్ కమాండర్ | ఎఎస్‌పి ఏటూరునాగారం |

## నీట్ పరీక్షపై విస్తృత చర్చ జరగాలి: మంత్రి రాజనర్సింహా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్యవిద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షపై విస్తృతంగా చర్చ జరగాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన మొదలుపెట్టామని,సీనియార్టీకి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. 'డాక్టర్స్ డే' సందర్భంగా హైదరాబాద్ లోని మంత్రుల క్వార్టర్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలను జాతీయ స్థాయిలో నిర్వహించాలా? లేదా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించాలా?, తద్వారా కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే లోపాలు, తదితర అంశాలపై చర్చ జరగాలని సూచించారు. పార్లమెంట్, రాష్ట్రాల్లో శాసనసభ లాంటి వేదికల ద్వారా కూడా విస్తృతంగా చర్చించి, విద్యార్థులకు ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకోవచ్చని ఆయన తెలిపారు. పది రోజుల్లో ఉస్మానియా, గాంధీ హాస్టల్ పనులు ప్రారంభిస్తామన్నారు. సామాన్యులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స, పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు ఏ వ్యాధికి ఏ ఆస్పత్రిలో చికిత్స అందుతుందనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. శివారు, మారుమూల ప్రాంతాల్లో పని చేసేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బంది వెళ్లాలని సూచించారు. అక్కడ విధులు నిర్వహించేందుకు ఏమైనా ఇబ్బందులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం తరహా సీనియర్లను పక్కన పెట్టబోమని, సీనియర్టీ ప్రాతిపదికన హెచ్ఓడీల నుంచి కింది స్థాయి వరకు మార్పులు చేస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కొత్త మెడికల్ కాలేజీలు వస్తాయన్నారు.

## మట్టిమిద్దెకూలి నలుగురు మృతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం
భర్తపరిస్థితి విషమం జిల్లా ఆస్పత్రికి తరలింపు
నాగర్‌కర్నూల్ మండలం వనపట్లలో ఘటన







**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మట్టిమిద్దెకూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలప్రకారం గౌడుగు భాస్కర్ పద్మ భార్యాభర్తలు వీరికి ఇద్దరు కుమార్తెలు పప్పి(6), వసంత(7) కుమారుడు విక్కి ఉన్నారు. భాస్కర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే భోజనం చేసి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆదివారం కురి సిన వర్షానికి అర్ధరాత్రి ఇంటిపైకప్పుకూలి తల్లి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అక్క డికక్కడే మృతిచెందారు. తండ్రి భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతోఆగ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

**మృతుల కుటుంబాలకు అండగా ఉంటా : మంత్రి జూపల్లి**
నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్లలో మట్టిమిద్దెకూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందిన ఘటనపై ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతికశాఖమంత్రి జూపల్లి కృష్ణారావు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఇల్లుకుప్పకూలి ఇంట్లో నిద్రిస్తున్న పద్మతోపాటు ఆమె ఇద్దరు కుమార్తెలు తేజస్విని, వసంత, కుమారుడు రిత్విక్ చనిపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఘటనపై అధికారులను పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి కుండపోత వర్షం పడటంతో ఇళ్లు కుప్పకూలిందని అధికారులు మంత్రికి వివరించారు. మృతుల కుటుంబానికి మంత్రి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆకు టుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్‌కు సరైనవైద్య చికిత్స అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**అదనపు జిల్లా కలెక్టర్ (షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ) చైర్మన్**
**జిల్లా కొనుగోలు కమిటీ, సంగారెడ్డి జిల్లా.**

ఆర్.సి నం.C1/48/2024 — టెండర్ ప్రకటన — తేది: .06.2024

సంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన వసతి గృహములకు కిరాణా సరుకులు 2024-25 సంవత్సరమునకు సరఫరా చేయుటకు సీల్ టెండర్లు కోరబడుచున్నాయి. టెండర్ ఫారం షెడ్యూల్ మరియు సరఫరా యొక్క నియమనిబంధనల పత్రములు రూ.3000/- (రూపాయలు మూడు వేల మాత్రమే) లకు క్రాస్డ్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఉప సంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, సంగారెడ్డి జిల్లా పేరున చెల్లించి తేది: 03.07.2024 నుండి 12.07.2024 మధ్యాహ్నం 3.00 గం.ల లోపు ఉప సంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయము, సంగారెడ్డి పొందవచ్చును. సీల్ టెండర్లు తేది: 12.07.2024 మధ్యాహ్నం 3.00 గం.ల వరకు స్వీకరించబడును. ఇట్టి సీల్ టెండర్లు అదనపు కలెక్టర్ గారి సమక్షంలో 12.07.2024 సాయంత్రం 4.00 గం.లకు టెండర్‌దారుల సమక్షంలో తెరవబడును.
గమనిక: 1. ప్రతీ టెండర్‌దారుడు తప్పనిసరిగా తాను సరఫరా చేయబోయే అన్ని వస్తువుల శాంపుల్స్‌తో టెండర్ నందు పాల్గొనవలెను. శాంపుల్స్ తేనట్టి టెండర్‌దారుడిని అనుమతించడం జరగదు. 2. ప్రతీ టెండర్‌దారుడు తప్పనిసరిగా ఈ.యం.డీ ని తమ తమ టెండరు ఫారమునకు జత చేయవలసి ఉంటుంది. 3. టెండర్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు సంబంధించిన అన్ని వసతి గృహములకు కలిపి వేయవలెను.

సం/- అదనపు కలెక్టర్ / చైర్మన్ తరపున
జిల్లా కొనుగోలు కమిటీ, సంగారెడ్డి జిల్లా

DIPR R.O. No.: 1329-PP/CL/ADVT/1/2024-25 Date: 01-07-2024

ప్రజాపక్షం
మంగళవారం, జూలై 02

# సమస్యల సుడిగుండంలో కాళేశ్వరం, పోలవరం

కృష్ణ, గోదావరి వంటి జీవనదులపై ఆనకట్టల నిర్మాణం ప్రకృతితో పోరాటం; పెద్ద ఇంజినీరింగ్ విన్యాసం; అనుభవజ్ఞులైన ఇంజినీర్లు, ఇతర సాంకేతిక నిపుణులు నిర్వహించాల్సిన పని. తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం(ఎత్తిపోతల) ప్రాజెక్టుగాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టుగాని ఇంజినీరింగ్ అద్భుతాలే. అయితే రెండు ప్రాజెక్టులూ ఇవాళ సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఇంజినీరింగ్ నిపుణులు స్వేచ్ఛగా నిర్వహించాల్సిన పనుల్లో రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం అనర్థాలకు హేతువవుతుందని ప్రస్తుత చిక్కు సమస్యలు హెచ్చరిస్తున్నాయి.

గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అన్నారం సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ఆధారంగా ఎత్తిపోసి మానవ నిర్మిత భారీ రిజర్వాయర్లలో నిల్వచేసి సేద్యానికి పారించాలి. మూడు దశల్లో నీటిని వందల మీటర్ల ఎత్తుకు వెనక్కి ఎత్తిపోయటం నిజంగా భగీరథ ప్రయత్నమే. ఆంధ్రప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉన్న నాటినుంచీ పోలవరం ప్రాజెక్టు పలుమార్లు తెరపైకి వస్తూ వెనక్కుపోతూ వచ్చింది. పలువురు ముఖ్యమంత్రులు ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు కూడా. అయితే 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ ప్రాంతాన్ని విడదీసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై పార్లమెంటులో పెట్టిన బిల్లులో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం చేపడుతుందని చేర్చారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అంతకుముందు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం తలపెట్టిన పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపడేసి, గోదావరి జలాల వినియోగంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కాగా అటు పోలవరం గోదావరి ప్రవాహమార్గాన్ని మళ్లించి నిర్మించబడుతున్న ప్రాజెక్టు. పరిశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పరుగులు పెట్టించారు. 70శాతం పైగా పూర్తయి పనులు కీలకమైన దశకు చేరిన దశలో 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆయన వెంటనే పనులు ఆపుచేసి రివర్స్ టెండరింగ్ అంటూ కొత్తగా టెండర్లు పిలిచి పాత కాంట్రాక్టర్‌ను, ఇతర ఇంజనీరింగ్ ఏజన్సీలను తొలగించి కొత్తవారిని నియమించుకున్నారు. అక్కడనుంచి పనుల వేగం తగ్గింది. 2019, 2020 సంవత్సరాల్లో భారీ వరదలు ఆనకట్ట డయాఫ్రాం వాల్‌కు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలకు బీటలు పెట్టాయి. ఏమైతేనేం, తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టులు, మేడిగడ్డ సుందిళ్ల బ్యారేజీలు బీటలు వారాయి. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం పడకేసింది. రెండు ప్రభుత్వాలు శ్వేతపత్రాలు ప్రచురించి గత ప్రభుత్వాల నిర్వాకాన్ని ఎండగట్టాయి. మేడిగడ్డ, సుందిళ్ల మరమ్మత్తుల వ్యవహారం కేంద్ర జల సంఘం ప్రవీణుల చేతిలో నలుగుతుండగా, పోలవరం పనులతో ఎలా ముందుకు సాగాలో అర్థంకాని జలసంఘం అమెరికా, కెనడాలనుంచి నిపుణులను పిలిపించింది.

కాళేశ్వరం దాదాపు లక్షకోట్లు బ్యాంకులనుండి అప్పుతెచ్చి నిర్మించిన ప్రాజెక్టు. ఇంకనూ పూర్తికావలసిన పనులున్నాయి. బ్యారేజీలు అసలు ఉపయోగపడతాయో లేదో, రిపేర్లు చేయవలసివస్తే ఎంత ఖర్చవుతుందో, ఎంతకాలం పడుతుందో ఇతమిద్ధంగా చెప్పలేని పరిస్థితి. రైతులకు ప్రయోజనం చేకూరలేదు. అసలు – వడ్డీల చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి తలకుమించిన భారం. దీనిపై రాజకీయ పరస్పర ఆరోపణలు పరిస్థితిని మెరుగుపరచవు. ఇంజినీరింగ్ నిపుణుల అంతిమ అభిప్రాయం వచ్చేవరకు వేచిచూడవలసిందే. ఈలోపు జస్టిస్ ఘోష్ కమిషన్ ఏమి నిర్ధారిస్తుందో!

పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిజంగా కల్పవల్లి. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తుంది. తాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీరుస్తుంది. సాంకేతిక సమస్యల పరిష్కారమైతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావటానికి నాలుగు సీజన్లు(నాలుగేళ్లు) అవసరమని ఉజ్జాయింపు అంచనా. ఈలోపు ప్రధాన, ఉప కాల్వలు, విద్యుత్కేంద్రం పనులు పూర్తి చేసుకోగలిగితే మరో ఐదేళ్లకైనా దాని ప్రయోజనం ప్రజలకు అందుతుంది. ప్రాజెక్టు ఎగువన మునిగిపోయే ప్రాంతాల ప్రజల పునరావాసానికి కేంద్రం నుండి నిధులు రాబట్టుకోవటం, బ్యాక్‌వాటర్స్‌తో తమ భూభాగంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలగూర్చి తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేయాలి. పునరావాస ప్యాకేజి మొత్తం సొమ్ము అంచనాపై కేంద్రప్రభుత్వం గతంలో అనేక అభ్యంతరాలు తెలిపింది, కోతపెట్టింది. ఇప్పుడు టిడిపి కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నంతమాత్రాన కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తుందనే భ్రమలో ఉండరాదు. ఎక్కడైనా బావగాని వంగతోటకాడ కాదన్న మోదీ వైఖరిని మరిచిపోరాదు. తెలంగాణ ప్రభుత్వం పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఆమోదింపచేసేందుకు లేదా మరో పేరుతోనైనా ఉదారంగా నిధులు రాబట్టుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేయాలి. కేంద్రంలో ఉన్నది ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం కావున ఇది కష్టసాధ్యమైనపని. తెలుగు రాష్ట్రాలు రెండింటి అభివృద్ధికి ఆధారభూతమైన పోలవరం, కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులు ఎంత త్వరగా పూర్తి చేయగలిగితే ప్రజలకు అంత త్వరగా మేలు జరుగుతుంది.

# తెలంగాణ రాజకీయ పరిణామాలు



సురవరం సుధాకర రెడ్డి
సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి

రాష్ట్రంలో ప్రభుత్వం సహజంగానే వాగ్దానాల అమలుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. నిధుల లేమి ప్రధాన సమస్య. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం, దాని ఆదాయం, పన్నులు తదితర రూపాల్లో గత సంవత్సరం కంటే పది శాతం పెరిగే అవకాశం ఉంటుంది. తెలంగాణలో పన్నెండు శాతం కూడా పెరిగింది. అయితే, ఖజానా ఖాళీగా ఉండటంతో పాటు, దాదాపు ఏడు లక్షల కోట్ల అప్పు, దాని చెల్లింపులు, కొత్త వాగ్దానాల అమలుకు నిధులు, వీటితో పాటు ఉద్యోగుల జీతాల పెరుగుదల, వీటన్నింటికి నిధులు సమకూర్చుకోవాలి. కేంద్రం నుండి అదనపు సహాయం అందదు.

శక్తికి మించిన వాగ్దానాలు ఇచ్చే ముందే ఆర్థిక వనరులు ఆలోచించుకోవాలి. ఆ విషయంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ బాధ్యతారాహిత్యంగానే వ్యవహరించినట్లు కనపడుతుంది. మునిసిల్ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం నెలకు 20,000 లీటర్ల ఉచిత మంచి నీళ్ళ స్కీము ప్రకటించి, బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. త్రాగునీరు సుదూర ప్రాంతం నుండి హైదరాబాద్‌కు తెప్పిస్తున్నారు. చాలా ఖర్చవుతుంది. ఉచిత మంచినీరు, పేద ప్రజలకు, క్రింది మధ్యతరగతి వర్గాలకు చాలా ఉపయోగకరం. నగరంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, అధిక వేతనం పొందే ఉద్యోగస్తులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారికి ఉచిత నీరు అనవసరం. జల మండలిని దివాళా తీయించకుండా దీనిని సరిచేయాలి.

మహిళలకు ఉచిత ప్యాసింజరు బస్సు ప్రయాణం సమంజసమే. అయితే, అందులో టికెట్ ఛార్జి చెల్లించగలిగే వారి దగ్గర తీసుకోవడానికి నిరాకరించడం అర్థరహితం. ఈ క్యాటగిరైజేషన్ నష్టమైన విషయం. కాని ప్రయత్నించాలి. రైతు భరోసా ఐదెకరాలకు పరిమితం చేయాలి. సాగుచేస్తున్న భూములకే ఇవ్వాలి. వీలైనంత త్వరగా సర్వే చేసి, గుట్టలు, వెంచర్లు, రియల్ ఎస్టేట్‌లకు ఇచ్చే డబ్బును ఆపు చేసి, ఆదా చేయాలి. డిజిటల్ సర్వే వేగంగా చేయవచ్చని అంటున్నారు. పేద రైతులకు, మెట్ట భూములకు సహాయం పెంచాలి. కౌలుదారులకు భరోసా బదలాయించాలి.

రైతుల ఆదాయం పెరగాలంటే, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించాలి. అది కేంద్రం చేతిలో ఉంటుంది. దాని కోసం పోరాడాలి. భూసారం పెంచి, ఉత్పత్తి పెంచేందుకు, రసాయనిక ఎరువుల వాడకం బాగా తగ్గించడంతో పాటు, సారం పెంచే ఇతర చర్యలు తీసుకోవాలి. సబ్సిడీ మీద ఈ చర్యలకు సహాయం చేయాలి. భూసారం పెంచే విత్తనాలు చాలా ఆలస్యంగా రైతులకు ఇస్తున్నారు. ఆ విత్తనాలు వేసవికి ముందు సరఫరా చేయాలి. భూమి లేని వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి పథకంలో ఎక్కువ రోజులు పని కల్పించి, రోజు వేతనం రూ.400లకు పెంచాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. కేంద్రం తెచ్చిన కార్మిక చట్టాలను ప్రతిఘటించాలి. స్కీము వర్కర్‌ల వేతనాలు న్యాయబద్ధంగా పెంచాలి. విద్య, వైద్యం, ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టితో నిధులు పెంచాలి. వాటిని ప్రక్షాళన చేయాలి.రఘురామ్ రాజన్ సూచించినట్లు దుబారా అరికట్టాలి. ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలి. అర్థంలేని ఉచితాలు, అనర్హులకు ఉచితాలు జాగ్రత్తగా పరిశీలించాలి. కక్ష సాధింపు చర్యలు నష్టం కలిగిస్తాయి. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా బిఆర్‌ఎస్ మనుగడ లేకుండా చేస్తే బిజెపి బలపడుతుంది. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వం త్వరలోనే పడిపోతుందని కెటిఆర్, హరీశ్‌రావు పదే పదే వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ ఫిరాయింపులకు తెరతీసింది.

కాంగ్రెస్ తమను ఓడించిందని కోపంతో బిఆర్‌ఎస్ కార్యకర్తలు పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి ఓటేసారు. యుపిలో, మహారాష్ట్రలో ఓటమి చెందిన బిజెపికి తెలంగాణలో ఎనిమిది సీట్లు వచ్చాయి. బిజెపి కూడా బిఆర్‌ఎస్‌ను అంతం చేయాలనే ప్రయత్నిస్తున్నది. ఒక్కొక్క ప్రాంతీయ పార్టీని విధ్వంసం చేసి, ఆ స్థానాన్ని ఆక్రమించేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నది. బిఆర్‌ఎస్ ప్రజాతీర్పును వినమ్రంగా అంగీకరించి, ప్రజాసమస్యల మీద కేంద్రీకరించి పార్టీని కాపాడుకోవాలి. కాంగ్రెస్ మీద విమర్శలతో బిఆర్‌ఎస్ బతకలేదు.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఇప్పుడు దూకుడు తగ్గించి సమన్వయంపై దృష్టి పెట్టాలి. కాంగ్రెస్‌లో నాయకులెక్కువ. ప్రభుత్వం తరపున ప్రకటనలు, నిర్ణయాలు ఏకపక్షంగా చేస్తే, సమయం వచ్చినప్పుడు అసంతృప్త జీవులందరు కలిసి దెబ్బకొడతారు. సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డికి సమాచారం లేకుండా జగిత్యాల ఎంఎల్‌ఏను చేర్చుకోవటంతో అసంతృప్తి బయటపడటంతో పాటు, ముఖ్యమంత్రి ప్రతిష్టకు దెబ్బతగిలింది.

గతంలో జగ్గారెడ్డికి తెలియకుండా ఆయన నియోజకవర్గంలో సభ పెట్టడంతో ఆయన ఆగ్రహించారు. ఆశావహులు ఎక్కువగా ఉన్నందున మంత్రివర్గ విస్తరణ తర్వాత అసంతృప్తులు మరింత పెరుగుతాయి. ప్రస్తుతం ఉన్న సానుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మంత్రివర్గంలో, పార్టీలో మరింత సమన్వయం, పరస్పర సంప్రదింపులు చేయాలి. అఖిలపక్ష సమావేశాలు పెట్టాలి. ప్రజలను స్వయంగా కలవాలి. సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే ప్రభుత్వాన్ని కాపాడజాలవు.

సంఘ్‌పరివార్, బిజెపి, గాయపడిన క్రూర జంతువులాగా దెబ్బ తీసేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో తీవ్రమైన పరిస్థితి ఉంటుంది. మతపరమైన ఉద్రిక్తతల ద్వారా తమ బలాన్ని పెంచుకునేందకు ప్రయత్నిస్తారు. మత సామరస్యత నిలబెట్టుకోవాలి.

# ఐక్య వియత్నాం సాధకుడు, మార్గదర్శి హోచిమిన్

చలసాని వెంకట రామారావు
9490452093

హోచిమిన్ పేరు వింటేనే ఇండో చైనా దేశాలలో సుదీర్ఘ విప్లవోద్యమం, గెరిల్లా పోరాటం స్ఫురణకు వస్తుంది. 30ఏళ్ల వియత్నాం ప్రజల వీరోచిత పోరాటం, త్యాగం గుర్తుకు వస్తుంది. హోచిమిన్ వియత్నాం కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక నాయకులు. 1890 మే 19న మధ్య వియత్నాంలోని 'కింలీన్' అనే గ్రామంలో జన్మించారు. ఫ్రెంచి వారి వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన వియత్నాం ప్రజల పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. ఇండో చైనాలో భాగంగా ఫ్రెంచి వారి వలస ప్రాంతంగా వియత్నాం ఉండేది. ఈయన అసలు పేరు గుయెన్ టాట్ థన్. 'బా' అనే పేరుతో 1911 లో ఒక ఫ్రెంచ్ స్టీమర్లో వంటపని సహాయకునిగా చేరి లండన్, ఫ్రాన్స్ లలో పనిచేశాడు. తోటమాలి, స్వీపరు, వెయిటరు, ఫోటో రీ టచరు, ఓవెన్ స్టోకర్‌గా పనిచేశాడు. ఫ్రాన్స్‌లో సోషలిస్టుగా మారిన ఈయన అనేక మారుపేర్లతో వివిధ దేశాలలో సంచరించారు. సుమారు 50కి పైగా మారుపేర్లు ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పెట్టుకున్న మారుపేరు హోచిమిన్ అసలు పేరుగా స్థిరపడింది.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత హోచిమిన్ ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో భాగం పంచుకున్నారు. తరువాత కమ్యూనిజం సిద్ధాంత అధ్యయనం కోసం మాస్కో వెళ్లారు. 1924లో చైనా వెళ్లి తన దేశీయులతో కలిసి విప్లవోద్యమ నిర్మాణం ప్రారంభించారు. 1924 జూన్ 17 నుండి జులై 8 వరకు కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్, 5వ మహాసభలో చురుకైన పాత్ర వహించారు. 1924 డిసెంబర్‌లో 'వైథయ్' పేరుతో హోచిమిన్ కాంటన్‌కు వెళ్లి వియత్నాం జాతీయవాద ఉద్యమాన్ని ప్రారంభించాడు. వియత్నాం దేశం అన్ని ప్రాంతాలలో సుశిక్షితులైన కార్యకర్తలను ఎంపిక చేసి కార్యాచరణను ప్రారంభించారు. 1927లో చైనా కమాండరుగా ఉన్న చియాంగ్ కై షేక్ చైనా కమ్యూనిస్టులను కాంటన్ నుండి బహిష్కరించారు. దానితో మళ్లీ సోవియట్ రష్యాలో ఆశ్రయం పొందవలసి వచ్చింది. సోవియట్ నుండి 1928లో బ్రస్సెల్స్, ప్యారిస్ వెళ్ళి అక్కడి నుండి సియామ్ (థాయ్‌లాండ్) వెళ్ళి అక్కడ ఆగ్నేయ ఆసియాలోని కమ్యూనిస్టు పార్టీల తరఫున కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రతినిధిగా 2 సంవత్సరాలపాటు ఉన్నారు. 1929 మేలో హాంకాంగ్‌లో జరిగిన ఒక సమావేశంలో ఇండోచైనీస్ కమ్యూనిస్టు పార్టీ(పిసిఐ) ఏర్పాటు చేయాలని నిర్ణయించి మొదటగా వియత్నాం కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. సోవియట్ యూనియన్ సలహా మేరకు దానినే ఇండో చైనీస్ కమ్యూనిస్టుపార్టీ అని పేరు మార్చారు. పిసిఐ ఏర్పాటు వియత్నాంలో మంచి ప్రభావాన్ని కలిగించింది. 1931 జూన్‌లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రతినిధిగా హాంకాంగ్‌లో ఉండగా పోలీసులు అరెస్టు చేసి 1933వరకు జైలులో ఉంచారు. జైలులో ఉండగా క్షయ వ్యాధికి గురై తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. జైలు నుండి విడుదలైన తరువాత సోవియట్ రష్యా వెళ్ళి 1935లో మాస్కోలో జరిగిన ఇంటర్నేషనల్ 7వ మహాసభలో పిసిఐ తరఫున ముఖ్య డెలిగేట్‌గా పాల్గొన్నారు. క్షయవ్యాధికి చికిత్స పొందారు. అనంతరం 1938లో తిరిగి చైనా వెళ్ళి మావో సే టుంగ్‌తో పాటు కొన్ని నెలలు ఉన్నారు. 1941లో జపాను దేశం వియత్నాంను ఆక్రమించింది. అప్పుడు హోచిమిన్ వియత్నాంలో 'వియెట్ మిన్' అనే గెరిల్లా



సైన్యాన్ని నిర్మించి జపాన్ సైన్యంతో గెరిల్లా పద్ధతిలో పోరాటం నిర్వహించారు. ఈ కాలంలోనే చియాంగ్ కై షేక్ ప్రభుత్వం హోచిమిన్‌ను అరెస్టు చేసి 18మాసాలు చైనాలో ఖైదు చేసింది. జైలులో 'కీర్తి, నోట్ బుక్ ఫ్రం ప్రిజన్' అనే పుస్తకాలు రచించారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధంలో జపాను వారు ఇండోచైనాను ఆక్రమించి ఫ్రెంచి అధికారులందరిని అరెస్టు చేశారు లేదా ఉరితీశారు. 6నెలల అనంతరం అమెరికా జపాన్‌లోని హిరోషిమాపై అణుబాంబును ప్రయోగించింది. దానితో జపాన్ పూర్తిగా ఓడిపోయింది. దీనితో హోచిమిన్ ప్రత్యర్థులుగా ఉన్న జపాన్, ఫ్రాన్స్‌లు రెండు అడ్డు లేకుండా పోయాయి. ఈ సమయంలోనే దక్షిణ చైనా పర్వతాలలో జపనీయుల కు వ్యతిరేకంగా హోచిమిన్ పోరాటం చేశారు. 1945 వసంతకాలంలో తన కమాండోస్‌తో సహా హనోయ్ వెళ్ళి తమ గెరిల్లా పోరాట సంస్థ వియత్‌మిన్ నాయకత్వంలో అధికారాన్ని హోచిమిన్ స్వాధీనం చేసుకున్నారు. వియత్నాం దేశాన్ని 'డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం'గా ప్రకటించారు.

ఫ్రెంచ్ వారికి తమ వలసలను వదిలి వేయటం ఇష్టం లేకపోవటంతో 1946 చివరలో మొదలై ఇరు సేనల మధ్య 8 సంవత్సరాల పాటు యుద్ధం జరిగింది. 1954 వరకు హోచిమిన్ గెరిల్లా పోరాటం జరిపి 'దిన్ బిన్ ఫూ' యుద్ధంలో ఫ్రెంచి వారిని ఓడించి వియత్నాం స్వాతంత్ర్యం ప్రకటించారు. 1954 మే 8న జెనీవాలో కంబోడియా, చైనా, ఫ్రాన్స్, లావోస్, బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్, ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాంలతో ఒక కాన్ఫరెన్స్ జరిగింది. దీనిలో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం జరిగింది. వియత్నాం దేశాన్ని ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాంలుగా రెండు దేశాలుగా విభజించాలని నిర్ణయించబడింది. 300 రోజుల్లో యుద్ధ దళాలను ఫ్రెంచి వారు ఉపసంహరించాలి. 1955లో లావోస్, కంబోడియాలలో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించాలి. ఈ ఒప్పందం అమలును భారతదేశం, పోలెండ్, కెనడా ప్రతినిధుల కమిషన్ పర్యవేక్షించాలి. ఈ మేరకు వియత్నాం ఉత్తర ప్రాంతాన్ని దియెత్‌మిన్ విప్లవోద్యమ కారులకు అప్పగించటం జరిగింది. ఉత్తర వియత్నాంలో సామ్యవాద సమాజ నిర్మాణానికి హోచిమిన్ పూనుకున్నారు. కానీ అమెరికా దుష్ట పన్నాగంతో దక్షిణ వియత్నాంలో కమ్యూనిస్టు వ్యతిరేక రాజ్యనిర్మాణం లక్ష్యంగా 1956 ఐక్య ఎన్నికలను తిరస్కరించింది. దానితో వియత్నాం ఏకీకరణ ఆశయంతో యుద్ధం ప్రారంభమైంది. 1954 నుండి 1975 వరకు దీర్ఘకాలం – 20ఏళ్ళపాటు యుద్ధం కొనసాగింది. దీనినే రెండవ ఇండోచైనా యుద్ధం అని కూడా పిలుస్తారు. 1960వ దశకంలో దక్షిణ వియత్నాం పాలకులకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాన్ని వియత్నాం ఏకీకరణ లక్ష్యంగా హోచిమిన్ ఉత్తర వియత్నాంలో ప్రారంభించారు. ఇదే వియత్నాం యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. దక్షిణ వియత్నాం విముక్తికై అమెరికా సైన్యాలతో పోరాటం జరిగింది.

1969 సెప్టెంబరు 3న ఆరోగ్యం క్షీణించటంతో హోచిమిన్ మరణించారు. అనంతరం కూడా దక్షిణ వియత్నాం గెరిల్లా పోరాటం కొనసాగింది. హోచిమిన్ మరణించిన 6 ఏళ్ళకు 1975లో దక్షిణ వియత్నాం కమ్యూనిస్టుల వశం కావటంతో వియత్నాం ఏకీకరణతో యుద్ధం ముగిసింది. వియత్నాంలో దీనిని 'అమెరికా యుద్ధం' అని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో 1969 నాటికి 5లక్షల అమెరికా సైన్యాలు ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. దేశం మొత్తం ఒక పాలన క్రింద ఐక్యంగా ఉండాలని కమ్యూనిస్టులు పోరాడితే, అమెరికా మద్దతుతో దక్షిణ వియత్నాం పశ్చిమ దేశాల సాయంతో మారణ హోమాన్ని సృష్టించింది. సోవియట్ రష్యా, చైనాల సాయంతో కమ్యూనిస్టు గెరిల్లా పోరాట యోధులు తెగించి ఈ యుద్ధంలో పాల్గొన్నారు. అమెరికాకు దీటుగా ఆయుధాలు, యుద్ధ సామాగ్రి, సలహాదారులను సోవియట్, చైనాలు అందించాయి. ఈ వియత్నాం యుద్ధంలో చనిపోయిన వారి సంఖ్య అపారంగా ఉంది, రెండు వైపుల అపార నష్టం జరిగింది. రెండు మిలియన్లమంది పౌరులు ఈ యుద్ధంలో చనిపోయారు. 1.1 మిలియన్ల ఉత్తర వియత్నాం యోధులు, రెండు లక్షల అమెరికా సైన్యాలు, రెండున్నర లక్షల దక్షిణ వియత్నాం ప్రభుత్వ సైనికులు ఈ యుద్ధంలో మరణించారు. వియత్నాంలో కమ్యూనిజం నిలబడితే అది మొత్తం ఆగ్నేయ ఆసియా అంతటా విస్తరిస్తుందని, పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చివేస్తుందని అమెరికా భయపడింది. అందుకే ఇంతటి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. ఆ కాలంలో అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన జాన్ ఎఫ్ కెన్నడీ, లిండన్ బి. జాన్సన్‌లు దక్షిణ వియత్నాంకు సైనిక సహాయం అందించారు. చివరకు అమెరికా విధానంపట్ల ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా పౌరులు వీధులలోకి వచ్చి నిరసన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికాపట్ల నిరసన వ్యక్తమయ్యింది. ఈ దశలో గత్యంతరం లేని పరిస్థితులలో వియత్నాం నుండి 1973 లో అమెరికన్ సైన్యాల ఉపసంహరణ ప్రారంభమైంది. చివరకు 1976 జులై 2న వియత్నాం దేశం ఒక్కటిగా "సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం"గా ఏకమైంది. సైగాన్ సిటి పేరును హోచిమిన్ సిటీ గా పేరు మార్చి రాజధానిగా ప్రకటించటం జరిగింది. దీనితో 30 ఏళ్ళ పోరాటం ముగిసింది.

ఇండో చైనా ప్రాంతంలో హోచిమిన్ ఒక ప్రముఖ విప్లవ నాయకుడు, కమ్యూనిస్టు పార్టీ నిర్మాత. 1958లో హోచిమిన్ భారతదేశాన్ని సందర్శించారు. ఒక విప్లవకారునిగా ఆయనకు భారతదేశంలో అపూర్వ స్వాగతం లభించింది. పేదదేశమైన వియత్నాం సామ్రాజ్యవాద సంకెళ్ళను ఛేదించి సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం శ్రమిస్తున్నది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ గొప్ప నాయకుని గా, ఆగ్నేయ ఆసియాలో గుర్తింపును పొందారు. వియత్నాం ఏకీకరణ జరిగిన 48వ వార్షికోత్సవం(జులై 2) సందర్భంగా హోచిమిన్‌కు విప్లవ జోహార్లు.

# ఏదీ భారత్ స్థానం?

పాలకులు చెబుతున్నట్లుగా భారతదేశం ఈ రోజు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతున్న మాట నిజమేనా? ప్రపంచ దేశాలకు భారత్ ఒక రోల్ మోడల్‌గా ఉన్నదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే, వివిధ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలలో తయారు చేసే వివిధ రకాల సూచీలను, ర్యాంకులను పరిశీలించాలి.

దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న గురజాడ సూక్తి ప్రకారం,ఒక దేశపు సమగ్ర అభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలలో, వారి స్థితిగతుల్లో, వారు అనుభవించే స్వేచ్ఛలో, సామాజిక గణాంకాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో, వారు పొందే సుపరిపాలనలో అభివృద్ధిగా ఉంటుంది.

మరి అటువంటి అంశాల్లో మన దేశం పరిస్థితి, మన దేశ ప్రజల పరిస్థితి ఎలా ఉందో ఒక పరిశీలన చేద్దాం. ఇటీవల మన ప్రధాని, తరచుగా వినిపిస్తున్న మాట 'భారతదేశం ప్రపంచపు 3 వ అతిపెద్ద ఆర్థిక శక్తి కాబోతోంది'.

అవును జిడిపి పరంగా 189 దేశాల్లో మనది 3వ స్థానం కావచ్చు కానీ తలసరి జిడిపి పరంగా మన దేశం ఈ 189 దేశాల్లో 140వ స్థానం లో ఉంది. ఇది అత్యంత తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తోంది. ఈ దేశపు బడా కార్పొరేట్లను ప్రపంచ కుబేరులుగానూ, ఈ దేశ పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని కటిక దారిద్ర్యంలోకి నెట్టే విధంగానూ పాలకుల విధానాలున్నాయి అన్నమాట. ఆర్థిక స్వాతంత్ర్యం లో 178 దేశాల్లో 123వ స్థానం, హ్యూమన్ కాపిటల్ ఇండెక్స్(మానవ వనరుల వినియోగం) లో 152 దేశాలకు గాను 115 వ స్థానం లో ఉండడం, ఉద్యోగ కల్పనలో 47 దేశాల్లో 42వ స్థానం లోను, ప్రజలపై ఉన్న అప్పుల భారం లో 189 దేశాలకు గాను 82వ స్థానం లోను, కనీస వేతనాల అమలులో 156 దేశాలలో 64వ స్థానం లోను, మరీ ముఖ్యం గా గ్లోబల్ స్లేవరీ ఇండెక్స్‌లో 167 దేశాల్లో 4వ స్థానంలో ఉండడం పై విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి.

పాలకుల స్వభావం ఆ ప్రభుత్వ ప్రాధమ్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది . గ్లోబల్ హంగర్ ఇండెక్స్ లో 107 దేశాలకు గాను 94వ స్థానం లోనూ, తలసరి ఆరోగ్య వ్యయం అనే అంశం లో 190 దేశాలకు గాను 141వ స్థానం లోనూ, ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో 191 దేశాలకు గాను 145 వ స్థానం లో ఉండగా మిలిటరీ వ్యయంలో 186 దేశాలకు గాను 3వ స్థానం లో ఉండడం ఈ పాలకుల విధానాల్లో డొల్లతనాన్ని, సామ్రాజ్యవాద దేశాల ఆయుధ తయారీ కంపెనీలకు లొంగుబాటును, పొరుగు సరిహద్దు దేశాలతో చెడిపోతున్న సత్సంబంధాలను సూచిస్తోంది.

పాలకుల విధానాలే ప్రజల జీవన ప్రమాణాలను నిర్ధారిస్తాయి. ప్రపంచ ఆయుష్షు సూచీ లో195 దేశాలకు గాను 125వ స్థానం లో ఉండగా, ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో 189 దేశాలకు గాను 131వ స్థానం లో ఉండడం, సాంఘికాభివృద్ధి సూచీ లో 128 దేశాలకు గాను 117వ స్థానం లో ఉండడం, గ్లోబల్ యూత్ డెవలప్మెంట్ ఇండెక్స్ లో 183 దేశాలకు గాను 134 వ స్థానం లో ఉండడం,నవజాత శిశుమరణాల్లో 223 దేశాలకు గాను 113వ స్థానం లో ఉండడం, లింగ తారతమ్యంలో 144 దేశాలకు గాను 108వ స్థానం లో ఉండగా, లింగ వివక్షలో 188 దేశాలకు గాను 76 వ స్థానంలో ఉండడం, ఇళ్ళు లేని వారి విషయంలో 52 దేశాలకుగాను 8 వ స్థానం లో ఉండగా, పట్టణీకరణలో 199 దేశాలకు గాను 161వ స్థానం లో ఉండడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇండెక్స్‌లో 56దేశాలకు గాను 43వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ ఎయిర్ ఇండెక్స్ లో 92 దేశాలకు గాను 84 వ స్థానంలో ఉండడం పాలకుల వినాశకర విధానాలను సూచిస్తోంది. 5G యుగంలోకి తీసుకెళ్తున్నాము, అందరికీ ఇంటర్నెట్ విస్తరించాము అని బాజాలు కొట్టుకుంటున్న మన దేశంలో, జనాభాలో ఇంటర్నెట్ వాడే వారి శాతం ప్రకారం ప్రపంచంలో గల 228 దేశాల్లో 141వ స్థానంలో, అలాగే ఇంటర్నెట్ స్పీడ్ లో 149 దేశాలకుగాను 89 వ స్థానం లో ఉండ డం దయనీయమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది.

ప్రపంచ సంతోష సూచీలో 156 దేశాలకు గాను 137వ స్థానంలో ఉన్న మన దేశం, ప్రపంచ శాంతి సూచీలో 163 దేశాలకు గాను 139 వ స్థానంలో ఉండగా, ఉద్దేశపూర్వక జనహనన కేసుల్లో 219 దేశాలకు గాను 2 వ స్థానం లో ఉండడం, ట్రాఫిక్ ప్రమాదాల వలన జరిగే మరణాల్లో 180 దేశాలకు గాను 2 వ స్థానం లో ఉండడం, ఆత్మహత్యల రేటులో 176 దేశాలకు గాను 19 వ స్థానం లో ఉండడం ఆందోళనకరం. 'ఎక్కడ పుడితే బావుంటుంది' అనే అంశం మీద 80 దేశాల పౌరులపై చేసిన విశ్లేషణ లో మన దేశానికీ 72వ ప్రాధాన్యత లభించింది.

ప్రజా శ్రేయస్సు సూచీలో 149 దేశాలకు గాను 101 వ స్థానం లో ఉండడం, ప్రజాస్వామ్య సూచీలో 112 దేశాలకు గాను 65 వ స్థానం లో ఉండడం, చట్టబద్ధ పాలన సూచీలో 113 దేశాలకుగాను 68 వ స్థానంలో ఉండడం, పత్రికా స్వేచ్ఛ లో 180 దేశాలకు గాను 148 వ స్థానం లో ఉండడం, పాలకుల నియంతృత్వ పోకడలను, నిరంకుశ విధానాలను ప్రతిబింబిస్తోంది.

పై గణాంకాలాన్నీ UNO, UNO యొక్క అనుబంధ సంస్థలు, World బ్యాంక్ లాంటి ప్రఖ్యాత సంస్థలు ఎంతో శాస్త్రీయంగా తయారుచేసినవే.

ఈ క్రింది లింక్ ద్వారాపై సమాచారాన్ని ఒక్క క్లిక్ తో సరిచూసుకోవచ్చు.

https://en.m.wikipedia.org/wiki/International_rankings_of_India

నిప్పు ని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందం టూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా, పై గణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరిస్తున్నాయి.వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తి చూపుతున్నాయి.

# నిస్సత్తువకు నిలయంగా భారత్

ఇటీవల లాన్సెట్ గ్లోబల్ హెల్త్ 195 దేశాల్లో శారీరక ఫిట్ నెస్ పై జరిపిన సర్వేలో భారత్ యువతలో సుమారు యాభై శాతం అన్ ఫిట్ గా ఉన్నారు అని తెలిపింది. వీరిలో మహిళలు 57% శాతం, పురుషులు 42% శాతం ఉన్నట్లు తెలిపారు. భారత్ 12వ స్థానంలో అతి పేలవంగా ఉంది అని తెలిపారు. కుటుంబ నియంత్రణ పాటించడం ప్రారంభం అయిన తరువాత ప్రతీ కుటుంబంలో ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకొంటూ, వీళ్ళని గారాబంగా పెంచుకోవడం జరుగుతుంది.

మంచి ఆహారం, సకల సౌకర్యాలు తల్లిదండ్రులు సమకూరుస్తూ శారీరక శ్రమకు దూరంగా ఉంచడం ద్వారా యువతలో చాలా మంది నిస్సత్తువగా ఉండుట జరుగుతుంది. దీంతో అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. కనీసం నడవడం అనే ప్రక్రియ జరగటం లేదు. ప్రతీ చిన్న దూరానికి మోటార్ సైకిల్ వాడటం జరుగుతుంది. చిన్నతనం నుంచి ఏ.సి లకు, ఫాస్ట్ ఫుడ్ అలవాటు పడటం జరుగుతుంది. దీంతో యవ్వన కాలం లోనే గుండెపోటు, మధుమేహం వంటి వ్యాధులకు గురవుతున్నారు. ఊబకాయం వెంటాడుతూనే ఉంది.

ఖాళీ సమయాల్లో నీడపట్టునే ఉంటూ ఏ.సి గదుల్లో సినిమాలు, సీరియల్ చూస్తూ, లాప్ టాప్, టాబ్, సెల్ ఫోన్లు తో కాలం గడుపుతున్నారు. ఇక సాఫ్ట్వేర్ రంగంలో ఉదయం నుంచి రాత్రి వరకు కంప్యూటరే జీవితంగా మార్చుకున్నారు. డబ్బులు సంపాదనే ధ్యేయంగా మారిపోయింది.

అసలు సమాజంతో సంబంధాలే కనుమరుగు అవుతున్నాయి. దీంతో రాబోయే 2030 నాటికి భారతదేశంలో 60% శాతం యువత బద్ధకస్తులుగా, నిస్సత్తువకు నిలయంగా మారుతోంది అని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

ఇకనైనా యువత మేల్కొనాలి. శారీరక శ్రమ చేయాలి. రోజూ ప్రణాళికా బద్ధంగా వ్యాయామం చేయాలి. ఫాస్ట్ ఫుడ ఆయిల్ ఫుడ్స్ ఫ్రైడ్ ఫుడ్స్ మానాలి. మితిమీరిన మాంసాహారం తినడం తగ్గించాలి.

మితాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని గ్రహించాలి. సంపాదన కన్నా శారీరక మానసిక ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల ఆరోగ్యం, అలవాట్లు పై శ్రద్ధ తీసుకోవాలి..

ఐ.పి.రావు

## అధిక ఫీజులను తగ్గించాలి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: అధిక ఫీజులను పెంచి మధ్యతరగతి, సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న డయాగ్నొస్టిక్, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలపై విచారణ చేసి పెంచిన ధరలను తగ్గించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. యుగంధర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో విచ్చలవిడిగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఆఫర్ల పేరుతో ఆర్‌ఎంపి, పిఎంపిల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అనుమతులు లేకుండా ప్రభుత్వ జీవోలకు విరుద్ధంగా సరైన పార్కింగ్ స్థలాలు, మంచినీటి, వెయిటింగ్ హాలు లేకుండా చిన్న చిన్న గదులలో ఏర్పాటు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సరైన వసతులపై దృష్టి సారించకుండా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే స్కానింగ్, డయాగ్నొస్టిక్ సెంటర్లలో ఫీజులు తగ్గించాలని లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆయా సెంటర్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## స్కాలర్‌షిప్ విడుదలకు వినతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. మచ్చ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 7 వేల కోట్ల పై చిలుకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం మూలంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. విద్యార్థులు చదివిన కళాశాలలో తమ కోర్సు పూర్తిచేసినప్పటికీ వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, దీని ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడిపల్లి హేమంత్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కౌసిరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు ప్రమాదబీమా



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఉపాధిహామీ కూలీలకు ప్రమాదభీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు.సోమవారం ఉపాధి కూలీలకు భీమా కల్పించాలని ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు.ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మరణించిన ఉపాధిహామీ కార్మికులకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని,అంగవైకల్యం ఏర్పడితే రూ.10లక్షలు అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ఎతివేసేందుకు ఎన్నోకుట్రలు పన్నుతుందని విమర్శించారు. రోజుకు రూ.600ల కూలీతో ప్రతి ఉపాధిహామీ కూలీకి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్,సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, వ్యకాస జిల్లాఉపాధ్యక్షుడురావుల సత్యం, సహాయకార్యదర్శి జడ వెంకన్న, మఠంపల్లి, మేళ్లచెర్వు మండలాల సిపిఐ కార్యదర్శులు అమరారపు పున్నయ్య, సారెడ్డి పాపిరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగానిసత్యనారాయణ,జక్కులరమేష్, కొట్టు రమేష్, జక్కుల రమణఉన్నారు.

## నాణ్యమైన ఆహారానికి ప్రాధాన్యం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించాలని ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో డిఆర్ ఫ్యామిలి రెస్టారెంట్‌ను ఎంపిపి ప్రారంభించారు. ఎంపిపి మాట్లాడుతూ వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని తాజా వస్తువులతో ఎప్పటికప్పుడు నాణ్యమైన వంటకాలను వినియోగదారులకు అందించాలని అన్నారు. అనంతరం డిఆర్ హోటల్ యజమాన్యం దూదిమెట్ల యాదగిరి, రాజవోణి సురేష్‌కృష్ణ, రాజవోణి యాదగిరిలు ఎంపిపి, స్థానిక ప్రజా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి, ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏరుకొండ రాము, మాజీ ఎంపిటిసి మాడ్గుల యాదగిరి, శంకర్‌నాయక్, మండల నాయకులు రమావత్ రాజునాయక్, మూడావత్ మంగ్యనాయక్, ఏకుల సురేష్, బక్కులయ్య, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలు పట్టవా?

ప్రజాపక్షం/ఆలేరు : వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు జూలై 30, 31 తేదీలలో రామన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహించే జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురుపంగ ప్రకాష్, వనం ఉపేందర్ అన్నారు. సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలో అక్షర స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, గౌరవ అధ్యక్షులు ఎంఏ ఇక్బాల్, నియోజకవర్గ అధ్యక్షులు నాగయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహ, ఐలయ్య, కొమరయ్య, జ్యోతి, ఈశ్వర్, గీత, మహేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు



ప్రజాపక్షం/చందంపేట: చందంపేట మండలం చిత్రియాల గ్రామ పరిధిలోని పుట్టకోట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జేసిబి సహాయంతో గుంతలు తీసి పూజలు నిర్వహించి సుమారు ఆరు ఫీట్ల గుంత తవ్వారు. గ్రామస్థులు ఇట్టి విషయాన్ని గమనించి వెళ్లే సరికి వారిని చూసి గుప్త నిధులకోసం వచ్చిన వ్యక్తులు పారిపోయారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

# నిరంతరం లేనివారిని ఆదుకోవడమే లక్ష్యం

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం /నల్లగొండ : లేని వారిని ఆదుకోవడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు.సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు వివిధ రకాల సమస్యల ఫిర్యాదులనునేరుగా మంత్రికి అందజేశారు. మంత్రి ఫిర్యాదులను స్వీకరించడమే కాకుండా, జిల్లా కలెక్టర్ ను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అంతేకాక సంబంధిత అధికారులకు అక్కడ నుండే స్వయంగా ఫోన్ చేసి మాట్లాడుతూ ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. వ్యక్తిగత సమస్యలు ఆరోగ్య నిమిత్తం ఆర్థిక సాయం కోరగా పలువురికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థులకు పాఠశాలల, కళాశాలల్లో సీట్లు, ఆరోగ్యం ఇతర వివిధ సమస్యల పిటిషన్లను ఆయన సానుకూలంగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.

**33/11 కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన**

నల్లగొండజిల్లా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్ కాలనీలో మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ, ఈ సబ్ స్టేషన్ వల్ల 15000 కుటుంబాలు లో వోల్టేజి సమస్యను అధిగమిస్తాయని, రెండు నెలల్లో సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీర్లను ఆదేశించారు.నాణ్యమైనకేబుల్‌తో పాటు, ఫన్సింగ్ వేయాలని, 24 గంటలు సెక్యూరిటీ గార్డ్ ను ఏర్పాటు చేయాలి ఆదేశించారు. భూమి ఇస్తే పట్టణంలో మరో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపడతామని, టి హబ్‌తో పాటు,కలెక్టరేట్ వద్ద మరో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కడుతున్నామని తెలిపారు. కలెక్టర్ సి .నారాయణరెడ్డి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ ఈ చంద్రమోహన్, ఆర్డిఓ రవి ఉన్నారు.

**జిల్లాను అభివృద్ధి చేస్తా**

రానున్న నాలుగున్నర సంవత్సరాలలో జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నల్లగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడారు. మూడు, నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుకు సాగునీరు తీసుకొస్తామని, అలాగే ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల పూర్తికి ముఖ్యమంత్రితో మాట్లాడి 2000 కోట్ల రూపాయలు మంజూరు చేయించామన్నారు.ఏఎంఆర్‌పి ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు, సిఈ నాగేశ్వరరావు, ఎంపిపి, వైస్ ఎంపిపి పరమేష్, జడ్‌పటిసి లక్ష్మన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఈ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రిసిటి ఎస్‌ఈ చంద్రమోహన్, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ తిరుపతయ్య, జెడ్‌పి సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, తదితరులున్నారు.

## బాధితులకు సత్వర న్యాయం

జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్

ప్రజాపక్షం/నల్లగొండ: దేశ వ్యాప్తంగా భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు2023 అమలులోకి వచ్చినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయన్నారు. అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు మనదేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందని, ప్రజలకి మరింత సమర్ధవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సం హిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం , పైన ఇప్పటికే జిల్లాలోని ఉన్న పోలీ సు అధికారులకు, సిబ్బందికి విడతలవారీగా శిక్షణ కార్యక్రమని నిర్వహించడం జరిగిందన్నారు. మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం మరియు వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందని, కొత్త చట్టాల ద్వారా మహిళలకు పూర్తి రక్షణ కల్పించడం జరిగిందన్నారు. కొత్త చట్టాలవర్తింపు,నేరాలు,దానికి సంబంధించిన కేసులు వ్యవహరిస్తున్నపుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు అధికారులందరికి విడతల వారీగా ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం / గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గం అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన రైతు పరుశరాముడు ఆయన కుటుంబ సభ్యులతో కలసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ చాంబర్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. పోలీసులు ఆయన్ని నివారించి ప్రభుత్వ హాస్పిటల్‌లోచికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గుడిదొడ్డి రైతుకు యాపదిన్నె శివారులో 5ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన 5గురు వ్యక్తులు కబ్జా చేశారని, ఎన్ని మార్లు తహసిల్దార్ కార్యాలయానికి, ఉన్నత అధికారులకు విన్నవించినా కనికరించడం లేదన్నారు. తమకు చావే శరణ్యమని భావించి కుటుంబ సభ్యులందరం కలెక్టర్ ఎదుటనే చావాలని నిర్ణయించుకున్నామని ఆవేదన చెందారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలనివాపోయారు.

## గర్భిణి మృతి కేసులో ఆరుగురి అరెస్టు

జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్‌సింగ్



ప్రజాపక్షం/సూర్యాపేట: లింగ నిర్ధారణ చేసి ఆడ పిల్ల అని తెలిసిన తరువాతా అబార్షన్ చేసి గర్భిణిస్త్రీ మృతికి కారకులైన ఆరుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా డోర్నకల్ మండలం బట్టు తండాకు చెందిన బట్టు కృష్ణ, క్రాంతి కుమార్తె సుహాసిని చివ్వెంల మండలంలోని ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌కు 23 మే 2019లో వివాహం చేశారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగబిడ్డ కావాలని వత్తిడి తేవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోకుండా ఉంది. లేకుండా మరో పెళ్లి చేసుకుంటానని బెదిరించడంతో చేసేది ఏమి లేక సుహాసిని మూడవసారి గర్భదాల్చింది. లింగనిర్ధారణ పరీక్షలు చేయించగా ఆడపిల్ల అని తేలడంతో అబార్షన్ చేసుకోవాలని బలవంతం చేసి 24 జూన్ 2024న ఆమెను బలవంతంగా భర్త హరిసింగ్ కోదాడ పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చూపించారు. అదే రోజు హుజూర్‌నగర్‌లోని న్యూ కమల ఆసుపత్రిలోకి తీసుకెళ్లి అబార్షన్ చేసేందుకు అక్కడి వైద్యులతో మాట్లాడి టాబ్లెట్లు ఇప్పించాడు.మరుసటిరోజు ఉదయం పెదవీడు గ్రామానికి తీసుకెళ్లి అక్కడ ఖాసీం ఇంట్లో సిస్టర్‌ను పిలిచిఅబార్షన్ కోసం టాబ్లెట్లు, ఇంజక్షన్లు ఇవ్వడంతో రక్తస్రావం జరిగింది. ఎం తకు తగ్గకపోవడం,అబార్షన్ కాకపోవడంతో ప్రమాదమని గుర్తించి మఠంపల్లికి, ఆ తరువాత కోదాడ పట్టణంలోని డాక్టర్ గురువయ్య ఆసుపత్రిలో తీసుకెళ్లిచేర్పించారు.అన్ని పరీక్షలు చేసిన సదరు వైద్యులు పరిస్థితి విషమించిందని చెప్పడంతో ఖమ్మం ప్రశాంతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుండి మరలా సిరియస్ ఉందని వైద్యులు చెప్పడంతో హైద్రాబాద్‌కు బయల్దేరారు.మార్గమద్యంలోని సూర్యాపేట పట్టణం గాయత్రి ఆసుపత్రికి తీసుకెల్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. సుహాసిని మృతదేహాన్ని స్వస్థలమైన ఎంజినగర్ తండాకు తీసుకెళ్లారు. ఆమె తల్లిదండ్రులు తమ బిడ్డ మృతికి భర్త రత్నావత్ హరిసింగ్, వారి కుటుంబ సభ్యులే కారణమని చివ్వెంల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుజూర్‌నగర్‌లోని న్యూ కమల ఆసుపత్రి మేనేజర్ షెక్ ఖాసీం, నర్సు దేవరకొండ రాణి, రణపంగు గోపి, కంపౌండర్ విజయ, కోదాడకు చెందిన షెక్ సైదులు, తాళ్ళమల్కాపురంకు చెందిన అమరగాని నవీన్‌లను నిందితులుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. డిఎస్‌పి రవి, రూరల్ సిఐ సురేందర్‌రెడ్డి, ఎస్సైలు వెంకట్‌రెడ్డి, రత్నం, ఎఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్, మండల స్థాయిలో ప్రజల నుండి వచ్చే వివిధ రకాల దరఖాస్తులను ఎందుకు పరిష్కరించడంలేదో వివరాలను తెలపాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన వికలాంగురాలు ధరావత్ పద్మ రెండు పడకల ఇల్లుకై దరఖాస్తు పట్టుకొని రాగా స్వయంగా కలెక్టర్ ఆమె దగ్గరకు వెళ్లి స్వీకరించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 67, డిపిఓ 6, ఇరిగేషన్ శాఖకు 5, డిఆర్‌డిఎకు 4, మెడికల్‌కు 4తో పాటు ఇతర శాఖలకు 21 దరఖాస్తులతో కలిసి మొత్తం 107 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటన్నింటిని సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, జెడ్‌పిసిఈఓ అప్పారావు, డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, డిపిఓ సురేష్ కుమార్, సిపిఓ కిషన్, డిఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డిటిడిఓ శంకర్, డిఇఓ అశోక్, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

**నాణ్యత ప్రమాణాలు పాటించాలి**

**సూర్యాపేట కలెక్టరేట్:** కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని మున్సిపల్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 3న మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిచేశంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్న వాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కోదాడకు రూ. 20కోట్లు, హుజూర్‌నగర్‌కు 10కోట్లు, నేరేడుచర్లకు రూ. 5కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. హుజూర్‌నగర్‌లో మిని స్టేడియం స్థల పరిశీలన, మున్సిపాలిటిలో టియుఎఫ్ఐడిసి పనులపై సమీక్ష, నేరేడుచర్ల మున్సిపాలిటిలో టియుఎఫ్ఐడిసి పనులపై సమీక్ష ఉన్నందున అధికారులునివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈఈ జికెవి ప్రసాద్ ఉన్నారు.

## నీట్ రద్దు చేయాల్సిందే

ప్రజాపక్షం / అయిజ : నీట్, ఎన్‌టిఏను వెంటనే రద్దుచేయాలని ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వెంకట్, అయిజ టౌన్ అధ్యక్షులు సూర్యచంద్ర ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ కూడలీలో వారు విద్యార్థులతో కలసి దర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరిక్ష సమస్యపై దేశ ప్రధాని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఇంత జరుగుతున్న ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నాడని ఆయనకు విద్యార్థులపై ఏ మాత్రం చిత్తశుద్ది లేదని మండిపడ్డారు. పది సంవత్సరాలుగా బిజెపి పాలనలో టెస్టింగ్ ఏజెన్సీలు పరిక్ష నిర్వాహణ చేస్తూ నిర్వాహణలో పూర్తిగా వైఫల్యం చెందిందని వారి మూలంగానే విద్యార్థులన భవిష్యత్ ప్రమాదంలో పడిందని వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని అన్నారు. కాబట్టి నీట్ పరిక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పాలని మళ్ళీ నీట్ పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.ఎన్ఎస్‌యుఐ అలంపూర్ నియోజక వర్గం అధ్యక్షులు ప్రకాశ్, యోనా, నవాజ్, విద్యార్థులుపాల్గొన్నారు.

## వృక్ష సంపద పెంపకంతోనే అధిక లాభాలు



అటవీ వ్యవసాయ విభాగం శాస్త్రవేత్త టి.చైతన్య

ప్రజాపక్షం/మోటకొండూరు: అటవీ వృక్ష సంపద పెంపకంలోరైతులు చోరవ చూపి శ్రీగందం, మామిడి, వెదురు, సురుగుడు తదితర వృక్ష సంపద పెంపకం చేపట్టాలని అటవి,వ్యవసాయ విభాగం శాస్త్రవేత్త టి.చైతన్య తెలిపారు. ఆమే సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో అటవీ వ్యవసాయ పద్ధతులపై ప్రొఫెసర్ జయకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ అటవీ వ్యవసాయ విభాగాల పర్యవేక్షణలో భువనగిరి ఏరువాక కేంద్రం,మోటకొండూర్ వ్యవసాయ శాఖల సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అటవీ వృక్షాలైన శ్రీ గంధం, వెదురు ,మామిడి మొక్కల సాగులో మెలకువలను వివరించారు. శ్రీ గందం, వెదురు మొక్కల వల్ల కలిగే ఆర్ధిక ప్రయోజనాలను వివరించారు. ఏరువాక కేంద్రం, భువనగిరి శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడతూ వరి, ప్రత్తి పంటలలో అధిక దిగుబడికి పాటించాల్సిన మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాదికారి సుజాత, విస్తీర్ణాధికారులు రమేశ్, సురేష్, ఎంపిటిసి అంజిరెడ్డి, మల్లేష్, మైసయ్య తదితరులు రైతులు పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్



ప్రజాపక్షం/అడ్డగూడూరు: మండలంలోని ధర్మారం గ్రామంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నస్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్సుమెంట్ నిధులు విడుదల చేయాలనిఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా పక్షాన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7 వేల పైచిలుకు కోట్లు స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలనీ, నిధులు ఇవ్వకపోవడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ కోర్సు పూర్తి చేసిన కూడా వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పేద మధ్యతరగతి విద్యార్థుల కోసం అసెంబ్లీలో మాట్లాడుతానని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల అయ్యేవిధంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సిహెచ్ వంశీ, కళ్యాణ్, వినయ్ లక్ష్మి నివాస్, ఎస్ఎస్‌యు నాయకులు శివరాజ్, రాకేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలు మరో పోరాటానికి సిద్ధం కావాలి

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం డిమాండ్

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అత్యంత తక్కువ చెల్లించి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమేఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్‌కు రూ. 2లక్షలు, హెల్పర్స్‌కు రూ. 1లక్ష చెల్లించాలి, విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సుమారు 10వేల మంది పనిచేస్తున్నారని, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్11నుండి అక్టోబర్ 04వరకు రాష్ట్రంలో 24 రోజులు అంగన్‌వాడిలు నిరవధిక సమ్మె చేశారని అన్నారు. ఈ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ. 2లక్షలు, హెల్పర్స్‌కు రూ. 1లక్ష పెంచుతామని, పెన్షన్, విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. అనంతరం రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజుల సమ్మె పరిస్థితి, ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రభుత్వం, ఐసిడిఎస్ మంత్రి, అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చినపై అంశాలను పరిగణలోకి తీసుకొక పోవడం అన్యాయం అని పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా అతితక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను జులై 1 నుండి ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమని, అంగన్‌వాడీలకు తీవ్రంగా నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీవో నెంబర్ 10 రద్దు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు 2లక్షలు, హెల్పర్స్‌కు 1లక్ష పెంచుతూ కొత్త జీవోను జారీ చేయాలని అన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు మరో పోరాటానికి సిద్ధమవుతారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సహకరించాలని కోరారు.

## భూ సమస్యలు పరిష్కరించండి



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోకవర్గంలోని అటవీ భూ సమస్యల పరిష్కారానికై సోమవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేష్‌ను హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంఎల్ఏ బాలునాయక్ వెంట నేరేడుగొమ్ము మండల ఎంపిపి బిక్కునాయక్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మాదవ రెడ్డి, గోవింద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

## కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవెన్యూశాఖకు సంబంధించినవి 29, కోర్టు కేసుకు సంబంధించినవి 5, ఉద్యోగాల కొరకు 6, ఇతర శాఖలకు సంబంధించినవి 23, మొత్తం 63 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జిలతో కలిసి స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్‌ఓ అప్పయ్య, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, డిడబ్ల్యూఓ స్వర్ణలత లీనినా, ఎల్‌డిఎం రాజ్ కుమార్, సిపిఓ ప్రకాష్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 132 దరఖాస్తులు స్వీకరణ

#### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**వరంగల్ ప్రతినిధి :** ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజా సమస్యలపై కలెక్టర్ స్వయంగా ప్రజల నుండి వినతులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రతిదరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.



రెవెన్యూ శాఖకు సంబంధించి 85, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ 6, ఉపాధి శాఖ 6, లీడ్ బ్యాంక్ 4,డీఆర్‌డీఓ 4, డిపిఓ 4, డిటిడిఓ 3, 20 దరఖాస్తులు పలు శాఖలకు సంబంధించినవి స్వీకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్‌డిఓ కౌసల్యదేవి, జడ్పీసీఈఓ రాంరెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

#### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ టౌన్ :** గ్రీవెన్స్(ప్రజావాణి) కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. హైదరాబాద్ ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీకు సంబంధించిన వినతులపై ప్రత్యేక చొరవ చూపి సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి నగర పర్యటన విజయవంతం కావడంలో అధికారులు, సిబ్బంది తమ వంతు పాత్ర పోషించారని అభినందించారు. కాగా ఇంజినీరింగ్ 25, హెల్త్, సానిటేషన్ 6, ప్రాపర్టీ ట్యాక్స్ 9, టౌన్ ప్లానింగ్ 41 మొత్తంగా 81 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్, లింగం, టీపీఆర్‌ఓ కోలా రాజేష్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

#### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**జనగామ ప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్షణం పరిష్కరించాల్సినవి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా దరఖాస్తు దారులకు సరియైన సమాచారం ఇవ్వాలని, సమస్య పరిష్కారం కోసం సరియైన ధృవపత్రాలు తీసుకొచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. 90 శాతం దరఖాస్తులు భూ సంబంధిత సమస్యలపైనే వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ వెంకన్న, జిల్లా పరిషత్ సిఈఓ అనిల్‌కుమార్, డిఆర్‌డిఓ మొగులప్పతో పాలు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 72 అర్జీలు...

#### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. నేడు జిల్లా నలుమూలల నుండి 72 మంది ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### 58 ఫిర్యాదులు..

#### కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**సిద్దిపేట ప్రతినిధి :** అర్జీదారుల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా సముదాయ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పాలనాధికారులతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను విన్నవించి నేరుగా పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని వారందరికి న్యాయం చేయాల్సిన భాధ్యత అధికారులుగా మన కర్తవ్యం అని అధికారులకు తెలిపారు. ఈ రోజు అర్జీదారుల నుండి తీసుకున్న 58 ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి నివేదిక అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ నాగ రాజమ్మ, డిఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** అమరజీవి కామ్రేడ్ ఇప్ప బాల్‌రెడ్డి సిపిఐకి చేసిన సేవలు చిరస్మరణీయం అని ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుగొమ్ము మండలంలోని తిమ్మాపురం గ్రామ సిపిఐ మాజీ కార్యదర్శి ఇప్ప బాల్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి స్థూపాన్ని ఆవిష్కరించారు. స్మారక స్థూపం వద్ద బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బాల్‌రెడ్డి కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్త నుండి మొదలుకొని పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా, మండల కౌన్సిల్ సభ్యునిగా పనిచేసి కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బాల్‌రెడ్డి కుటుంబం ఇప్పటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా, సానుభూతి పరులుగా ఉండి పార్టీకి లాయల్టీగా పనిచేస్తున్నారని అన్నారు. కుటుంబ సభ్యులు బాల్‌రెడ్డి స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం గొప్ప పరిణామం అని, రానున్న తరానికి ఇప్ప బాల్‌రెడ్డి స్తూపం చెరగని చరిత్రకు నాంది పలుకుతుందని అన్నారు. బాల్‌రెడ్డి మృతి పార్టీకి, కుటుంబానికి తీరనిలోటు అని బాల్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని యువత కమ్యూనిస్టు పార్టీలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, జిల్లా నాయకులు తూం బుచ్చిరెడ్డి, పాండురంగారెడ్డి, చందంపేట, నేరేడగొమ్ము మండల పార్టీ కార్యదర్శులు వెంకటయ్య, అచ్చయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, రంగారెడ్డి, వెంకటేశ్వరరావు, సుదర్శన్, వెంగలయ్య, రామస్వామి, గోవర్ధన్, యాదయ్య, కృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసులు జవాబుదారీగా ఉండాలి

## ఎస్‌పి శ్రీ కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పోలీసులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 19 ఫిర్యాదులు ఎస్పి స్వీకరించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్ వచ్చినప్పుడు, తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చేసినప్పుడే పోలీసులపై నమ్మకం కలుగుతుందని అన్నారు. బాధితుల ఫిర్యాదులపై విచారణ జరిపి, సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత పోలిసు అధికారులను ఎస్పి కిరణ్ ఖరే ఆదేశించారు.

# సమస్యలు పరిష్కరిస్తా : యశస్వినీరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** పాలకుర్తి నియోజకవర్గంలోని వివిద గ్రామాలలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని పాలకుర్తి ఎంఎల్‌ఏ యశస్వినీరెడ్డి అన్నారు. మన ఊరు – మన ఎంఎల్‌ఏ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించిన అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఎంఎల్‌ఏకు వివరించగా సానుకూలంగా స్పందించిన ఆమె ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని, నియోజకవర్గంలో కూడా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 10ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** 10ఎకరాల వరకు గల రైతులందరికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకం వర్తింపజేయాలని శివ్వంపేట రైతులు వారి అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేటలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుభరోసాపై రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి మాట్లాడుతూ రైతులందరు 10ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలని వారు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఇదే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రైతులకు త్వరలోనే రూ. 2లక్షల రుణమాఫి జరుగుతుందని తెలిపారు. రైతులకు క్వింటాలు సన్నరకం వడ్లతో పాటు దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతుభరోసా అందించాలన్నారు. ఇన్‌కంట్యాక్స్(ఐటీ)తో లింకు పెట్టకుండా రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం 10ఎకరాల వరకు రైతులందరికి రైతుభరోసా ఇవ్వాలని రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ లావణ్య, ఎంపీటీసీలు ఇందిరశ్రీనివాస్, నువ్వుల దశరథ, గోవింద్‌నాయక్, మార్కెట్ కమిటి మాజీ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు బండారి గంగాధర్, సుదర్శన్‌గౌడ్, సోనిరవినాయక్, పీఏసీఎస్ సీఈఓ మధు, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు మైసయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

# దామెర పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఈస్ట్ జోన్ డిసిపి

**ప్రజాపక్షం/దామెర:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేటి నుంచి అమలవుతున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారత సాక్ష్య అధినియం చట్టాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజీత్‌రావు, ఎస్సై కొంక అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** గ్రామాలలో అంతర్గాత రోడ్ల నిర్మాణం చేసి అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు . సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి ప్రజల కోరిక మేరకు గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వంద శాతం సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో నా వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు సమకుర్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, కొండాపూర్ గ్రామ సమీప గ్రామాలైన గణేష్‌నగర్, మురళీనగర్ వెళ్ళేందుకు రోడ్డు సౌకర్యం కల్పించి తీరుతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారెంటి పథకాలను అమలు చేసి తీరుతామని, రైతులకు రుణ మాఫి, రైతు బంధు వేస్తున్నట్లు చెప్పారు.



అనంతరం ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సంలో భాగంగా మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి.నర్సింహమూర్తి, గ్రామ ప్రత్యేకాధికారి పి.పవిత్ర, పంచాయతి కార్యదర్శి రజిత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి,పార్టీ నాయకులు వైనాల అశోక్, రఘుపతిరావు, జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల మహిళ నాయకురాలు, జ్యోతి, గ్రామ పార్టీ నాయకులు అబ్బరబోయిన సురేష్, కొండ నారాయణ తదితరులు పాల్గోన్నారు .

# ఆబాద్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ 320ఎఫ్ జిల్లాలో గల 8 రీజియన్‌లలో బెస్ట్ రీజియన్ ఛైర్మన్‌గా జనగామ ఆబాద్ క్లబ్‌కు చెందిన లయన్ కదిరె రాజశేఖర్‌రెడ్డికి అవార్డు లభించింది. ఆదివారం రాత్రి వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో జరిగిన జిల్లా అవార్డ్స్ నైట్ సభకు జిల్లా గవర్నర్ వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కౌన్సిల్ ఛైర్మన్ హెచ్ రాజిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి అవార్డు ప్రధానం చేశారు. ప్రస్తుతం జిల్లాలో రీజియన్ ఛైర్మన్గా ప్రథమ స్థానంలో వారు నిలిచారు. ఆబాద్ క్లబ్ అధ్యక్షుడు శ్రీబాష్యం రఘు జిల్లాలో గల 90 క్లబ్‌లలో సెకండ్ బెస్ట్ అవార్డును అందుకున్నారు. ఈ క్లబ్‌కు చెందిన గ్లోబల్ యాక్షన్ టీం సర్వీస్ విభాగం నాయకుడు వి ప్రసాద్‌రావు, గ్లోబల్ యాక్షన్ టీం విస్తరణ విభాగం నాయకులు ఎ బిక్షపతి, ఈ క్లబ్ కోశాధికారి ప్రవీణ్, జిల్లా ఛైర్మన్లు పబ్బ చంద్రశేఖర్, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్‌రావు, పులుగం సురేష్‌లు లిమిటెడ్ లీడర్ అవార్డులను అందుకున్నారు. అవార్డులు సాధించిన నాయకులను క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్‌లు డా. డి లవకుమార్‌రెడ్డి, కన్న పరుశరాములు, నూతన అధ్యక్షులు డా.పి నాగేశ్వర రావు, ఇతర సభ్యులు అభినందించారు.

# పదవులు శాశ్వతం కాదు..

## మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, ప్రజలకు చేసిన మంచి పనులు ప్రజల గుండెల్లో నిలిచిపోతాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం చిన్నకోడూర్ ఎంపిపి ఉపాధ్యకుడు కీసరి పాపయ్య అధ్యక్షతన జరిగిన చివరి మండల సర్వసభ్య సమావేశంకు ఆయన హాజరై మాట్లాడారు. 8 వారాలైన ఉపాధి కూలీలకు డబ్బులు అకౌంట్‌లలో జమకావడంలేదని పేర్కొన్నారు. ఆరు నెలలుగా సఫాయి కార్మికులకు జీతాలు రాక గ్రామాలు కుప్పతొట్టిల చెత్త పేరుకు పోయిందన్నారు. పదవులు ఎవరికి శాశ్వతం కాదని ఎవరైనా మాజీలు కావాల్సిందే అన్నారు. ఎంపిటిసి సభ్యులను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపిడివో జనార్ధన్, తాహాసిల్దార్ జయ, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, సదానందం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య



కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఓపీ, ఏఎన్సీ చెకప్స్, ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, దయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రభలే అవకాశం ఉంటుందని, అవసరమైన మందులు, ల్యాబ్ పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్యాధికారి సరితను అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. ఉచిత పరీక్షలు నిర్వహించే దయాగ్నోస్టిక్ సెంటర్ల సేవలు పేషెంట్లకు అందించాలని, వీలైనంత తర్వగా రిపోర్టులు తెప్పించి తగు వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు.

# మండల అభివృద్ధే ధ్యేయం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ మండల అభివృద్ధే తన ధ్యేయమని స్టేషన్‌ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని తిడుగు గ్రామంలోని శ్రీభవాని శంకర దేవాలయ పంచ వార్షిక మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీభవాని శంకర భగవాన్ ఆశీస్సులు ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజలపైన, తిడుగు గ్రామ ప్రజలపైన ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, పార్లమెంట్ ఎన్నికల్లో డాక్టర్ కడియం కావ్య ఎంపిగా గెలిపించారన్నారు. వచ్చే నాలుగేళ్లలో ఎలాంటి అవినీతికి పాల్పడకుండా మీ రుణం తీర్చుకునే విధంగా నీతి, నిజాయితితో పని చేస్తానన్నారు. గర్నేపల్లి నుండి తిడుగు, సాగరం మీదుగా జఫర్‌గడ్ మెయిన్ రోడ్డుకు వెళ్లే రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందని రాబోయే 6 నుండి 9నెలల్లో



డబుల్ రోడ్ ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. దీంతోపాటు తిడుగు గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు, అవసరమైన సిసి రోడ్లు మంజూరు చేయించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎంతో ఖర్చుతో భవాని శంకర్ ఆలయ నిర్మాణం చేపట్టడం దాత బజ్జూరి కృష్ణమూర్తి పద్మ దంపతులు నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నల్లతీగల బాష, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నబోయిన బిక్షపతి, మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, చిటిమల్ల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సంధ్య శ్రీనివాస్, బజ్జూరి మణికాంత్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాదాసీదాగా సర్వసభ్య సమావేశం




## సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా పనిచేసి గ్రామాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో నర్సాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి శాఖల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ముందుగా ఎంఈఓ బుచ్చా నాయక్ మాట్లాడుతున్న సమయంలో ఎంపీటీసీ ఆంజనేయులు గౌడ్ కలగజేసుకొని ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా బుక్కుల డ్రెస్సుల పేరట అధిక డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. తాసిల్దార్ కమలాద్రి మాట్లాడుతుండగా ఎంపీటీసీలు శ్రీనివాస్, ఆంజనేయులు, గౌడులు మాట్లాడుతూ మండల పరిషత్ స్థలం భూములు అక్రమనకు గురికాకుండా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ రాజ్ కుమార్ మాట్లాడుతు గా విద్యుత్ శాఖకు సంబంధించిన మెటీరియల్ సిద్దిపేట నుంచి కాకుండా సంగారెడ్డికి మార్చాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి ఎంపీటీసీలు ప్రజలకు అందిస్తున్న సేవలు మరవలేని అన్నారు. పదవి పోయినంత మాత్రాన ప్రజలకు సేవలు అందించడం ఎంపీటీసీలు మరువద్దన్నారు. అనంతరం ఎంపీటీసీలను ఎమ్మెల్యే సునీత రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, జడ్పిటిసి బబ్యా నాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షులు వెంకట నర్సింగ్ రావు, తహసిల్దార్ కమలాద్రి ఎంపీడీవో మధులత, ఐసిడిఎస్ హేమ భార్గవి, ఆయా శాఖలకు చెందిన అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# పంతం నెగ్గించుకున్న కౌశిక్

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

**ప్రజాపక్షం/కమలాపూర్ :** కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ విషయంపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నాడు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న కౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వకుండా అధికార పక్షం కట్టడి చేసింది. స్వయంగా రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఫోన్ చేసి ఎమ్మెల్యేకు చెక్కులు ఇవ్వొద్దు... మీరే చెక్కులు ఇవ్వండి అని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ వాయిస్ రికార్డ్ కూడా లీక్ అయింది. దీంతో కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కౌశిక్ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు ప్రభుత్వ జీవోలో ఉన్న ప్రకారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 75 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చెక్కులు అందజేశారు. సందర్భంగా ఆయన చాలా ఉద్వేగంగా ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగా రం ఇవ్వడం లేదని, ఈ పథకాన్ని కెసిఆర్ ప్రవేశపెట్టారని, పేదింటి ఆడబిడ్డలకు మేనమామలా కెసిఆర్ ఆదుకున్నారని, ఏదైనా కక్ష్య ఉంటే నాపై తీర్చుకోవాలని కానీ నియోజకవర్గ ప్రజలపై కాదని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే మిగిలిన హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన లబ్ధిదారులకు 400 కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి ఏర్పాటు చేయాలని ఆర్‌డివోను ఆదేశించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్నప్పటికి ఎమ్మెల్యే కౌశిక్ కోర్టుకు వెళ్ళి పట్టుబట్టి కళ్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేయడం, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. కౌశిక్ తన దృష్టిలో పడితే... వదలడు... ఎంతకైనా తెగిస్తాడు.... సాధించి తీరుతాడు... ఇది ఆయన నైజం... మంత్రిని కూడా న్యాయపరంగా ఎదుర్కొని చెక్కులు ఇచ్చి తన పంతం నెగ్గించుకున్నాని అని సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.



## గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/బాన్సువాడ : అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను బాన్సువాడ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సోమవారం బాన్సువాడ డిఎస్‌పి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో ఒక వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ సిఐ కృష్ణ ఆధ్వర్యంలో సమీపంలోని సీమల శ్రీకాంత్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని వద్ద 120 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. యువకుడిని పూర్తిస్థాయిలో విచారించగా బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన నస్రీన్ బేగం అనే మహిళ దగ్గర గంజాయిని కొనుగోలు చేసినట్లు అంగీకరించడంతో, వెంటనే పోలీసులు తనిఖీ నిర్వహించగా ఆమె వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. ఆమెతోపాటు రషీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్రలోని నయగావ్‌అనే ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసినట్లు రసీద్ అంగీకరించడంతో శ్రీకాంత్, నస్రీన్ బేగం, రషీద్‌లను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. గంజాయి కేసును చాకచక్యంగా చేదించి నిందితులను అరెస్టు చేసిన పట్టణ సిఐ కృష్ణ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్‌పి సింధు శర్మ అభినందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్నాథం సిబ్బంది ఉన్నారు.

## వరద నీటి ద్వారా ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: సిరిసిల్ల పట్టణంలోని పలు ముంపు ప్రాంతాల్లో వర్షాలతో వచ్చే వరద నీటి ద్వారా ప్రజలకు ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సిరిసిల్ల లోని శ్రీ నగర్ కాలనీ, శాంతి నగర్, పద్మనగర్లో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లావణ్య తో కలిసి ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సోమవారం ఉదయం పరిశీలించారు. పద్మనగర్ ఈటీపీ నుంచి శ్రీనగర్ కాలనీ, శాంతి నగర్ ప్రాంతాల మీదుగా మానేరులో వరద నీరు కలిసి స్థలాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. వర్షాలతో వచ్చే వరద ముంపుతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. పక్కా ప్రణాళికతో పనులు చేయాలని ఆదేశించారు. నాళాల్లో ఎలాంటి చెత్త లేకుండా చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీవైఈ ఈ ప్రసాద్, ఏఈ స్వామి, టెక్నికల్ ఆఫీసర్ వెంకటేష్, టీపీ ఎస్ లు వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిళ్లా లేక వ్యక్తిగత వ్యవహారమా...?



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నం పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లా లేక వ్యక్తిగత కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారా అన్నది తేలియాల్సి ఉంది. గతంలో మణుగూరు ఎస్ఐగా పనిచేసిన శ్రీను నాలుగు నెలల క్రితం అశ్వారావుపేట బదిలీ పై వచ్చారు. ఆదివారం ఉదయం స్టేషన్ నుంచి కనిపించకుండాపోయిన ఎస్ఐ శ్రీను ఆ మండలంలోనే మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉన్నట్లు ఆయన ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిర్ధారిస్తున్నారు. మూడు గంటల తర్వాత ఆయన ఎక్కడ ఉన్నాడో తెలియరాలేదు. ఆయన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా నర్సాపురం మండలంలోని నర్సక్కపేట కు కొద్ది దూరంలో మధ్యాహ్నం పురుగుమందు కలుపుకుని తాగి తానే 108కు సమాచారం ఇచ్చాడని తెలుస్తుంది. 108 సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు. అశ్వారావుపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి కిందిస్థాయి సిబ్బందికి ఎస్ఐకు మధ్య తీవ్ర బేధాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పలుమార్లు ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడం వచ్చిన ప్రతిసారి అధికారులు ఎస్ఐనే మందలించడం, మెమోలు ఇవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మరి కొందరు వ్యక్తిగత కారణాలుకూడాఉండవచ్చునని అంటున్నారు.ఆత్మహత్యాయత్నానికి కారణాలు ఏమైనా ఎస్ఐ శ్రీను ఘటన పోలీస్‌శాఖలో ఒక కుదుపుకు దారి తీసింది.

## అన్ని వివరాలతో సిద్ధంగా ఉండండి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: జిల్లాలో మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటన నేపథ్యంలో అన్ని వివరాలను అధికారులు అంతా సిద్ధం చేసి ఉంచాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు అన్ని శాఖల అధికారులతో జాతీయ కమిషన్ సభ్యులు సమీక్షించనున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు ఎస్సీ సంక్షేమం, పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు అన్ని వివరాలు సమగ్రంగా సేకరించి ఉండాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఓ పవన్ కుమార్, డిపిఓ రవీందర్, సిపిఓ కొమురయ్య, సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిడి హమీద్, ఎల్‌డిఎం ఆంజనేయులు, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా వైద్యాధికారి సుజాత తదితరులున్నారు.

## మత్తు పదార్థాలపై పోలీసుల అవగాహన



ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామంలో జమ్మికుంట సిఐ కె.కిషోర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలలో యువత గంజాయి వాడకంతో కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇల్లందకుంట ఎస్ఐ ఎన్.రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు..

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : తనకు కావసిన గ్యాప్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని మెట్ పల్లి పట్టణానికి చెందిన మహమ్మద్ వసీం, సోమవారం ప్రజావాణిలో మెట్ పల్లి తహసిల్దార పై జగిత్యాల జిల్లా, కలెక్టర కు ఫిర్యాదు చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం తనకు గ్యాప్ సర్టిఫికెట్ అవసరం ఉందని దరఖాస్తు చేసుకోగా తనకి ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు అత్యవసరంబ ఉందని చెప్పినప్పటికి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని వసీం చెప్పరు. తాను చదివి ఉద్ధరించేది ఏమీ లేదని అవమానకరంగా మట్లాడారని తెలిపారు. తహసిల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకొనిగ్యాప్ సర్టిఫికేట్ ఇప్పించి న్యాయం చేయగలరని వసీం కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

### కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి కలెక్టర్, అధికారులతో కలిసి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజావాణి ధరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ప్రజాదర్బార్‌కు సంబంధించిన ధరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. ప్రజావాణి, ప్రజాదర్బార్ ధరఖాస్తులను పెండింగ్ పెట్టవద్దని పేర్కొన్నారు. ప్రజావాణికి మొత్తం 370 ధరఖాస్తులు వచ్చాయి. ఇందులో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయానికి 50, డిపిఓ కార్యాలయానికి 26, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 13, కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 16, హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయానికి 11, ఎస్ఈ ఎన్పిడిసిఎల్‌కు 16, మానకొండూర్ తహసీల్దార్‌కు 18, కరీంనగర్ రూరల్‌కు 14, వీణవంకలో 13, తిమ్మాపూర్ 11, కొత్తపెల్లి తహసీల్దార్‌కు 10 ధరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ధరణి పెండింగ్ ధరఖాస్తులను పరిష్కరించాలి కలెక్టర్ ధరణి పెండింగ్ ధరఖాస్తులను తహసీల్దార్లు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో 100 శాతం పూర్తి చేయాలని, వీటిపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఒక అప్లికేషన్ పెండింగ్‌లో ఉండవద్దని పేర్కొన్నారు.

**ఎంబి రికార్డులు పూర్తి చేయండి**

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు సంబంధించిన ఎంబి రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు.

వీటికి సంబంధించిన ఎంబి రికార్డులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రికార్డులు పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లు త్వరలో అందిస్తామని చెప్పారు.

ఇందుకు సంబంధించిన మెజర్మెంట్లు పక్కాగా తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, డిఆర్ఓపి పవన్ కుమార్, కరీంనగర్, మానకొండూర్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, కలెక్టరేట్ ఏవో సుధాకర్ తదితరులున్నారు.

# ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

### ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



ప్రజాపక్షం /సుల్తానాబాద్ : ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని సుల్తానాబాద్ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావుఅధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎంపీపీ బాలాజీ రావు, ఎంపీటీసీ ల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముఖ్య అతిథిగా పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరై మాట్లాడుతూ 5 సంవత్సరాల కాలంలో గ్రామాల అభివృద్ధికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు చేసిన కృషిని కొనియాడారు.గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీపీ జడ్పిటిసి శాసనసభ్యులను పార్లమెంటు సభ్యులను తమ గ్రామాలకు నిధులు కేటాయించాలని కోరుతూ నిధులు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ఐదు సంవత్సరాలు చేసిన కృషి ఆమోగమని అన్నారు. రానున్న కాలంలో ఎంపీటీసీలు ఎంపీపీగా విధులు నిర్వహించిన ప్రజా ప్రతినిధులు మరింత ఉన్నతమైన పదవులు ఆశించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి పలువురు ఎంపీటీసీలు వివిధ సమస్యలను తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ తో పాటు ఇతర పథకాలను ప్రజలకు వర్తింపజేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు సమస్యలను ఎంపీటీసీలు సభా దృష్టికి తీసుకురాగా స్థానికంగా ఉన్న మాజీ సర్పంచులు ఎంపీటీసీ లతో కలిసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ ఎంపీటీసీ లను ఘనంగా ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు పార్టీ నాయకులు పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం జడ్పిటిసి వినుపాల స్వరూప ప్రకాష్ రావు లను సైతం పదవి విరమణ చేపట్టడంతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను జడ్పిటిసి ఎంపీపీ ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, లతోపాటు మండలంలోని,ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్ లు సింగిల్ విండో చైర్మన్ లు వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.

## బోధనా ఫీజులు విడుదల చేయండి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం : ఏఐఎస్‌ఎఫ్



ప్రజాపక్షం/ఖమ్మం : బోధనా ఫీజులు, ఉపకార వేతనాలు తక్షణం విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జెడ్పిసిఈవోకు ప్రజా వాణిలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ ఏడువేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ప్రైవేటు కళాశాలలో ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ధృవపత్రాలు ఇవ్వడం లేదని లక్ష్మణ్ తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి తదితర విషయాలలో పక్షపాత వైఖరిని అవలంభించిందని ఆరోపించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల కావాల్సిన నిధులు కూడా విడుదల చేయలేదని ఆయన తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు మాసాల కాలంలో విద్యా రంగం పై ప్రభుత్వం దృష్టి సారించ లేదని లక్ష్మణ్ తెలిపారు. ఇప్పటికైనా బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నాగులమీరా, మధు, శివనాయక్, నరేష్, గోపి తదితరులు ఉన్నారు.

# సింగరేణి బొగ్గు గనుల వేలం పాట వద్దు

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



ప్రజాపక్షం/కాసిపేట్ : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు గనుల వేలం పాటను నిలిపి వేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట గని పై ఎఐటియుసి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి సీతారామయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎఐటియూసి ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా అన్ని బావులపైన గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి కార్మిక వర్గాన్ని పోరాటానికి సిద్ధం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గని ప్రైవేటుపరం చేయడానికి నిర్వహిస్తున్న వేలం పాటను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నామినేషన్ పద్ధతుల్లో సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని అన్నారు. గతంలో ప్రైవేట్ వారికి ఇచ్చిన రెండు బావులను రద్దు చేయాలని, ఇల్లందులోని కోయగూడెం, సత్తుపల్లి ఒసి త్రీ ప్రైవేట్ వాళ్లకు రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని లేనిచో పోరాటాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈనెల ఐదున రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేపడుతామని అన్నారు. ఆరు నుండి అన్ని జిఎం కార్యాలయాలు, సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు 12వ తారీకు వరకు నిరాహారాల దీక్షలు చేపడుతామని పేర్కొన్నారు. అప్పటికి కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే అన్ని కార్మిక సంఘాలు రాజకీయ పార్టీల మద్దతుతో సింగరేణి వ్యాప్తంగా సమ్మె చేయడానికి ఎఐటియూసి ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలీంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బెల్లంపల్లి బ్రాంచి అసిస్టెంట్ సెక్రటరీ తిరుపతి గౌడ్, మంతెన రమేష్, బెల్లంపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకట స్వామి, రత్నం ఐలయ్య, జాడి పోశం, పిట్ కార్యదర్శి లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ , జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.అనంతరం మాట్లాడుతూప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ధరణి భూ సమస్యలకు సంబంధించి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరిస్తూ సదరు దరఖాస్తు ప్రస్తుత స్థితిగతులను ఆన్ లైన్ లో పరిశీలించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. మంథని మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన ఎండి రియాజ్ అక్కెపల్లి ఆర్జి 3 భూ సేకరణ క్రింద గ్రామ శివారులోని 564 ప్రాజెక్ట్ నెంబర్ కు తనకు మొదటి పేమెంట్ వచ్చిందని గెజిట్ ఆర్ అండ్ ఆర్ లో పేరు తప్పుగా నమోదు అయిందని దానికి సరి చేసి రెండో పేమెంట్ వచ్చే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మంథని రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన హనుమల కమలమ్మ తన భర్త మధునయ్య మరణించారని, తన భర్తకు అప్పన్నపేట గ్రామంలోని సర్వే నెంబర్ 705 లో 14 గుంటల భూమి ఉన్నదని, తన ఇద్దరు కుమారులు 14 గుంటల భూమికి పట్టా చేసుకున్నారని, అప్పటినుండి నాకు తిండి, నివాసం కల్పించడం లేదని, తన భర్త యొక్క భూమిని తన పేరుపై మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన సుద్దాల సతీష్ గౌడ్ సబ్బితం గ్రామ పంచాయతీకి చెందిన పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ ఇప్పిస్తానని ఘరానా మోసం

### 11ఎకరాల భూమి పట్టా చేయించుకున్న వైనం
### భూమి విలువ సుమారు 1కోటి
### న్యాయం చేయండని కలెక్టర్ కు మొరపెట్టుకున్న బాధితురాలు





ప్రజాపక్షం/బెల్లంపల్లి : పింఛన్ ఇప్పిస్తానని చెప్పి సుమారు కోటి రూపాయల విలువ గల 11 ఏకరాల భూమి పట్టా చేయించుకన్న సంఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం లోని టేని గ్రామంలో చోట చేసుకుంది. బాదితురాలు సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కుమార్ దీపక్ కు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన శీలం బాయక్కకు శివారులో 12 ఎకరాల భూమి ఉంది. అయితే బాయక్క మరిది కొడుకైన శీలం శ్రీనివాస్ పింఛన్ ఇప్పిస్తానని చెప్పి 11 ఎకరాల భూమి పట్టా చేయించుకున్నాడు. వరుసకు పెద్దమ్మ అయిన బాయక్కను కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయానికి తీసుకువెళ్లి ఆమె పేరు మీద ఉన్న11 ఎకరాల భూమిని పట్టాచేసుకున్నాడు. కొద్దిరోజులు అయ్యాక రైతుబంధు రావడం లేదని తహసిల్దార్ కార్యాలయానికి వెళ్ళి అడగగా విషయం బయట పడడంతో బాయక్క షాక్ కు గురైంది. ఈ విషయం శ్రీనివాస్ ను అడగగా నేను పంచాయతీరాజ్ కార్యాలయంలో పనిచేస్తానని నాకు అందరూ ఆఫీసర్లు తెలుసునని, నన్ను ఎవరు ఏం చేయారని బెదిరించాడని బాధితురాలు పేర్కొంది. శ్రీనివాస్ ది సొంత ఊరు కన్నెపల్లి మండలం జనకపూర్ కాగ, మంచిర్యాల లోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడని బాధితురాలు పేర్కొంది. అక్రమ పట్టా చేయించుకున్న శ్రీనివాస్ పై అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు తన భూమి తనకు ఇప్పించాలని బాధితురాలు కలెక్టర్‌కు విన్నవించుకుంది.

# ఎక్సైజ్ శాఖలో లొల్లి, మసకబారిన ప్రతిష్ట

### బదిలీలోనూ ఎక్సైజ్ మార్క్
### తప్పు చేస్తే కోరుకున్న చోటికి డిప్యూటేషన్
### ఆరోపణ వస్తే దూర ప్రాంతాలకు బదిలీ





ప్రజాపక్షం/ఖమ్మం: ఊరందరిది ఒక దారి ఉలిపి కట్టేది మరో దారి అన్నట్లు అన్ని ప్రభుత్వ శాఖలు ఒక రీతి ఎక్సైజ్ శాఖ మరో రీతి అన్నట్లుంది శాఖ పనితీరు. ఉద్యోగుల వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఎక్సైజ్ శాఖలో పైరవీలకు పెద్దపీట వేస్తున్నారు. ఇక బదిలీల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. పరపతి ఉంటే చాలు పని చేయక పోయినా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగానికి ఢోకా లేదన్న భావన ఆ శాఖ ఉద్యోగుల్లో వ్యక్తమవుతుంది. శాఖ ఉద్యోగులే ఆ శాఖకు అప్రతిష్ట తీసుకు వస్తున్నారు. తలను తోక ఆడించినట్లు కానిస్టేబుల్స్ ఉన్నతాధికారులను తిప్పేస్తున్నారు. ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఓ ఘటన ఆ శాఖ తీరుకు అద్దం పడుతుంది. కులం, వర్గం ఇతర వ్యవహారాలు ఎక్సైజ్ శాఖలో కొందరికి వరంగా మారగ మరి కొందరి ఉద్యోగులకు శాపమైంది. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్‌లో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ సరిగ్గా విధులు హాజరు కాకుండా కుల పంచాయితీలో ఉంటాడని ఆ శాఖలో ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఎస్ఐ ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ మధ్య వివాదం జరిగింది. అది చిలికి చిలికి గాలివానలా మారింది. ఒక ప్రభుత్వ శాఖలో అది క్రమశిక్షణ కలిగి యూనిఫాం శాఖలో కొందరు కుల పెద్దలు ఒక ఉద్యోగి తరుపున స్టేషన్‌కు వచ్చి మరో అధికారిపై ఘర్షణ పడే స్థాయికి దారి తీసింది. ఈ క్రమంలో స్టేషన్‌లోనే ఓ పంచాయితీ నిర్వహించారు. బహుశా ప్రైవేటు వ్యక్తులు ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు సంబంధించి స్టేషన్‌లోనే పంచాయితీ నిర్వహించడం ఈ శాఖలో తప్ప మరో శాఖలో సాధ్యం కాకపోవచ్చు. ఇంత జరిగిన తర్వాత ఈ రచ్చకు కారణమైన ఉద్యోగుల బదిలీ విషయంలో ఎక్సైజ్ మార్క్ చూపించారు. ఎస్ఐను ఇతర జిల్లాలకు బదిలీ చేసి డిప్యూటేషన్ పై ఉన్న కానిస్టేబుల్‌ను మాత్రం ఆయన కోరిక మేరకు ఖమ్మంలోని మరింత అందుబాటులో ఉన్నమరో ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఘర్షణకు ఇద్దరు ఉద్యోగులు కారణమైనప్పుడు ఒకరి పట్ల ఒక నీతి మరొకరి పట్ల మరో నీతి ఎందుకు ప్రదర్శిస్తున్నారన్నది ఆ శాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. ఇప్పుడు ఈ బదిలీల తిరకాసు ఉన్నతాధికారులపై విమర్శలకు తావివ్వడమే గాక పైరవీ ఉంటే ఎక్సైజ్ శాఖలో ఉద్యోగులు ఏదైనా చేయవచ్చునన్న భావన బలపడింది.

శాఖ పనితీరు విషయానికొస్తే ఎవరు ఏ ఆరోపణ చేసినా ఆధారాలతో సహా మీడియాలో వార్తలు వచ్చినా స్పందించని శాఖలలో అగ్రగామి ఎక్సైజ్ శాఖ. ఉలుకు పలుకు ఉండదు ముఖ్యంగా మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్న ఆ శాఖ ఆ పని మాది కాదులే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. మద్యం వ్యాపారులు అధిక లాభాల కోసం తమ దుకాణాల్లో విక్రయిస్తే ఎంఆర్‌పికే విక్రయించాలని బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నారు. అధిక ధర కలిగిన మద్యం సైతం బెల్ట్ షాపుల్లో లభ్యమవతుంది. ఈ విషయం అనేక సార్లు ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదులు అందినా కనీస చర్యలు తీసుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి గతంలో ఇతర రాష్ట్రాలకు మద్యం తరలిపోతుందని వాహన నెంబర్లతో మీడియాలో వార్తలు వచ్చినా ఆ శాఖలో చలనం లేకపోయింది. ఇప్పుడు కాపు సారా తయారీ కూడా క్రమక్రమంగా పుంజుకుంటుంది.తయారీ దారులు ఎక్సైజ్ శాఖ తీరును గమనించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయం తెలిస్తే ఎక్సైజ్ అధికారులు సంబంధికులతో మాట్లాడుతారు తప్ప ఎందుకో కాని చర్యలు తీసుకోరు. సుదీర్ఘ కాలం ఒకే స్టేషన్‌కు కొందరు పరిమితమై తమ దందా నడిపిస్తున్నారు. మొత్తం ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయకపోతే ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడటమే గాక వినియోగదారులు సైతం ఇబ్బందిపడాల్సి వస్తుంది. మరోసారి కాపుసారా మహమ్మారి విజృంభించే అవకాశం ఉంది.

## సాయిరి మహేందర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయి మహేందర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నాడని ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని సాయిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మహేందర్ ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేగోళం అబ్బయ్య, దామోదర్ రావు, కల్లేపల్లి జానీ , చిలుక సతీష్, ముస్తాల రవీందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**DOCUMENTS LOST**

I, SYED SAIF HUSSAIN, S/o. SYED SABBER HUSSAIN, R/o. Nirmal. Have lost my SSC Marks Memo Bearing Roll No. 1235110491 while Travelling. If found Contact: 7893344352

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

### కలెక్టర్ కార్యాలయాల్లో ఎఐఎస్ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/హన్మకొండ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్ నిధులు విడుదల చేయాలని హన్మకొండ కలెక్టర్ పి.ప్రావీణ్యకు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం హన్మకొండలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ ఆద్వర్యంలో హన్మకొండ కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో భాగంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, మూడు సంవత్సరాలుగా నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్ నిధులు విడుదల కాక కళాశాలలు సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందిగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్ నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు అఖిల్, గణేష్ పాల్గొన్నారు.



**పెద్దపల్లి ప్రతినిధి:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ స్టాలిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, మొలుగూరి సోను, కనుకుంట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.



**సిద్దిపేట అర్బన్ :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ అధికారులను కోరారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంల్లో కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్, నాయకులు జక్కుల అనిరుధ్, షేక్ యాసిన్, సిద్దుల సుమన్, హేమంత్ తదితరులు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/కాజీపేట :** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాజీపేటలోని వాటర్ ట్యాంక్ వద్ద మాలోతు శంకర్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు 60వేల మంది పనిచేస్తున్నారని, పని చేస్తేనే పూట గడిచే పరిస్థితి వారికి ఉందని, వారికి సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 8000 దరఖాస్తులు పెండింగ్‌లో కార్మిక శాఖ వద్ద ఉన్నాయని, వారికి తక్షణమే ఆర్థిక సహాయం అధించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాజీపేట మండల కన్వీనర్‌గా మాలోతు శంకర్‌నాయక్, కో కన్వీనర్‌గా ఆర్.పూర్ణచందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి, మాలోతు శంకర్, ఆర్.పూర్ణచందర్, రాసమల్ల కుమార్, రాధారపు విజయ్ కుమార్, బరిగల కుడిస్వామి, గూడూరు సునీల్‌కుమార్, కె.సవీందర్, సుమన్, యాకయ్య, పులి మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/చింతపల్లి :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో సోమవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం భద్రత కూడా కల్పించకుండా, ప్రభుత్వాలు వారిపై సమితి తల్లి ప్రేమ చూపుతుందని విమర్శించారు. 55 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికునికి నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెళ్ళి కానుకను లక్ష రూపాయలకు పెంచాలని, మహిళా కార్మికుల ప్రసూతికి లక్ష రూపాయలు పెంచాలని, సాధారణ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి సంభారి శంకర్ పాల్గొన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికసంఘం మండల అధ్యక్షుడిగా పెంటమల్ల శేఖర్, కార్యదర్శిగా నక్కల గోని శాను, కోశాధికారిగా గోరటి యాదయ్య, ఉపాధ్యక్షులుగా కుర్మేటి శ్రీరాములు, కూన రమేష్, సహాయ కార్యదర్శులుగా గోరటి కోటి, బెల్లంకొండ శ్రీనివాస్, అయితపాక సుభాష్‌తో పాటు 20 సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# విపక్షాల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వద్దు

### మోదీ ప్రభుత్వ తీరుపై ఇండియా కూటమి ఎంపిలు నిరసన




**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా చేసుకొని మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రతిపక్ష పార్టీల ఎంపిలు ఆరోపించారు. అందుకోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. ప్రతిపక్షపార్టీలపై మోదీ ప్రభుత్వం వ్యవహారశైలికి నిరసనగా సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో ఇండియా కూటమికి చెందిన ఎంపిలు సోమవారం ఆందోళనకు దిగారు. టిఎంసి, ఆప్ సహా ఇండియా కూటమిలోని అనేక మంది సభ్యులు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఈ నిరసనల్లో పాల్గొన్నారు. వారంతా తమ నిరసనను కొనసాగిస్తూ పార్లమెంట్ మకర ద్వారం వైపు ర్యాలీగా వెళ్లారు. 'ప్రతిపక్షా గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం ఆపాలని, అవినీతి చేసిన వారు బిజెపిలో చేరితే.. మరింత అవినీతి చేసుకునేందుకు వారికి లైసెన్స్ ఇస్తుంది' అంటూ ప్లకార్డులు చేబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ కటకటలా వెనుక నిలబడిన ఉన్న పోస్టర్‌ను ఆప్ ఎంపి రాఘవ చద్దా ప్రదరించారు. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లో అరెస్టు అయిన ముగ్గురు మంత్రులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు నినదించారు. ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్‌పై ఇడిని ప్రయోగించడాన్ని మానుకోవాలన్నారు. ప్రతిపక్ష నేతల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుని వారి అధికారాలను దుర్వినియోగపర్చండపై ఇండియా కూటమి నేతలంతా ఐక్యంగా ఉన్నామని కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది మార్చి 21న ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో డిల్లీ సిఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల ఆయనకు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో కేజ్రీవాల్ బెయిల్ రద్దు చేయాలంటూ.. ఢిల్లీ హైకోర్టును ఇడి ఆశ్రయించింది. దీంతో ఆయన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఇంకోవైపు అరవింద్ కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. జులై 12వ తేదీ వరకు అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. మరోవైపు ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సిబిఐ గత వారం అరెస్ట్ చేసిన విషయం విధితమే.

## మతవిద్వేషాలు రెచ్చగొట్టేందుకు మోదీ 200లకు పైగా ప్రసంగాలు : ఖర్గే



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ ఒకప్పుడు పొత్తులను అపహాస్యం చేశారని, ఇప్పుడు అదే పొత్తులపైనే ఆధారపడ్డారని ఎఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలంటించారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడారు. మోదీ సినిమాలో అన్ని లీకేజీలే ఉన్నాయని, నీట్ యుజి లీక్ చేశారని, నీట్ పిజి రద్దు చేశారని, అయోధ్య రామాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అయ్యిందని దుయ్యబట్టారు. ఏటా 20లక్షల ఉద్యోగాల మాట హామీ ఏమైందని, మోదీ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు చెప్పడంతో పాటు కుల, మత, భాషా పరంగా ప్రజలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు 200కు పైగా ప్రసంగాలు ఇచ్చారని, మోదీ 117 ఎన్నికల ప్రచార సభలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కానీ ఇసి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు విపక్షాల అకౌంట్లు ఫ్రీజ్ చేశారని, విపక్షాల ప్రచారాన్ని ఎన్నో రకాలుగా అడ్డుకున్నారని, విపక్షాలను అణగదొక్కడం మోదీకి అలవాటుగా మారిందని ఖర్గే మండిపడ్డారు. 'చందా దేవో అండ్ దందా ఖరో' మోదీ సర్కార్ నినాదంగా మారిందని, ఇడి, సిబిఐ, ఐటిని ఇష్టం వచ్చినట్టు కేంద్రప్రభుత్వం వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాలు పడగొట్టడం నేతలను కొనడం కామన్‌గా మారిందని, ప్రభుత్వాలను పడగొట్టడం ప్రజాస్వామ్యానికి అవమానం కాదా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలను పడగొట్టారని, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, కేజ్రీవాల్‌కు ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్ట్ చేశారని, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు.

**ఖర్గే, ధన్‌ఖర్ మధ్య సరదా సంభాషణ...** రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ఖర్గే ప్రసంగం సందర్భంగా రాజ్యసభలో సోమవారం సరదా సంభాషణ చోటుచేసుకుంది. ధన్యవాద తీర్మానంపై చర్చకు ఖర్గే ఉపక్రమిస్తూ, మోకాళ్ల నొప్పుల కారణంగా ఎక్కువ సేపు నిలబడలేకపోతున్నానని, చైర్మన్ అనుమతిస్తే కూర్చుని మాట్లాడతానని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ధన్‌ఖర్ సుముఖత వ్యక్తం చేశారు. సభలో ప్రసంగించేటప్పుడు సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోండి, ఇబ్బంది అనిపిస్తే కూర్చుని మాట్లాడవచ్చని, నిర్ణయం మీదేనన్నారు. ఖర్గే తిరిగి స్పందిస్తూ, కూర్చుని మాట్లాడితే నిలబడి మాట్లాడినంత పట్టుగా ఉండదన్నారు. ఆయన మాటలతో చైర్మన్ ఏకీభవిస్తూ, ఈ విషయంలో మీకు నేను సాయం చేస్తానన్నారు. దీనికి వెంటనే ఖర్గే బదులిస్తూ, కొన్ని సార్లు మీరు (చైర్మన్) మాకు సహకరిస్తుంటారని, దాన్ని తాము ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని చెప్పడంతో సభలో నవ్వులు వెల్లివిరిసాయి. దీంతో ఖర్గే తిరిగి స్పందిస్తూ.. 'వాళ్లు ఎందుకు నవ్వుతున్నారు? తమ నవ్వులతో సభ్యులు నన్ను తప్పుదారి పట్టిస్తున్నారు. వారికి చైర్మన్ కూడా తోడయ్యారు' అని వ్యాఖ్యానించారు. ధన్‌ఖర్ ఎక్కడా తగ్గకుండా, తాను కూడా ఒక్కోసారి అలాగే మాట్లాడుతుంటానని చమత్కరించారు. ఇద్దరు నాయకుల మధ్య సరదా సంభాషణ చూసి సభలోనే ఉన్న సోనియాగాంధీ సైతం చిరునవ్వులు చిందించారు. దీంతో సభలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

## బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా 5 నుంచి 12 వరకు ఆందోళనలు

### వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణలో ఉన్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జులై 5 నుంచి 12 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టాన్ని మార్చి దేశంలో ఉన్న నూతన బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలైన కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఇవ్వకుండా ప్రైవేటు వారికి వేలం ద్వారా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో ఎంఎండిఆర్ బిల్లుపై గత బిఆర్ఎస్ ఎంపిలు మద్దతు తెలిపారని, అందుకే ఈచట్టం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను నామినేషన్ కింద ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా, తెలంగాణ బిడ్డగా ఉన్న కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి పదవిలో ఉన్నందున వేలం వేయకుండా సింగరేణికి బొగ్గు గనులు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రప్రభుత్వంతో మిలాకతై సింగరేణికు నాలుగు బొగ్గు బ్లాక్‌లను తన అనుయాయులకు చెందే విధంగా సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకుందని ఆయన ఆరోపించారు. వేలంలో దక్కించుకున్న రెండు బొగ్గు బ్లాక్‌లైన కోయగూడెం ఓసిపి త్రీ మరియు సత్తుపల్లి ఓసిపి బిఆర్ఎస్‌కు చెందిన అరబిందో మరియు అవంతిక అనే ప్రైవేటు కంపెనీలు ఇంతవరకు వాటిని ప్రారంబించలేదని కనుక వాటిని రద్దు చేయడంతో మిగతా గనులను సింగరేణికి ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వంకు లేఖ రాయడం జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి చెందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ఎఐటియుసిలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జులై 5 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని, 8 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ ఆఫీసుల ముందు రిలే నిరాహారదీక్షలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో ఎల్.ప్రకాశ్, వైవిరావు, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి,కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, ఆరెల్లి పోషం గండి ప్రసాద్, ఆకునూరి శంకరయ్య, బండి మల్లేశ్, ఎం.సంపత్, రెడ్డి వెంకటస్వామి, ఉప్పులేటి తిరుపతి, కలవేణ రాజేష్, బండారి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, భాస్కర్, కనకరాజు పాల్గొన్నారు.




## కొత్తగూడెం-పాల్వంచ ఒఆర్ఆర్‌కు రూ.450కోట్లు



### నియోజకవర్గాభివృద్ధికి మరో రూ.72.86 కోట్లు మంజూరు

### నగరాలకు దీటుగా అభివృద్ధి చేసి తీరుతాం : కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలను కలుపుతూ ఓఆర్ఆర్ రోడ్డు నిర్మాణాకి రూ.450 కోట్లతో పాటు నియోజకవర్గాభివృద్ధికి మరో రూ.72.86 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.128.48 కోట్లు, డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలకు రూ.4 కోట్ల పనులకు భూమిపూజ చేసిన అనతి కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్, అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు అనిశెట్టిపల్లి జాతీయరహదారి 30పి నుండి సర్వారం, రామవరం, జగన్నాధపురం మీదుగా 30వ జాతీయ రహదారిని కలుపుతూ 25 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. భద్రాచలం పట్టణం వద్ద విజయవాడ-జగ్దదల్‌పూర్ జాతీయ రహదారి 30ని 70 కిమీ మేరా అభివృద్ధి చేసేందుకు గానూ రూ.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా పాదచారులు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జీ నిర్మాణానికి రూ.2.64 కోట్ల నిధుల మంజూరు లభించిందని, విజయవాడ-జగ్దల్‌పూర్ 30వ జాతీయ రహదారిలో కిన్నెరసాని నదిపై పంతెన నిర్మాణానికి రూ.20.22 కోట్ల మంజూరీ లభించిందని చెప్పారు. మంజూరై నిధులతో పనులు పూర్తయితే పట్టణాలకు ధీటుగా కొత్తగూడెం, పాల్వంచ నగరాలు తయారవుతాయని, గడిచిన ఏడుమాసాల్లో కొత్తగూడెం నియోజకవర్గానికి వివిధ రూపాల్లో నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మంత్రివర్గం సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తోందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళీ, కొండా వెంకన్న, టిడిపి నాయకులు నల్లమల వేణు, శరత్, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, వి.పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నూనావత్ గోవింద్, యూసఫ్, నేరళ్ల రమేష్ పాల్గొన్నారు.

### అవకాశాలు అందిపుచ్చుకోవాలి

అవకాశాలను అందిపుచ్చుకుని యువత జీవితాల్లో స్థిరపడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్ మేళా జరిగింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిందన్నారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగం ద్వారా సంపాదించిన మొదటి సంపాదనతో తల్లిదండ్రులను సంతోషపెట్టాలని, వారు ఎంతో కష్టపడి మీరు ఈ స్థాయికి ఎదిగేందుకు ఆహర్నిశలు శ్రమిస్తారన్నారు. జాబ్‌మేళా మొత్తం 60 ప్రముఖ ప్రైవేటు కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా, మొత్తం 1531 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. తొలివిడతగా 603 మందికి, తదుపరి ఇంటర్వ్యూకి 928 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో మొదటి పది మందికి నియామకపు పత్రాలను ఎమ్మెల్యే కూనంనేని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు ధనరాజు, జమలయ్య, జిల్లా యువత, క్రీడల అధికారి సంజీవరావు, సూపరింటిండెంట్ ఉదయ్‌కుమార్ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, సిపిఐ నాయకులు ఎస్‌కె సాబీర్ పాషా, వంగా వెంకట్, పూర్ణచంద్రరావు, జోసఫ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఇక ఎంఎల్‌సిల వంతు!

(మొదటి పేజీ తరువాయి)

కూడా దక్కకపోవడంతో బిఆర్ఎస్‌శ్రేణుల్లో తీవ్ర నిస్తేజం నెలకొన్నది. పైగా గత కొంత కాలంగా గులాబీ పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు, సిట్టింగ్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరారు. మరి కొంత మంది కూడా చేరేందుకు సిద్దంగా ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎంఎల్‌సిలు కూడా తమ రాజకీయ భవిష్యత్తును చూసుకుంటున్నారు. అధికార పార్టీలో వెళ్లేందుకు కొందరు ఆసక్తిగా ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కొందరు ఎంఎల్‌సిలు ఇది వరకు కాంగ్రెస్‌లో ఉన్నవారే కావడంతో వారు తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖతగానే ఉన్నారని అధికార పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఈ నెల రెండు నుంచి మూడవ వారంలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న మరో రెండు స్థానాలను కూడా వెంటనే భర్తీ చేసేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. గవర్నర్‌తో బేటీ అయిన టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గవర్నర్ కోటా ఎంఎల్‌సిల నియామకం అంశాన్ని కూడా ప్రస్తావించినట్టు తెలిసింది. సభలో కాంగ్రెస్‌కు మరో ఇద్దరు సభ్యులు తోడవుతే మరింత బలం పెరుగుతుందని కాంగ్రెస్ యోచిస్తోంది. గతంలో కాంగ్రెస్‌కు చెందిన ఎంఎల్‌సిలను బిఆర్ఎస్‌లో చేర్చుకోవడంతో సరైన సంఖ్యా బలం లేకపోవడంతో శాసనమండలిలో షబ్బీర్‌అలీకి ప్రధానప్రతిపక్ష హోదాను పోయింది. ప్రస్తుతం శాసనమండలిలో బిఆర్ఎస్‌కు ఎక్కవ మంది సభ్యులు ఉండగా వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో ఆ పార్టీకి కూడా ప్రతిపక్ష హోదా దక్కే అవకాశాలు ఉండవని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఐదు నెలల జైలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేయడంతోపాటు పరువు నష్టం కలిగించేలా పత్రికా ప్రకటన జారీ చేశారని ఆరోపిస్తూ పాట్కర్‌పై ఆయన సైతం 2001లో రెండు కేసులు దాఖలు చేశారు.

## కలుసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. పాత ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్ళు అవుతోందని, పునర్వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించి అంశాలపై అనేకమార్లు చర్చలు జరిగాయన్నారు. ఆఅంశాల పరిష్కారం ద్వారా మన రాష్ట్రాల సంక్షేమం, ఉన్నతిపై కీలక ప్రభావం చూపుతాయన్నారు. ఆ సమస్యలను అత్యంత జాగురతతో ఆమోదయోగ్యంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. ఈ నేపథ్యంలో జూలై 6న హైదరాబాద్‌లో కలుసుకుందామని సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిపాదన చేశారు. ఈ ముఖాముఖి సమావేశం ద్వారా క్లిష్టమైన అంశాలపై సమగ్రంగా చర్చించుకునేందుకు అవకాశం లభిస్తుందని, తద్వారా ఇరురాష్ట్రాలకు పరస్పర ప్రయోజనకర పరిష్కారాలు సాధించవచ్చని పేర్కొన్నారు. మన చర్చలు ఫలప్రదమైన ఫలితాలకు దారి తీస్తుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉప్పొంగిన బొగత జలపాతం

### పర్యాటకులను ఆకర్షిస్తున్న జలధారలు

**ప్రజాపక్షం/వాజేడు :** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీవర్షాలకు బొగత జలపాతానికి వరదనీరు భారీగా చేరుతుంది. దీంతో సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి జలధారాలు జాలు పారుతూ పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఇన్ని రోజులుగా వెలవెలబోయిన బొగత జలపాతం ఎగువన కురుస్తున్న భారీవర్షాలకు పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తూ పర్యాటకులను కనువిందు చేస్తుంది. తెలంగాణ నలుమూలల నుంచి పర్యాటకులు భారీగా తరలిరావడంతో జలప్రాంత ప్రాంగణం జనసంద్రంగా మారుతుంది.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## ఆర్‌టిసి బస్సుల పునఃప్రారంభంపై ప్రజల హర్షం

ప్రజాపక్షం/కేశంపేట: షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి కేశంపేట మండలంలోని పలు గ్రామాలకు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బస్సులను ప్రారంభించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలంలోని గ్రామాలకు షాద్‌నగర్ డిపో నుంచి విరివిగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపారు. అర్ధాంతరంగా బస్సులను నడపడం నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ శంకర్ డిపో అధికారులతో మాట్లాడి బస్సులను పునరుద్ధరింపజేశారు. షాద్‌నగర్ నుంచి సంగెం, షాద్‌నగర్‌కొండారెడ్డిపల్లి, షాద్‌నగర్‌కొత్తపేట, షాద్‌నగర్‌కడ్తాల్ వయా చౌలపల్లి గ్రామాలకు బస్సులు ప్రారంభమయ్యాయి. బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి, గూడ వీరేష్, జగదీశ్వర్, భాస్కర్‌గౌడ్, అనసూయమ్మ, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, రమేష్, దర్శన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధమైన ధరణి కమిటీ నివేదిక

### వందకు పైగా సూచనలతో రెండు రోజుల్లో మంత్రితో పాటు సిఎంకు రిపోర్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్: ధరణి కమిటీ నివేదిక సిద్ధమైంది. రెండురోజుల్లో ధరణి కమిటీ మంత్రితో పాటు ముఖ్యమంత్రిని కలిసి రిపోర్ట్ ఇవ్వనుంది. వందకుపైగా సూచనలతో ధరణి కమిటీ తన నివేదికను సిద్ధం చేసింది. 1971 ఆర్‌ఓఆర్ చట్టాన్ని మళ్ళీ తీసుకురావాలని ధరణి కమిటీ సూచించినట్లు సమాచా రం. భూములకు సంబంధించిన అన్నిచట్టాలను ఓకే గొడుగు కిందకు తీసుకురావాలని కమిటీ మరో ముఖ్యమైన సూచన చేసింది. ఎంఆర్‌ఓ, ఆర్‌డిఓలకు అధికారాలు బదిలీ చేయాలని నివేదికలో ఉన్నట్లు సమాచారం. సర్వేయర్ల రిక్రూట్‌మెంట్ చేయాలని, భూముల వాస్తవ పరిస్థితి పూర్తి స్థాయి సర్వే చేయాలని, దరఖాస్తు చేసుకున్న 30రోజులలో పరిష్కారం చూపే విధంగా నిబంధనలు ఉన్నట్టు సమాచారం.

# విపత్తుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత







### ఒఆర్‌ఆర్ వరకు ఒకేగొడుగు కిందకు
### జిహెచ్‌ఎంసి, 27 మున్సిపాలిటీలు, 33 గ్రామపంచాయతీల వరకు
### హైడ్రాగా విపత్తుల నిర్వహణ విభాగం
### మూసీ అభివృద్ధి పనులు వేగవంతం
### వారసత్వ కట్టడాల రక్షణకు ప్రాధాన్యం
### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణి జరగాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ పరిపాలన, హెచ్ఎండిఏ, మూసీ అభివృద్ధి సంస్థ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ భౌగోళిక పరిధిని విస్తరించనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్) వరకు విస్తరించాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. డిఐజి స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్‌గా, ఎస్‌పి స్థాయి అధికారులు అదనపు డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి తెలిపారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక బృందాలను ఈ విభాగంలో నియమించాలని సూచించారు.

**సమస్యల పరిష్కారంలో హైడ్రా క్రియాశీలక పాత్ర..**

కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలు అందించేలా పునర్వవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటిలో హైడ్రా క్రియాశీలంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దాదాపు రెండు వేల కిలోమీటర్ల జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు.

**విపత్తుల విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలి..**

హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీ, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందిస్తుందన్నారు. అందుకు వీలుగా ఈ విభాగం పునర్వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

**మూసీ పనులు వేగవంతం చేయాలి..**

మూసీ రివర్ డెవెలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. హైదరాబాద్ సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని ఆయుర్వేద ఆస్పత్రి, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరు లాంటి వివిధ చారిత్రక ప్రదేశాలపై జిహెచ్ఎంసి పవర్ పాయింట్ ప్రజంషన్‌ను ప్రదర్శించింది. వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న వివిధ మార్గాలను అన్వేషించాలన్నారు. వీటిలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అనుసంధానం చేసేందుకు వీలైన వాటిని గుర్తించి, అందులోనే జోడించాలని సిఎం సూచించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట, జిహెచ్ఎంసి విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏ.వి. రంగనాథ్, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎం.డి. అశోక్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది

### స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అమ్మని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో జరిగిన 5కె రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు డాక్టర్లను దేవుడికంటే ఎక్కువగా ఆరాధిస్తారన్నారు. గాంధీ ఆసుపత్రికి చెందిన సీనియర్ వైద్యురాలు డాక్టర్ జ్యోతిరెడ్డి, బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కాళీ మందిర్ వద్ద రోగులకు వైద్య సేవల్ని అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్స్ డేను పురస్కరించుకొని పలువురు డాక్టర్ల సేవల్ని గుర్తించిన అమ్మని ఫౌండేషన్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్నం సునిత మహేందర్‌రెడ్డి, గాంధీ అసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ వైద్యురాలు డాక్టర్ ప్రవీణ, డాక్టర్.పద్మజ, డాక్టర్ జ్యోతి రెడ్డి, పుల్ల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం జీవితాన్ని అంకితం చేసిన బిధాన్ చంద్రరాయ్

### షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మీ

ప్రజాపక్షం/షాద్‌నగర్: పేదల వైద్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహావ్యక్తి డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ అని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు రమాదేవి డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో బోర్‌వెల్ ప్రారంభం



ప్రజాపక్షం/నార్సింగి: రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వీరశైవలింగాయత్ శ్మశాన వాటికలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ బోరు పనులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ లంకల పద్మ, ఉషారాణి, డిఈ నరసింహరాజు, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్, అరుణ్ దామోదర్‌రెడ్డి, విశ్వనాథ్, వినోద్, బబ్లు, వంశీ పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలి

### మాజీ కార్పొరేటర్లు డిమాండ్



ప్రజాపక్షం/వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారి విస్తర్ణ లో భాగంగా పనామా వద్ద వచ్చే ఫిల్లర్‌తో ఫ్లై ఓవర్ మాత్రమే నిర్మాణం చేపట్టాలని, అండర్ పాస్ వద్దని బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, జివి సాగర్‌రెడ్డి లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనస్థలిపురంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంతో పేరు ప్రఖ్యాత కల్గిన వనస్థలిపురం డివిజన్‌ను అండర్ పాస్ నిర్మాణం చేస్తే ఈ ప్రాంత కనుమరువుతాయని వారు పేర్కొన్నారు. ఎంతో మంది వ్యాపార సముదాయం ఉన్న ఈ ప్రాంతం కావడంతో పాటు ప్రజా అభిప్రాయ మేరకే ఫ్లైఓవర్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కోరారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/షాద్‌నగర్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు పంపిణీ చేయకుండా ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం ముట్టడి చేయనున్నట్లు సహకార యూనియన్ మాజీ చైర్మెన్ రాజావరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా వరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతం గా అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్ళను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం : సబితా ఇంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడుదామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసాశారు. ఈ సందర్భంగా వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ క్యాడర్ ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా చూడాలని, త్వరలో నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరు ముందుకు నడవలన్నారు. త్వరలో చేవెళ్ల నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం తోపాటు ప్రతి పదిహేను రోజులకొక్కసారి చేవెళ్ల నియోజకవర్గములో పర్యటిస్తానానని తెలిపారు. పార్టీకి పటిష్టమైన క్యాడర్,లీడర్ లు ఉన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయండని హితబోధ చేశారు. చేవెళ్ల మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు సబితా రెడ్డి ని కలిసిన వారిలో వున్నారు.ఈ సమావేశంలో డిసి ఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ జడ్.పి టిసి బాలరాజు,పార్టీ అధ్యక్షులు ప్రభాకర్,దేశమొల్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి

### డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు అందచేశారు. డిప్యూటీ మేయర్ శ్రీలత జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 16 విన్నపాలు వచ్చాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ప్రజావాణి కార్యక్రమంలో 53 విన్నపాలు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్‌లలో మొత్తం 97 అర్జీలు వచ్చాయి. చార్మినార్ జోన్‌లో 5 రాగా, సికింద్రాబాద్ జోన్‌లో 12, కూకట్ పల్లి జోన్‌లో 37, శేరిలింగంపల్లి జోన్ 33, ఖైరతాబాద్ జోన్ 8, ఎల్.బి.నగర్ జోన్‌లో 2 విజ్ఞప్తులు వచ్చాయి. కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ కె.శ్రీవాత్సవ, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, సునంద రాణి, చీఫ్ సిటీప్లానర్ రాజేంద్ర ప్రసాద్ నాయక్, సిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమలాజిస్ట్ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరి డాక్టర్ అబ్దుల్ వకీల్, ట్యాక్స్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సిఇ కెఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు టిపిసిసి చీఫ్ బాధ్యత

### రాహుల్‌గాంధీకి దాసు సురేష్ వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో కీలకమైన పదవులు ఓసిలకు, ఎస్‌సిలకు దక్కాయని, పిసిసి చీఫ్ పోస్టును అయినా బిసిలకు అప్పగించాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సోమవారం లేఖ రాసినట్లు బిసి రాజ్యాధికార సమితి ప్రెసిడెంట్ దాసు సురేష్ వెల్లడించారు. సోమవారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. తెలంగాణలో సామాజిక న్యాయం సాక్షాత్కారం అవ్వాలంటే పిసిసి అధ్యక్షుడిగా బిసికే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలలో బిసిలకు కేటాయించాల్సిన సీట్లు రాకున్నా రాష్ట్రంలో కెసిఆర్ పాలన నుండి విముక్తి కోసం అధికార మార్పు కోసం బిసిలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారన్నారు. పార్లమెంటు సీట్ల కేటాయింపులో బిసిలకు అన్యాయం జరిగినా ఓపికతోనే మా వర్గాలు అవకాశాలను ఇనుమడింపజేసుకోవడం కోసమే పిసిసి అధ్యక్ష పదవిని అడుగుతున్నామని తమ ఆవేదనను కాంగ్రెస్ అధిష్టానం అర్థం చేసుకోవాలని దాసు సురేష్ కోరారు. 30 ఏళ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు పనిచేస్తున్న బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ పిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని దాసు సురేష్ ఆ లేఖలో కోరారు.

## గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు : ఎంపిపి

ప్రజాపక్షం/యాచారం : నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్న గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని యాచారం ఎంపిపి కోప్పు సుకన్యభాష డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మహాత్మాగాంధి జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలను ఎఇపిపి సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. పాఠశాలలో 1280 మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి సరైన సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠాలు బోధించాలన్నారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలోకి కోతులు వస్తున్నాయని, బట్టలు ఎత్తుకెళ్తున్నాయని విద్యార్థులు ఎంపిపి తెలిపారు. విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదని మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, తాండ్ర రవింధర్, గోగికార్ రమేశ్, నారిమళ్ళ రమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ సానికుమారి తదితరులు పాల్గోన్నారు.




## ప్రైవేటుకు దీటుగా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య



### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/వనస్థలిపురం : ప్రైవేటుకు ధీటుగా...ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు డిజిటల్ గదులను స్థానిక హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తరగతి గదులకు పెంచుకోవడానికి అదనపు అంతస్థుల నిర్మాణం చేపట్టాలని కోరగా, నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఇష్టంతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. చదువుతోనే భవిషత్‌లో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, రమావత్ పద్మ శ్రీనివాస్ నాయక్, మహిళ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్త నారగోని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, మధు, అనిత, కిట్టు, అరుణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



ఫోటో రైటప్ నెం:01విఎస్‌పి02: నందనవనంలో ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంబించి మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి

### ప్రజలకు నాణ్యతమైన వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రి వచ్చే ప్రజలకు నాణ్యతమైన అందించే విధంగా వైద్యులు పనిచేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. సోమవారం వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌ను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి పరిశీలించి, హాస్పిటల్ వైద్యులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు అనేక సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగాసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం చేస్తామని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రికు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యంసౌకర్యం అందించాలని, వైద్యులు సకాలంలో ఆసుపత్రి రావాలని సూచించారు. హాస్పిటల్‌లో డయాలసిస్ సేవలు మరింత మెరుగుపర్చాలని వైద్యులకు తెలిపారు. కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపర్‌డెంట్ హరిప్రియ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌలభ్యమే ప్రభుత్వ లక్ష్యం





### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రయాణికుల సౌలభ్యమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం షాద్‌నగర్ ఆర్‌టిసి బస్టాండ్ అవరణలో నూతన ఆర్‌టిసి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. గతంలో రద్దు చేసిన రూట్లో బస్సులను పున:రుద్దరించడంతోపాటు కొత్త రూట్‌లలో బస్సులను నడిపించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా పూర్తి స్థాయిలో బస్సులకు పాఠశాల సమయ వేళలకు నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అనంతర ఎమ్మెల్యే ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్‌టిసి సమస్యలపై మహిళా ప్రయాణికును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉషా, జడ్పిటిసి వెంకట్‌రాం రెడ్డి, ఎంపిటిసి భార్గవ్‌కుమార్‌రెడ్డి, బాబర్‌ఖాన్, అందె మోహన్ ముదిరాజ్, లింగారెడ్డిగూడ అశోక్‌లు ఉన్నారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోండి
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి

**కొత్తూరు:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకొని సర్వేలు చేయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి పత్రం అందజేశారు. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామ పరిసరాల్లో ప్రభుత్వ భూముల్లో పేదలకు తీవ్ర అన్యాయం చోటు చేసుకుందని, ప్రభుత్వ భూములను సర్వే చేయించి రక్షించేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ సిద్దాపూర్ ప్రభుత్వ భూములను వెసర్వే చేసి నిజమైన ప్రభుత్వ భూములను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సూచించారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

### జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి

ప్రజాపక్షం/షాబాద్ : రైతు భరోసాపై రైతుల అభిప్రాయం సేకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల వ్యవసాయ రైతు వేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం చైర్మన్ చల్లా శేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు సుమారుగా 50మంది రైతుల అభిప్రాయలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆధేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల నుండి రైతుల అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండల్లాలో రైతుల అభిప్రాయం మేరకు ప్రభుత్వానికి నివేధిక అందజేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో రైతుల అభిప్రాయాలు లేకుండా చేయడంతో రైతులకు రాయితీపై ఎరువులు విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, డ్రిఫ్ రాలేదని రైతులు ఆవేధన వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ అధికారిణి రమాదేవి, సత్యనారాయణ రెడ్డి, పిఎసిఎస్ వైజ్ చైర్మెన్ మద్దూర్ మల్లేష్, మండల పిఎసిఎస్ సీఈవో శివ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఎఈవోలు రాజేశ్వరి, సోనిశ్రీ, కిరణ్మై, సహాకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం/వనపర్తిటౌన్: లే అవుట్ ప్లాట్ల అనుమతి విషయంలో ప్రభుత్వ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లే అవుట్ కమిటీ సమావేశమై కమిటీ ముందుకు వచ్చిన లేఔట్లపై చర్చించారు. లే అవుట్ అనుమతి కొరకు వచ్చిన దరఖాస్తులను గరిష్టంగా 21 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుందని అందు వల్ల కమిటీలో ఉన్న మున్సిపల్ శాఖతో పాటు, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ , ఇరిగేషన్ , టౌన్ ప్లానింగ్ శాఖలు క్షేత్ర స్థాయిలో సైట్‌ను పరిశీలించి నిబంధనలకు లోబడి ఉన్నట్లయితే ఆన్ లైన్ ద్వారా ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ , పంచాయతీ రాజ్ కార్య నిర్వాహక ఇంజనీర్ దేశ్య నాయక్ , ఇరిగేషన్ అధికారి , లే అవుట్ డెవలపరు పాల్గొన్నారు.

## స్కూల్‌బస్ ఫిట్నెస్‌పై అధికారులు దృష్టి

### నిబంధనలు పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేయండి



ప్రజాపక్షం/వనపర్తిటౌన్ : వనపర్తి జిల్లాలో స్కూల్ బస్ ఫిట్నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టి సాధించాలని ఆర్డీఓ ఆఫీస్‌లో జిల్లా రవాణా శాఖ అధికా రి మానసకి ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆది మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లు మద్యం సేవించి విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నారని తక్షణమే రవాణా శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను తరలించే బస్సుల సామర్థ్యం పక్కాగా ఉండేలా చూడాలని ఫిట్నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిట్నెస్ లేని బస్సులను వెంటనే సీస్ చేయడంతో పాటు విద్యా సంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని అన్నారు. విద్యార్థుల భద్రత, రక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ విద్యా సంస్థలు, స్కూల్ బస్సులోను ఫిట్నెస్ గా ఉండే బస్సులోనే నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి జిల్లా కమిటీ సభ్యులు భరత్ , సాయి , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిమినల్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాపక్షం/శ్రీరంగాపురం : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన క్రిమినల్ చట్టాలపై స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు గ్రామస్తులకు రాజకీయ నాయకులకు వగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి మరణ శిక్ష, గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష, ఎఫ్ఐఆర్ నమోదైన 90 రోజుల్లో కేసుకు సంబంధించిన అప్‌డేట్స్ కచ్చితంగా నమోదు చేయాలన్నారు. కేసులో వాదనలు పూర్తయిన 45 రోజుల్లో తీర్పు ఇవ్వాల్సిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసి న నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ తోటలపై అవగాహన

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండలంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మునగమనదిన్నే గ్రామంలో నాటినటువంటి అయిల్ ఫాం తోటలను వ్యవసాయ అధికారి చంద్రమౌళి సందర్శించడం జరిగింది. ఆయిల్ ఫామ్ తోటలో ప్రస్తుతం మంచి ఆదరణ లాభా లు వస్తున్నాయని రైతులకు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆయిల్ ఫాం తోట 3 సంవత్సరాలు అవుతుంది. కలుపు యజమాన్యం, ఆయిల్‌పామ్ ఆబేలేషన్ విధానం తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ అధికారి చంద్రమౌళి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, ఏఈఓ నరేష్ , గ్రామ రైతులు వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రకళ, సంజన, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/మల్దకల్: కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. అల్లంపూర్ నియోజకవర్గం, ఐజ మండలం, గుడిదొడ్డి గ్రామంలో రైతు పరుశురా ముదుకు చెందిన సర్వే నెంబర్ 321 లో 5ఎకరాలభూమిని ఇదే గ్రామానికిచెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారని,ఈ విషయాన్ని ఐజతహసీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు పలు సందర్భాల్లో ఫిర్యాదు చేసినప్పటికి ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో ఇవాళ కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి ముందు రైతు పరుశురాముడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు.

## రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలి

### ఎంఎల్ఎ డాక్టర్ రాజేష్‌రెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకునేం దుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సహకారసంఘాలు రాజకీయ నాయకులు కలిసికట్టుగా కృషిచేసి ప్రభుత్వలక్ష్యాన్ని నెరవేర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ సమావేశమందిరంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడం జరుగుతుందని త్వరలోనే రెండులక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత



ప్రజాపక్షం/వెల్దండ : మండల పరిధిలోని కొట్ర జడ్పిహెచ్ పాఠశాలలో కొట్ర గ్రామసేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు పోనుగోటి రవీందర్‌రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పివైస్‌చైర్మన్ ఠాగూర్‌బాలాజిసింగ్ చేతులమీదుగా పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్ కుమార్‌యాదవ్, జక్కులచిన్నజంగయ్యయాదవ్, తక్కెళ్లపల్లి శేఖర్, కడారి శ్రీనివాస్‌యాదవ్, కడారిరవీందర్‌యాదవ్, ఉడుతవెంకటయ్యయాదవ్, మల్లయ్య, శంకర్‌నాయక్, రామస్వామి, పోలేరాజు, రవికుమార్, దస్తగిరి, కృష్ణముదిరాజ్, అర్జున్, వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన భద్రాద్రి సాంస్కృతిక వారధి అంతారామమయం కార్యక్రమంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేసిన నాగోల్ లలితా నగర్‌కు చెందిన దేవకి కూచిపూడి నృత్యాలయ బృందం

# రేపు డిఎంఇ ముట్టడి

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ వినతి పత్రాలను అందజేసిన ఆసుపత్రి కార్మికులు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు వేతనాలు పెంపుకై ఈనెల మూడవ తేదీన చలో హైదరాబాద్ పేరుతో తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డిఎంఈ కార్యాలయాన్ని వేలాది మందితో ముట్టడిస్తున్నామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేశ్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన చలో డిఎంఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జీవన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డా.రమేశ్‌లకు అనుమతి లెటర్స్‌లను అందజేశారు. అనంతరం డాక్టర్స్‌డే పురస్కరించుకుని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్‌కి మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌ల సేవలను అభినందిస్తూ పారిశుద్ధ్య కార్మికులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య భద్రత పేషెంట్ కేర్ సూపర్ వైజర్ కార్మికుల జీతాలు పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఆసుపత్రి కార్మికులు జరిపిన అనేక ఆందోళనలు నేపథ్యంలో 2022 జూన్ మాసంలో పిఆర్సి జీవో నెంబర్ 60ని ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపచేసి రూ.15600 వేతనంతో నూతన టెండర్లను పూర్తి చేసిందన్నారు. కానీ అప్పటి ప్రభుత్వం, అప్పటి డిఎంఈ కాంట్రాక్టర్లకు దోచి పెట్టే విధంగా దొడ్డి దారిన ఆగస్టు నెల 2022 లో తప్పుడు పద్ధతిలో సర్కులర్ నెంబర్ 65/డిఎంఈ/22తో కార్మికులకు 12,93 రూపాయల వేతనం పిఎఫ్ చట్టానికి విరుద్ధంగా రెండు వాటాలు కార్మికుల నుంచే చెల్లించేవిధంగా విడుదల చేసింద ని మండిపడ్డారు. 3న జరిగే డిఎంఈ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయాల ఎదుట జరిగే భారీ ఆందోళనకు అన్ని ఆరోగ్య కేంద్రాల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసు పత్రి బ్రాంచ్ ఏఐటీయూసీ యూనియన్ నేతలు, కార్మికులు బి.చెన్నయ్య, జె.నరసింహ, మొగులన్న, శ్రీనివాస్‌రెడ్డి, భీమయ్య, సాయి ప్రకాశ్, శ్రీనివాస్, తిరుపతి, పద్మ, వర లక్ష్మి , అంజమ్మ, మీనా, లక్ష్మ మ్మ, జంగమ్మ, చిట్టెమ్మ, లక్ష్మి , నాగమ్మ, సువర్ణ, బాలమని, కృష్ణమ్మ, యాదమ్మ తదితరులుఉన్నారు.

## క్రీడాకారులకు సహాయ సహకారాలను అందిస్తాం

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: క్రీడాకారులకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయసహకారాలను అందిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఎయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఆధ్వర్యంలో గోవాలో జరిగిన 10వ నేషనల్ రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్ షిప్2024 పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన భూక్య మోనాలిసా, భూక్య సోనాలిసా సోమవారం సెక్రెటేరియట్ లో మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. రైఫిల్ అండ్ పిస్టల్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వీరిని సీఎం అభినందించారు. పట్టుదలతో ముందుకు సాగి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ సత్తాను చాటాలని సిఎం వారిని ప్రోత్సహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయసహకారాలను అందిస్తుందని వారికి భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యువత క్రీడాకారులుగా ఎదిగే దిశగా ప్రభావవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించే దిశగా కృషి చేస్తున్నదని సిఎం తెలిపారు.

## లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

### జులై 1 నుండి ఆగస్టు 31 వరకు స్టాఫ్ డయేరియా సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: జులై 1 నుండి ఆగస్టు 31 వరకు జిల్లాలో స్టాఫ్ డయేరియా కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో 0 నుండి 5 సంవత్సరాల వయసు గల వారిలో డయేరియా మరణాలు జరగకుండా ఉద్దేశంతో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నుండి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణా అభివృద్ధిశాఖ, విద్యాశాఖ, మున్సిపాలిటీలు, గ్రామీణ నీటి పారుదల శాఖ పంచాయితీ శాఖలు టాస్క్‌ఫోర్స్ కమిటీగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 5 సంవత్సరంలోపు చిన్నారులకు ఇంటింటి ద్వారాఓఆర్ఎస్ ప్యాకెట్‌లు,జింక్‌ట్యాబ్లెట్‌లు పంపిణీ తో పాటు, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కలిగించాలని విద్యాశాఖ అధికారులకు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలను భుజించాలని సూచించారు. గ్రామాల్లో పంచాయితీ శాఖ పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌లు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పాగింగ్, నీటి ట్యాంకులను పరిశుభ్రం చేయడం, వాటర్ లీకేజీ లను అరికట్టి సురక్షిత త్రాగునీటి అందించాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాల వలన పాత, శిధిల , మట్టి భవనాలు ఉంటే గోడలు కూలి ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా లక్ష్యం మేరకు ఆయా శాఖల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్‌లు, సోలార్ ప్లాంట్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, కుట్టు మిషన్ యూనిట్‌లు పాలిచ్చే జంతువులు, పౌల్ట్రి తదితర యూనిట్‌లు మండల వారీగా లక్ష్యం కేటాయింపు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, డిఆర్ఓ కెవివి రవి కుమార్, జడ్పి సిఈఓ రాఘవేంద్రరావు,డిఆర్‌డిఓ నర్సింహులు పాల్గొన్నారు.

## నిధులతోనే ఏ వ్యవస్థకైనా సార్థకత

### మంత్రిజూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : ప్రజాస్వామ్యంలో గ్రామపంచాయతీ, మండల , జిల్లాపరిషత్ వ్యవస్థలను పటిష్టంచేసేలా నిధులు ఇచ్చి బలోపేతం చేస్తేనే వాటికి సార్థకత ఉంటుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. సోమవారం పట్టణంలోని డికెఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ సభ్యుల వీడ్కో లు సమావేశానికి మంత్రి జూపల్లికృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సం వత్సరాలలో జిల్లా పరిషత్తు నిధులు లేకుండానే కొనసాగిందని, పేదప్రజలకు సేవచేయాలన్న తపనతో సభ్యులు ఉన్న నిధులు, అధికారాలు లేకుండానే ఈఐదు సంవత్సరాలకాలం ముగిసిపోయిందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఎంపిటిసిలు, జడ్పిటిసిలకు అత్యంత గౌరవ మర్యాదలు , ప్రజాప్రతినిధులకు నిధులు ఇచ్చేవిధంగా చూస్తామని, నల్లమలను టూరిజం హబ్బుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇం దులో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా చూస్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా ప్రజాప్రతినిధులైన ఎంపిటిసిలు, జడ్పిటిసిలకు సముచిత స్థానం, గౌరవ మర్యాదలు ఉం డేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డి, జడ్పిచైర్‌పర్సన్ శాంతకుమారి, జడ్పివైస్‌చైర్‌పర్సన్ బాలాజీసింగ్, జడ్పి సీఈఓ గోపాల్‌నాయక్, జిల్లాలోని వివిధ మండలాల జడ్పిటిసిలు ,ఎంపిపిలు, ఎంపిటిసిలు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ అందుబాటులో ఉంటా

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అందరికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వెల్లడించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లాకలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏసమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈఏడాదికూడా జర్నలిస్టుపిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించే అంశంలో సర్కులర్ జారీచేయాలని జర్నలి స్టులు కలెక్టర్‌ను కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. డిఈఓతో మాట్లాడి సర్కులర్‌జారీ చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాగవెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి కందికొండ మోహన్, సహాయ కార్యదర్శి తిప్పర్తివిజయ్, సీనియర్ జర్నలిస్టులు కిశోర్, మహ్మద్, దర్వేష్, సహాయ నజీర్, అహ్మద్, దస్తగిరి, రాం బాబు, ఎస్ఎస్‌బాబు, శివ, శ్యామ్, దశరథం, భరత్, విజయభాస్కర్, సహదేవుడు, వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఆదిల్‌కు తక్షణమే వైద్య సహాయం అందించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరంగల్‌లో తనను కలవలేకపోయిన క్యాన్సర్ బాధిత బాలుడు మహమ్మద్ ఆదిల్ అహ్మద్ ఉదంతంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పందించారు. తక్షణమే వైద్య సహాయం అందించాలని సిఎంఓ అధికారులను ఆయన ఆదేశించారు. సిఎం సూచనలతో సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు బాలుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. నెల రోజులక్రితం ఆదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి లక్ష రూపాయల ఎల్ఓసి మంజూరు చేసింది. ప్రస్తు తం ఆదిల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాసులు ఆరా తీశారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా కావాల్సిన మరింత సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## దేశానికే ఆదర్శం సుభాష్ చంద్రబోస్



### ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ప్రజాపక్షం/కొత్తకోట: ప్రపంచాన్ని ఆదర్శంగా చేసిన వ్యక్తి భారతదేశానికే ఒక గొప్ప నాయకుడు సుభాష్ చంద్రబోస్ అని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో సోమవారం మండల ప్రజా పరిషత్ ఆవరణంలో ఎంపీపీ గుంత మౌనిక ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలు విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్లను గడగడలాడించిన వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని , భారతదేశం నుండి ఇంగ్లీష్ వాళ్లను పారదోలేందుకు, స్వతంత్రం సిద్ధించడంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర చాలా కీలకమైనదని చెప్పారు. అనంతరం ఎంపీపీ గుంత మౌనిక అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ లోని స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం కొద్ది రోజుల్లో ముగియనుండటంతోవారికి ఎమ్మెల్యే శాలువాలతో సన్మానం చేశారు. జడ్పిటిసి, ఎంపీటీసీలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు చేసిన సేవ చాలా గొప్పదని ప్రజా ప్రతినిధులకు అభినందన లు తెలియజేశారు. అన్ని రంగంలో అభివృద్ధి చేసుకుందామని ఎల్లప్పుడూ అభివృద్ధి దిశగా కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో వనపర్తి జిల్లా జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లావైస్ చైర్మన్ వామన్‌గౌడ్ , వైస్ ఎంపీపీ వడ్డేశ్రీను, కాంగ్రెస్ నాయకులు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లె పోగు ప్రశాంత్ , బాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో 51 మంది ఉద్యోగులు పదవీ విరమణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జలమండలి పరిధిలోని వివిధప్రాంతాల్లో పనిచేస్తున్న 51 మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందారు. వీరిలో ఈ ఎన్‌సి, ఆపరేషన్స్ డైరెక్టర్1గా విధులు నిర్వర్తించిన అజ్మీరా కృష్ణ, ఓఅండ్ఎం డివిజన్ 7సిజిఎం శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు డివిజన్ జనరల్ మేనేజర్ రెహమాన్ సహా వివిధ హోదాలలో పనిచేసిన ఉద్యోగులు ఉన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలకు చెందిన చెక్కు ల రూపంలో అందజేశారు.రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్2 స్వామి, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, డైరెక్టర్ ఆపరేషన్స్‌విజయరావు, పిఅండ్ఏ సిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ గుట్టు రట్టు

ప్రజాపక్షం/హైదరాబాద్:ఆంధ్రప్రదేశ్ నుండి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న ఓ గంజాయి స్మగ్లింగ్ రాకెట్ గుట్టును రైల్వే పోలీసులు రట్టు చేశారు.ఒక నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి రూ.4.50 ల క్షల విలువైన 18 కేజీల గంజాయిని పట్టుకున్నా రు. రైల్వే అదనపు డిజిపి మహేష్ భగవత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ట్రాలీ సూట్‌కేసుతో ప్రయాణం చేస్తున్న మహారాష్ట్రలోని ముంబాయిలోని అమీనా నగర్‌కు చెందిన అబూబకర్ కసమ్ షేక్ (47)ను అదుపులోకి తీసుకున్నారు.

ఇతని వద్ద 18 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. విశాఖపట్నం నుంచి ఈ గంజాయిని రూ.90 వేలకు ఖరీదు చే శానని, రూ.4.50 లక్షలకు విక్రయిస్తానని తెలిపాడు. ఇతనిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ బి.సాయిశ్వర్‌గౌడ్, ఎస్‌ఐలు రమేష్, సిబ్బంది ఎస్‌కె క్వాదీర్ అహ్మద్, దేవిడ్, సత్యంనాయుడులు పాల్గొన్నారు.

## రోగి సంరక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్

### మెడి-9 హెల్త్ సైన్సెస్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి మెడి 9 ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్ లోగో ఆవిష్కరణ




ప్రజాపక్షం/హైదరాబాద్: రోగి సంరక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఎంతగానో ఉపయోగ పడుతుందని మెడి9 హెల్త్ సైన్సెస్ క్లినికల్ డైరక్టర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి అన్నారు. ప్రపం చ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మెడి9 ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్(ఐఎంఎస్) లోగోను బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు డాక్ట ర్ రమణ రాజు, డాక్టర్ వరలక్ష్మి , డాక్టర్ విజయలక్ష్మి లతో కలసి ఆవిష్కరించారు. వారు మా ట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్‌ను, సమీకృతీకరించి, మెడి9 హెల్త్ సైన్సెస్ సంస్థ హోమియోపతి,ఆయుర్వేద,పేషెంట్ సమగ్ర సంరక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ మంచి అవకాశాలను అందిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ఆయుష్ మంత్రిత్వ శాఖ, మా నవ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడానికి ఐసిఎంఆర్ భాగస్వామిగా ప్రాముఖ్యతనుసంతరించుకుంద న్నారు.ఆయుర్వేదం, హోమియోపతి, నేచురోపతి ఆక్యుపంక్చర్, అ క్యూప్రెషర్ సిద్ధ యోగా, హెర్బల్, కిరో ప్రాక్టిక్ వంటి ప్రత్యామ్నాయ లేదా సాంప్రదాయ పద్ధతులతో 'పాశ్చాత్య' వైద్యాన్ని మిళితం చేస్తుందన్నారు. గత 30 ఏళ్లకు పైగా అనుభవం నిపుణత,పరిశీలనా కలిగిన డాక్టర్స్ బృందం వ్యాధి కారకాలను తెలుసుకుని, వ్యాధి మూలాలకు చికిత్స చేస్తారన్నారు. ఈ ఇంటిగేటివ్ చికిత్సలో మెడిసిన్, ఎక్సర్ సైజ్, డైట్, ఇమ్యూనిటి బూ స్టర్స్ ద్వారా చికిత్సను అందిస్తారని తెలిపారు.

# ప్రజావాణిలో ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి





ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ప్రజావాణిలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులను సమావేశం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్‌కు అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటి, బిసి, సాంఘీక సంక్షేమశాఖ రెసిడెన్సియల్ పాఠశాలలు, సర్వే ల్యాండ్ రికార్డ్స్, కార్మిక శాఖలు, ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుండి స్వీకరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, డిఆర్‌ఓకె వివి రవికుమార్, జడ్పిసిఈఓ రాఘవేంద్రరావు, డిఆర్‌డిఓ నర్సింహులు, తదితరులు ఉన్నారు.

**వనపర్తిటౌన్‌లో:** ప్రజావాణి ఫిర్యాదులను ఇప్పటికప్పుడు పరిష్కరించాలని పరిష్కరించటంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సత్వరమే పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ అదనపు కలెక్టర్ రెవె న్యూ ఎం. నగేష్‌తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయన్నారు. **సీజనల్ వ్యాధులపై అప్రమత్తత :** వర్షాకాలం ప్రారంభం అయినందున జిల్లాలో డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా లైన్ డిపార్ట్మెంట్‌లు వ్యాప్తి చెందకుండా లైన్ డిపార్ట్మెంట్‌లు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాల్టీ , పంచాయతీరాజ్ , మిషన్ భగీరథ, సంక్షేమ శాఖ, విద్యా , వైద్య శాఖలు తమ బాధ్యతలను పకడ్బందీగా నిర్వర్తిస్తే జిల్లాలో అంటూ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ , అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్ర మోహన్ , మున్సిపల్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, విద్య, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశపుహాల్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధప్రాంతాలనుండి ప్రజలు 78ఫిర్యాదులు సమర్పించారని, వాటిలో ధరణికి సంబం ధించిన భూసమస్యలపై ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వివిధ మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లాకుచెందిన అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఫీజులు తగ్గించాలని బిఆర్ఎస్ వినతి



ప్రజాపక్షం/చర్లపల్లి: మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పేద విద్యార్థులకు ఫీజులు తగ్గించాలని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి కోరారు.ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పేద విద్యార్థులకు సిఎంఆర్ కాలేజీలో ఫీజులు తగ్గించి చదివేందుకు అవకాశం కల్పించాలని ఎంఎల్ఎ కోరడంతో సానుకూలంగా స్పందించిన మల్లారెడ్డి తప్పకుండా చేస్తానని హమీ ఇచ్చారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాములు,నజీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఐఐటి పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాపక్షం / కొడంగల్ : విద్యార్థుల భవిష్యత్ కొసం ఐఐటి పుస్తకాలను అందించడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర పోలీస్ అకాడమి చైర్మెన్, మాజీ ఎంఎల్ఎ గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్ పట్టణంలోని కృష్ణావేణి ట్యాలెంట్ హైస్కూల్‌లో ప్రిన్సిపల్ మక్సూద్ ఆలీ సమక్షంలో గురునాథ్ రెడ్డి చేతుల మీదుగా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు పాఠశాలలోని 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు ఐఐటి తరగతులు పూర్తి స్థాయిలో ప్రత్యేక ఉపాధ్యాయులచే భోదించడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామీణ విద్యార్థులకు కూడా నీట్ మరియు ఎంసెట్ లో సీట్లు పోందడం సులభంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులను ప్రారంబించడం జరిగిందన్నారు. సమావేశంలో ఐఐటి ఉపాధ్యాయులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు విష్ణు, కాశప్ప, సరిత, నర్సిములు, మనోజ్‌లతో పాటు తదితరులున్నారు.

## నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: మంగళవారం ఉదయం 11 గంటలకు మేడ్చల్ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరుగనుందని జడ్‌పిపి ముఖ్య కార్యనిర్వహణాధికారి తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## నాగోల్ చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

సిపిఐ జిల్లా సమితి సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: అర్ధాంతరంగా నిలిపివేసిన నాగోల్ చెరువు సుందరీకరణ పనులు వెంటనే తిరిగి చేపట్టి పూర్తి చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జిహెచ్‌ఎంసి ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, పిల్లలు ఆడుకొనేందుకు అవసరమైన జిమ్ పరికరాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా నాగోల్ చెరువులో మురికి నీరు కలువ కుండా చూడాలని జోనల్ కమిషనర్‌ను వినతిపత్రంలో కోరారు.

## కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాల కృషి

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: కాలనీలను అభివృద్ధి పరచడానికి సంక్షేమ సంఘాలు తమ వంతు పాత్ర పోషించాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్ తన కార్యవర్గంతో కలసి డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్య నారాయణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్ కు వారు అభినందనలు తెలియజేశారు. అనంతరం కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో తమ పాత్ర పోషించాలని సూచించారు. సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘానికి ఎల్లవేళలా తన మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, ఖలీల్, ఖయ్యాం గోవర్ధన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ వివిధ ప్రాంతలనుండి వచ్చిన ప్రజలనుండి 178 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 178 అర్జీలకుగాను ధరణి రెవిన్యూ శాఖ కు సంబందించినవిరాగా పెన్షన్ ,భూ సర్వే ,శిశు సంక్షేమశాఖ ,ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయని ,వాటిని సంబంధిత అధికారులకు పంపి సమస్య పరిష్కారయ్యేలా చూస్తామని ఫిర్యాదు దారులకు హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్‌డిఓ వాసుచంద్ర ,జెడ్పిసిఇఓ సుధీర్‌కుమార్ సంబంధిత శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాపక్షం/శామీర్‌పేట : మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శామీర్ పేట ఎంపిపి ఎల్లుబాయిబాబు అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో మహోత్సవంలో బాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎంపిపి ఎల్లుబాయిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం హారితహరంలో బాగంగా లక్షల మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుందన్నారు. మొక్కలు నాటడం వలన ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందుతుందన్నారు. అలాగే సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగ కురుస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు వచ్చి తమ ఇండ్ల వద్ద మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేట్ సంస్థల్లో విధిగా యాజమాన్యాలు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఎంపిడివో మమతబాయి, ఎంపిటిసి కోడూరి అశోక్, కార్యదర్శి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, పంచాయతి సిబ్బంది కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/చర్లపల్లి: లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఇండస్ట్రీయలిస్ట్ 202425 నూతన క్లబ్ ఆఫీసర్స్ ప్రెసిడెంట్‌గా బాబా, ప్రధాన కార్యదర్శిగా పరశురామ్,ట్రెజరర్‌గా కంస దౌలత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.లయన్ డిస్ట్రిక్ట్ 320 హెచ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌గా లయన్ విశ్వేశ్వరరావు,జిఎంటి కోఆర్డినేటర్‌గా ఎస్ రాంచంద్ర రెడ్డి,రీజియన్ చైర్‌పర్సన్‌గా పివి రమణారావులు ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన సభ్యులు చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. సభ్యులు,విద్యార్థులు,టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి బాలుడి మృతి



ప్రజాపక్షం / కొడంగల్: కడుపు నోప్పి భరించలేక ఓ బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొడంగల్ మున్సిపల్ పరిధిలోని చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామానికి చెందిన వడ్ల పెద్ద భీములు రెండవ కుమారుడు వెంకటేష్(16) గ్రామంలో 5వ తరగతి వరకు చదువుకుని రోజువారి కూలీ పనులు చేస్తు జీవనం సాగిస్తుండేవాడు. అయితే గత కొన్ని రోజులుగా కడుపునోప్పి, ఆనారోగ్యంతో బాధపడుతుండగా ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. సోమవారం హైద్రాబాద్ ఆసుపత్రికి వెళ్లాలి తయారు కమ్మని తండ్రి చెప్పగా సరే అంటు పోలానికి వెళ్లడం జరిగిందన్నారు. వైద్యం చేసుకోలేక మందులు మింగలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పురుగుల మందు తాగిన అంటు కుటుంబ సభ్యులకు చెప్పడంతో హూటహూటికి కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమద్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి పిర్యాధు మేరకు ఎస్ఐ భరత్‌రెడ్డి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కోన్నారు.

# కబ్జాకు గురైన నాలాలను తొలగించాలి

అధికారులను ఆదేశించిన ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి

వర్షకాలం ఇబ్బందులపై ఎంఎల్ఎ సమీక్ష



ప్రజాపక్షం / తాండూరు : కొద్దిపాటి వర్షాలకే తాండూరు పట్టణంలో వరద నీరు రోడ్లపై ఎరులై పారుతున్నాయని, దీనిని అరికట్టాలంటే కబ్జాలకు గురైన నాలాలను వెంటనే తొలగించాలని తాండూరు ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తాండూరు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కమీషనర్ విక్రమ్‌సింహారెడ్డి, డిఎస్పీ బాలకృష్ణారెడ్డి, రెవెన్యూ, ఆర్అండ్‌బి శాఖల అధికారులతో వరదలపై సమీక్షించారు. తాండూరు పట్టణంలో నాలాలు కబ్జాలకు గురికావడం వల్లనే వరద నీరు రోడ్లపై వచ్చి చేరుకుందని, వాటిని తొలగించెందుకు పార్టీలకు అతీతంగా పట్టణ ప్రజలతో పాటు కౌన్సిలర్‌లు సహకరించాలని కోరారు. నేటి నుండి తాండూరు పట్టణంలో కబ్జాలకు గురైన నాలాల వివరాలన సేకరించాలని సూచించారు. వెంటనే వాటిని తొలగించి పట్టణ ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. నాలాలను కబ్జాలకు పాల్పడిన వారి ఎంతటి వారైన, ఏలాంటి ఒత్తిలకు తలోగ్గకుండా సరి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షకాలంలో ఎదురైన సమస్యల పరిష్కారానికి అయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి అన్ని వార్డుల్లో వరదనీరు ప్రవహించడం పట్ల ఎంఎల్ఎ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. తాండూరు పట్టణంలో 20యేండ్ల క్రింత ఏర్పాటు చేసిన డ్రైనేజి వ్యవస్థతో వరద కష్టాలు వచ్చాయని అన్నారు. ప్రధానంగా నాలాలు కబ్జాలు కావడంతో మరో కారణమని చెప్పుకొచ్చారు. చిలక వాగు ప్రక్షాలనకు గాను రూ.16కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అట్టి నిధులతో చిలక వాగు అభివృద్ధి చేస్తే వరద కష్టాలు ఉండవని తెలిపారు. భవిష్యత్తులో తాండూరు పట్టణంలో అండర్ డ్రైనేచి వ్యవస్థను తీసుకవచ్చేందుకు ప్రణాళికలు సిద్దం చేయడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, పట్లోళ నీరాజాబాల్‌రెడ్డి, విజయదేవి, సాహు శ్రీలత, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు పరిష్కరించకపోతే అర్జీదారుడికి వివరణ ఇవ్వాలి: కలెక్టర్ గౌతమ్



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కరించలేని పక్షంలో దానికి సరైన కారణంతో ధరఖాస్తుదారుడికి ఆన్‌లైన్‌లోనే వివరణ ఇస్తూ జవాబివ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. సోమవారం జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా అధికారి ప్రభావతితో కల్సి ధరఖాస్తుదారుల నుండి 114 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు త్వరితగతంగా పరిష్కరిచాలన్నారు. తమ పరిధిలో సంబంధిత అధికారులు పరిష్కరించలేని పరిస్థితిలో ఉంటూ క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ఏ కారణంగా పరిష్కరించ లేక పోతున్నామన్న విషయాలను అర్జీ దారులతో పాటు ఉన్నతాధికారులకు తెలియ చేయాలన్నారు.

## సిఎం సహాయనిధి అందజేత

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :వికారాబాద్ నియోజకవర్గంలోని బంట్వారం మండల కేంద్రానికి చెందిన కె.బాబురావు ,మోమిన్‌పేట్ మండలం గ్రామనికి చెందిన బి.పద్మ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఇద్దరికి 2,10,000 రూపాయలు విలువ గల ఎల్‌ఓసి అందజేసిన శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందజేశారు.

## మెడికల్ కళాశాల భూబాధితులకు వరాల జల్లు



ప్రజాపక్షం / కొడంగల్ : కొడంగల్‌లో మెడికల్ కళాశాల భూబాధితులకు అధికారులు వరాల జల్లులు కురిపించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తాండూర్ ఆర్‌డివో శ్రీనివాస్, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ విజయ్‌కుమార్‌లు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 19 అసైన్డ్ భూమిలో దాదాపు 45 మంది రైతులు పంటలను సాగుచేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో బాగంగా అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజ్, వెటర్నరీ కాలేజ్, నర్సింగ్ కాలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అసైన్డ్ భూమిని ఎంపిక చేశారు. ఈ భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు రెండు మూడు దఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికి రైతులు ఒప్పుకోలేకపోయారు. దీంతో మారోమారు సోమవారం అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఎకరాకు 10 లక్షలు, 100 గజాల స్థలం, ఫీజులు లేకుండా రిజిస్ట్రేషన్, అర్హులైన వారికి ఇండ్ల నిర్మాణంతో పాటు కళాశాలలో ఒక ఉద్యోగం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. పంట పోలాల్లో బోరు ఉన్నట్లయితే అట్టి బోరుకు కూడా రుసుము చెల్లిస్తామని హామీలు ఇచ్చారు.మన ప్రాంతం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెంది రేపటి భావితరాలకు ఆదర్శంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

## కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన

వికారాబాద్ జిల్లా ఎస్పి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించెందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వికారాబాద్ జిల్లా ఎస్పి నారాయణరెడ్డి వెల్లడించారు. సోమవారం తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు డివిస్పీ బాలకృష్ణారెడ్డిలతో కలసి సందర్శించారు. పోలీసు స్టేషన్ పలు రికార్డులను, పరిరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మిడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు కొత్త చట్టాలను తీసుకవచ్చిందని, వాటి అమలుతో పాటు ప్రజలకు అవగాహన కల్పిచెందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ నెల 10వ తేదివరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. తాండూరు త్వరోలనే ట్రాఫిక్ పోలీసు స్టేషన్ స్థల సేకరణ చేపట్టడం జరుగుతుందని తలిపారు.

ముఖ్యంగా జిల్లా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదర్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.దానిని నియంత్రించెందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కర్నాటక సరిహద్దు ప్రాంతాలలో శాంతి భద్రతల ప్రత్యేక దృషి పెట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సంతోష్‌కుమార్, టౌన్ ఎస్ కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

# శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులపై దాడులు

పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం బాబాగూడలోని శాంతినికేతన్ రెసిడెన్షియల్ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులపై వార్డెన్, పిఈటీలు దాడులకు దిగుతున్నారని విద్యార్థులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం శాంతినికేతన్ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు గోడదూకి పరారయ్యారు. వివరాల్లోకి వెళితే బాధితులు తెలిపిన ప్రకారం.. దిల్‌సుక్‌నగర్, ఘట్‌కెసర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులను శాంతినికేతన్ పాఠశాలలో కొత్తగా జాయిన్ చే శారు. కాగా ఆదివారం పాఠశాల గోడదూకిన ఇద్దరు విద్యార్థులు లిఫ్టుల స హాయంతో ఇంటికి వెళ్లిపోయారు. పాఠశాల నుంచి చెప్పా పెట్టకుండా వచ్చి న విద్యార్థులను ఎందుకు వచ్చారని ఎలా వచ్చారని విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రశ్నించారు. పాఠశాలలో వార్డెన్ రాకేష్, పీఈటిలు బెదిరిస్తున్నారని మానసికంగా తీవ్ర ఒత్తిడిలకు పాల్పడుతున్నారని చెప్పారు. చదువకపోతే ఇంజక్షన్‌లు ఇస్తామని చావబాదుతూ కొడుతున్నారని అన్నారు. స్కూల్లో సరై న బోజనం పెట్టడం లేదని అన్నంలో పురుగులు వస్తున్నాయని పలుమార్లు చెప్పిన ఎవ్వరు పట్టించుకోలేదని అన్నా రు. అందుకే స్కూల్ నుంచి పారిపోయి వచ్చామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మాకు అడ్మిషన్ సమయంలో చెప్పిన విదంగా శాం తినికేతన్‌లో వసతులు ఇవ్వడం లేదన్నారు. ఒక్క గదిలో 30కి పైగా బెడ్‌లు వేశారని ఒక్క ట్యూబ్‌లైట్‌లోనే విద్యార్థులు చదువుకోవాలన్నారు. బోజనం కూడ మెను ప్రకారం పెట్టడం లేదన్నారు. డబ్బులు మాత్రం కట్టించుకున్నారని చెప్పింది ఒకటి చేసేది మరోకలాగ ఉందని వాపోయారు. విద్యార్థులపై చెప్పరాని చోట పిడిగుద్దులు గుద్దుతున్నారని దీంతో వారు నొప్పులతో బాధపడుతున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## అమర్యాదగా వ్యవహరించడానికే ప్రజావాణి కార్యక్రమమా..?

ప్రశ్నించిన సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్



ప్రజాపక్షం/ నిజాంపేట్: అమర్యాదగా వ్యవహరించ దానికే ప్రజావాణి కార్యక్రమమా అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ ప్రశ్నించారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై సిపిఐ నేతలు వినతి పత్రాన్ని అందజేయడానికి వెళ్లగా అక్కడ ఉన్న విలేఖరులు ఫోటోలు తీయగా ఫోటోలను ఎందుకు తీస్తున్నారని, తక్షణమే బయటికి వెళ్లమని ఉప కమిషనర్ మల్లారెడ్డి అమర్యాదగా వ్యవహరించారని ఉమామహేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు భైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ జగద్గిరిగుట్ట రోడ్ నంబరు 1లో నెలకొన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిసికి వినతి పత్రాన్ని ఇవ్వగా అమర్యాదగా మాట్లాడడం సరికాదని అన్నారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారితో సైతం ఇదేరకంగా డిసి వ్యవహరించడం పై మండిపడ్డారు. ఇప్పటికైనా డిసి తీరు మార్చుకోవాలని లేని పక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. సిపిఐ నాయకులు హరినాథ్ రావు, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, ప్రభాకర్, ఇమామ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# బాచుపల్లిలో చెరువులు, కుంటలు కలుషితం

మృత్యువాతకు గురైన చేప పిల్లలు..

ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్య కార్మికులు



ప్రజాపక్షం/ నిజాంపేట్ : చెరువులు, కుంటలు కలుషితం కాకుండా ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యమే. ప్రభుత్వాలు మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని చూస్తుంటే కొంతమంది అధికారులు మాత్రం స్వప్రయోజనాల కోసం డ్రైనేజీ నీటిని చెరువుల్లోకి, కుంటల్లోకి వదులుతున్నా పట్టించుకోవడం లేరని ఆరోపణలు నెలకొన్నాయి. పెద్దపెద్ద అపార్టమెంట్‌లు, ప్రైవేటు విద్యా సంస్థలు, సూపర్ మార్కెట్‌లు యథేశ్చగా డ్రైనేజీని చెరువులు, కుంటల్లోకి వదిలేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో పత్తికుంట, మేడికుంట, బైరన్ చెరువుల్లో గత కొన్నేళ్లుగా చేప పిల్లలు వదిలి మత్స్య కార్మికులు జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల కొన్ని షాపింగ్ మాల్స్, హై రైజ్ అపార్ట్‌మెంట్‌లు, ప్రైవేటు విద్యా సంస్థలు డ్రైనేజీ నీటిని కుంటలు, చెరువుల్లోకి వదిలేస్తున్నారు. దీంతో కుంటలు, చెరువుల్లోని లక్షల చేప పిల్లలు కాస్త మృత్యు వాత చెందుతున్నాయి. బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లోని పత్తికుంటకు ఆనుకుని డీమార్ట్ సూపర్ మార్కెట్, శ్రీరామ స్కూల్, ఓ కళాశాల నుండి యథేశ్చగా డ్రైనేజీ నీటిని కుంటలోకి వదిలేశారు. దీంతో కుంటలోని చేప పిల్లలన్ని మృతి చెంది ఒడ్డుకు చేరుకున్నాయి. దీంతో మత్స్య కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నందిగామ సత్యనారాయణ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి, జిల్లా మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ లక్షల విలువ చేసే చేప పిల్లలు మృతికి కారణమైన డీ మార్ట్, శ్రీరామ స్కూల్, కళాశాల యాజమాన్యానిదే అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ నీరు కుంటలు, చెరువుల్లో కలవకుండ కఠిన చర్యలు తీసుకోవాలని, మత్స్య కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బాచుపల్లి గ్రామంలోని బైరన్ చెరువులో సైతం డ్రైనేజీ పైపులైన్ పగిలి డ్రైనేజీ నీరంతా చెరువులో కలుస్తున్నాయని, అంతేకాకుండా పత్తికుంట, మేడి కుంటలలో గుర్రపు డెక్క పెరిగి పోయిందని తక్షణమే వాటిని తొలగించాలని ఆయన కోరారు. డ్రైనేజీ నీటిని కుంటలు, చెరువుల్లోకి కలవకుండా చర్యలు తీసుకోని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

**కుంటలు, చెరువుల్లోకి డ్రైనేజీని కలవకుండా కృషి చేస్తాం...**

బాచుపల్లిలోని చెరువులు, కుంటల్లోకి డ్రైనేజీ నీరు కలవకుండా కృషి చేస్తామని కార్పొరేటర్‌లు కాసాని సుధాకర్ ముదిరాజ్, సుజాతలు అన్నారు. పత్తికుంటలో ప్రైవేటు విద్యా సంస్థలు, డీ మార్ట్ నుండి డ్రైనేజీ నీరు కలిసి చేప పిల్లలు మృతి చెందడం బాధాకరమని, ప్రభుత్వ పరంగా మత్స్య కార్మికులను ఆదుకోవాలని అన్నారు. కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి తక్షణమే కుంటలు, చెరువుల్లోకి డ్రైనేజీ నీరు కలుషితం కాకుండా చూస్తామని పేర్కొన్నారు.

## పంట సాగు రైతులకే రైతు భరోసా



పజాపక్షం/ ధారూర్ : పంటలు సాగు చేసే రైతులకు రైతు భరోసా పథకం వర్ధింపజేయాలని మోజారిటి రైతులు తమ అభిప్రాయాలను తెలిపినట్లు సహకార సంఘం అధ్యక్షుడు సత్యనాయాయణరెడ్డి తెలిపారు. సోమవారం ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అయిదు ఎకరాలవరకే పరిమితం కాకుండా రైతులు తమ పంటలను సాగు చేసుకున్న అన్నిఎకరాలకు రైతు భరోసా అందజేయాలని రైతులు సూచించారు. పంచన్ లబ్ధిదారులకు వర్తించిన నిభనలను అమలు పరచాలని మరికొంత మంది రైతులు పేర్కొన్నారు. 10 ఎకరాలకు, కౌలురైతులకు రైతు భరోసా అందజేయాలని రైతులు సూచించారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఒ గోపాల్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత తహసీల్దార్‌ని నియమించండి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ మండలానికి శాశ్వత తహశీల్దార్‌ని నియమించాలని సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్ కోరారు. మేడ్చల్ మల్కాజ్ గిరి కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ఉమామహేశ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలానికి శాశ్వత రెవెన్యూ అధికారి లేకపోవడంవలన ప్రజలకు పలు ధృవ పత్రాలు సకాలంలో అందడం లేవని అన్నారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అధికారి లేకపోవడం వలన పలు సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే శాశ్వత అధికారిని నియమించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రెండు రోజుల్లో ఎంఆర్‌ఓ వస్తారని రాని పక్షంలో కొత్తవారిని నియమిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హరినాథ్, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, ఇమామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో పైపై కూల్చివేతలు

రెవెన్యూ అధికారుల సహకారంతోనే జోరుగా అక్రమ నిర్మాణాలు



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోనీ దుండిగల్ తాండా2 లోని సర్వే నంబర్ 684 ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమనిర్మాణాలను రెవెన్యూ అధికారులు పైపై కూల్చివేతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులకు ముడుపులు ముట్టడంతోనే అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమనిర్మాణదారులకు సహకరించేందుకు విఆర్‌వి మొదలు తహసీల్దార్ వరకు భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుండిగల్ తాండా2లో నిర్మిస్తున్న అక్రమ నిర్మా ణాలను తొలగించడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్‌డిఓ శ్యాం ప్రకాష్ ఎం ఆర్ ఓ అబ్దుల్ సయ్యద్ మతీన్‌కు అక్రమనిర్మాణాలను కూల్చువేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీచేసినా రెవెన్యూ అధికారులు అక్రమనిర్మాణాలపై చర్యలకు వెనకడుగు వేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. ముడుపులు అందడంతోనే అక్రమనిర్మాణాల జోలికి వెళ్లడంలేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక కౌన్సిలర్ కనుసన్నల్లో కొందరు వ్యక్తులు దుండిగల్ తాండా2లో 30 కోట్ల రూపాయల విలువచేసే 2 ఎకరాల ప్రభుత్వ భూమిని అమాయకులకు కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్న అధికారులు పట్టించుకోవడంలేదు. పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా త్వరలో చర్యలు తీసుకుంటామంటూ గత వారం రోజుల నుండి కాలయాపన చేస్తున్నారే తప్పా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

# వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనది

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: వైద్యుల దినోత్సవం డాక్టర్స్ డేను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగద్గిరిగుట్టలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కార్పొరేటర్ చేతుల మీదుగా కేక్ కట్ చేపించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. వైద్యులను దేవునితో సమానంగా చూడడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఎల్లవేళలా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్ల కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కమిటీ అధ్యక్షులు విష్ణువర్ధన్, రవికుమార్, రాము, శోభన్ బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్:దేవుడితో సమానమైన వృత్తి వైద్య వృతి అని నవీన ఆదర్శ కాన్వేంట్ హైస్కూల్ ప్రిన్సిపల్ నరేష్‌రాజ్ అన్నారు. సోమవారం డాక్టర్స్ డే జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులచే డాక్టర్ బీదన్ చంద్రరాయ్ చిత్రపటానికి పూలమాలాలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతు డాక్టర్‌లు దేవుడితో సమానమని ఆపదలో ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే దేవుళ్లు వైద్యులన్నారు. డాక్టర్‌లు చేసే సేవలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. పాఠశాల ఫౌండర్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపల్ సంతోష, ఉపాధ్యాయులు అరుణ, సంగీత, జ్యోతి, నాజియ, ఫాతిమా, గౌసియా, మీరాజ్‌బేగం, శకుంతల, నాగేంద్రమ్మ, మహేందర్, జనార్ధన్‌లతో పాటు తదితరులున్నారు.

# క్రీడ

## మన అమ్మాయిలూ గెలిచేశారు!

చెన్నై: దక్షిణాఫ్రికాతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్)ను 232/2 స్కోరుతో ఆరంభించిన దక్షిణాఫ్రికా.. 373 పరుగులకు ఆలౌటై భారత్‌కు 37 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్‌ని టీమ్‌ఇండియా 9.2 ఓవర్లలో పూర్తి చేసింది. షఫాలీ వర్మ (24*), శుభా సతీష్ (13) పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు 603/6 రికార్డు స్కోరు సాధించి డిక్లేర్డ్ చేసింది. షెఫాలి వర్మ (205; 197 బంతుల్లో 23X4, 8X6) డబుల్ సెంచరీతో అదరగొట్టగా.. స్మృతి మంధాన (149; 161 బంతుల్లో 27స4, 1స6) మరోసారి సత్తాచాటింది. రిచా ఘోష్ (86; 90 బంతుల్లో 16 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (69; 115 బంతుల్లో 4 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (55; 94 బంతుల్లో 8X4) కూడా రాణించారు. ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణా (8/77) విజృంభణతో తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా.. 84.3 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. మారిజేన్ కాప్ (74), సునే లూస్ (65) మాత్రమే రాణించడంతో దక్షిణాఫ్రికా ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లో లారా వోల్వార్ట్ (122), సునే లూస్ (109) శతకాలు బాదగా.. నాడిన్ డిక్లెర్క్ (61) హాఫ్ సెంచరీ సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు స్నేహ్ రాణా 2, దీప్తి శర్మ 2, రాజేశ్వరి గైక్వాడ 2, పూజా వస్త్రాకర్, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్ తలో వికెట్ పడగొట్టారు.



**10 వికెట్లతో స్నేహ్ అరుదైన ఫీట్**

సౌతాఫ్రికా మహిళలతో తాజాగా జరిగిన టెస్ట్ క్రికెట్‌లో టీమ్‌ఇండియా అమ్మాయిలు రాణించారు. సఫారీలపై 10 వికెట్ల తేడాతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియాకు చెందిన యంగ్ క్రికెటర్ స్నేహ్ రాణా ఓ అరుదైన ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఏకంగా పది వికెట్లు పడగొట్టి, ఈ ఫీట్ సాధించిన తొలి భారత స్పిన్నర్‌గా చరిత్రకెక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లను నేలకూల్చి సౌతాఫ్రికాను చిత్తు చేసిన స్నేహ్, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ రెండు వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. ఇదిలా ఉండగా, ఈ లిస్ట్‌లో ఈమెకంటే ముందు సీనియర్ ప్లేయర్ జులాన్ గోస్వామి ఉండటం విశేషం. 2006లో ఇంగ్లాండతో జరిగిన మ్యాచ్‌లో ఆమె 10 వికెట్లు పడగొట్టారు. అయితే స్పిన్నర్లలో మాత్రం ఈ ఘనత నమోదు చేసిన తొలి భారత ప్లేయర్ రికార్డు మాత్రం స్నేహ్ పేరిటనే ఉంది

## కోహ్లీ, రోహిత్ స్థానాలు భర్తీ చేసేదెవరో?

భారత టీ20 క్రికెట్‌లో ఓ శకం ముగిసింది. స్టార్ బ్యాటర్లు కోహ్లీ, రోహిత్ శర్మ ఆటకు వీడ్కోలు పలికారు. పొట్టి వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ విజయం సాధించిన అనంతరం టీ20 ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పారు. అయితే మరో టీ20 వరల్డ్ కప్‌కు రెండేళ్ల సమయమే మిగిలి ఉంది. మరి భారత జట్టు మేనేజ్‌మెంట్ విరాట్, హిట్ మ్యాన్ లేని లోటును వీలైనంత త్వరగా భర్తీ చేయగలదా? అలా చేస్తేనే ప్రపంచ కప్ టైటిల్ రేసులో భారత్ ముందుంటుంది. అయితే కోహ్లీ, రోహిత్ ప్లేస్‌లో పలువురు పేర్లు వినిపిస్తున్నాయి. కెఎల్ రాహుల్ కోహ్లీ, రోహిత్ టీ20ల నుంచి తప్పుకోవడంతో టాప్ ఆర్డర్‌లో కెఎల్ రాహుల్ ఒక్కడే సీనియర్. పంత్, సంజు శాంసన్ ఇద్దరు వికెట్ కీపర్‌లు ఉండటం వల్ల ఈ టీ20 వరల్డ్ కప్‌లో స్థానం దక్కలేదు. అయితే 72 అంతర్జాతీయ టీ20లు ఆడిన అనుభవం అతడికి ఉంది. కాబట్టి ఇప్పుడు కోహ్లీ, రోహిత్ బాధ్యతను రాహుల్ తీసుకుని ముందుకు నడవాల్సిన అవసరముంది. శుభ్‌మన్ గిల్ వన్డే రెగ్యులర్ ప్లేయర్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌కు టీ20లోనూ మంచి రికార్డ్ ఉంది. ఐపీఎల్ 2023లో 890 పరుగులతో టాప్‌లో నిలిచాడు. అయితే జాతీయ జట్టు తరపున మాత్రం టీ20ల్లో పెద్దగా రాణించలేదు. ఇప్పటివరకు 14 టీ20లు ఆడాడు. కేవలం 335 పరుగులే ఖాతాలో వేసుకున్నాడు. కానీ అతడికి టీ20ల్లో మంచిగా రాణించే సత్తా ఉందని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. త్వరలో జింబాబ్వేతో జరగబోయే టీ20 సిరీస్‌కు ఇతడినే కెప్టెన్‌గా నియమించారు. యశస్వి జైస్వాల్ ఐపిఎల్‌లో మంచి ప్రదర్శన చేసి భారత టెస్టు క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. అనంతరం ఓపెనర్‌గా రాణించి టీ20లో చోటు దక్కించుకున్నాడు. 2024 టీ20 ప్రపంచ కప్ జట్టులోనూ స్థానం సంపాదించాడు. అయితే ఈ టోర్నీలో అతడికి ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే ఛాన్స్ రాలేదు. ఇప్పటివరకు ఇతడు 17 మ్యాచ్‌లు ఆడాడు. 161.93 స్ట్రైక్‌రేట్‌తో 502 పరుగులు సాధించాడు. ఇందులో ఒక శతకం, 4 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే ఇతడికి మరింత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే మరింత రాటుదేలుతాడని చాలా మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. రుతురాజ్ గైక్వాడ 2021లో అంతర్జాతీయ టీ20ల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఓపెనర్‌గా ఆడే రుతురాజ్ ఇప్పటివరకు 19 టీ20లు ఆడాడు. 35.71 సగటుతో 500 పరుగులు చేశాడు. కానీ జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోతున్నాడు. అయితే ఇప్పుడతడికి మరో అవకాశం దక్కింది. జింబాబ్వేతో జరిగే టీ20 సిరీస్‌కు ఎంపికయ్యాడు.

## నిరుద్యోగిని.. ఏమైనా ఉద్యోగాలున్నాయా?: ద్రవిడ్



భారత జట్టుకు పొట్టి ప్రపంచకప్‌ను అందించి కోచ్ పదవిని ఘనంగా ముగించాడు రాహుల్ ద్రవిడ్. ఎప్పుడూ గంభీరంగా కన్పించే అతడు.. ఫైనల్‌లో టీమ్‌ఇండియా గెలవగానే ఇతర ఆటగాళ్లతో కలిసి చిన్నపిల్లాడిలా మారిపోయాడు. జట్టుతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ఇక నిరుద్యోగిని.. ఏమైనా ఉద్యోగాలుంటే చెప్పండి' అంటూ సరదాగా అన్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘన విజయం నుంచి ఎలా ముందుకుసాగనున్నారు అని రిపోర్టర్లు అడిగిన ప్రశ్నకు ద్రవిడ్ స్పందిస్తూ.. 'ఈ ఆనందం నుంచి తేరుకుని ముందుకు సాగాలి. అయితే, వచ్చేవారం నుంచి నా జీవితంలో పెద్దగా మార్పేమీ ఉండదు. కాకపోతే ఇక నేను నిరుద్యోగిని.. ఇదొక్కటే తేడా' అని బదులిచ్చారు. 'మీ వద్ద ఏమైనా ఆఫర్లు ఉన్నాయా?' అంటూ విలేకరులను సరదాగా ప్రశ్నించాడు. టీమ్‌ఇండియా కోచ్‌గా మరికొంత కాలం కొనసాగాలని బిసిసిఐ కోరినా.. ద్రవిడ్ అందుకు తిరస్కరించాడు. దీంతో కొత్త కోచ్ కోసం ఇప్పటికే ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. దీనిపై గతంలో రోహిత్ శర్మ మాట్లాడుతూ.. 'కోచ్‌గా కొనసాగేలా ఆయనను ఒప్పించేందుకు ప్రయత్నించా. కానీ ఆయనకు చాలా కారణాలు ఉంటాయి కదా..! ఏదేమైనా ద్రవిడ్‌తో గడిపిన సమయం చాలా విలువైనది. నా తొలి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆయనే కెప్టెన్. టెస్టుల్లోనూ ఆయన సారథ్యంలో ఆడే అవకాశం లభించింది. ఆయన మాకు రోల్‌మాడల్' అని అన్నాడు. వెస్టిండీస్ వేదికగా 2007లో జరిగిన వన్డే ప్రపంచకప్ సమయంలో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోని టీమ్‌ఇండియా ఘోరంగా ఓడిపోయి గ్రూప్ దశ నుంచే నిష్క్రమించింది. ఆ తర్వాత కొంతకాలానికే ఆయన కెప్టెన్సీ వదిలేశాడు. సారథిగా సాధించలేని దాన్ని అదే కరీబియన్ గడ్డపై కోచ్‌గా సాధించి ఓ జీవితకాల వెలితిని పూడ్చుకున్నాడు.



# రీల్

## టీవీ ప్రీమియర్‌కు సిద్ధమైన అఖిల్ 'ఏజెంట్'

టాలీవుడ్ యంగ్ హీరో, అఖిల్ అక్కినేని ప్రధాన పాత్రలో, కొత్త దర్శకుడు అనిల్ కుమార్ దర్శకత్వంలో ఒక చిత్రంను చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన అఖిల్ ఏజెంట్ చిత్రం బాక్సాఫీస్ వద్ద సవాళ్లను ఎదుర్కొంది, కానీ ఇప్పుడు మరొక కారణంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఏజెంట్, స్త్రీ యాక్షన్ థ్రిల్లర్, సోనీ లైవ్‌లో దాని ఓటిటి విడుదల కోసం అనేక ఆలస్యాలను ఎదుర్కొంది. బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేకపోయినా, సినీ ప్రేమికులు దాని కోసం ఎదురు చూస్తున్నారు. అయితే, ఈ సినిమా ముందుగా టీవీ ప్రీమియర్‌కి రెడీ అయిపోయింది. ఏజెంట్ యొక్క హిందీ వెర్షన్ త్వరలో గోల్డ్‌మైన్ టీవీ ఛానెల్లో ప్రీమియర్ కానున్నట్లు ధృవీకరించబడింది. అయితే ఖచ్చితమైన తేదీ ఇంకా ప్రకటించబడలేదు. ఓటిటి ప్రేక్షకులు సోనీ లైవ్‌లో దాని డిజిటల్ ప్రీమియర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలో దీనిపై కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మమ్ముట్టి, సాక్షి వైద్య మరియు డినో మోరియాతో కీలక పాత్రల్లో నటించిన ఈ ఏజెంట్ చిత్రానికి వక్కంతం వంశీ కథ అందించారు.

## కీర్తి సురేష్ హిందీ సినిమా

మన టాలీవుడ్ సహా సౌత్ సినిమా దగ్గర ఉన్నటువంటి టాప్ హీరోయిన్స్ లో కీర్తి సురేష్ కూడా ఒకరు. మరి కీర్తి హీరోయిన్ గా తెలుగు సహా తమిళ్, మలయాళ భాషల్లో కూడా నటించిన సంగతి తెలిసిందే. మరి ఈ భాషలతో పాటుగా కీర్తి సురేష్ హిందీలో కూడా ఇప్పుడు తన మొదటి ప్రాజెక్ట్ ని చేస్తుంది. బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ హీరోగా దర్శకుడు కలీస్ తెరకెక్కిస్తున్న సాలిడ్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రమే బేబీ జాన్. మరి ఈ సినిమాని కోలీవుడ్ యంగ్ దర్శకుడు అట్లీ హిట్ చిత్రం తేరి కి రీమేక్ గా తెరకెక్కిస్తున్నారు. అలాగే హిందీలో ఈ చిత్రాన్ని అట్లీ నిర్మాణం వహిస్తున్నాడు. అయితే ఇది వరకే ఈ చిత్రాన్ని మేకర్స్ మే 31 కి అలా ప్లాన్ చేశారు కానీ ఈ సినిమా అక్కడ నుంచి వాయిదా పడింది. అయితే లేటెస్ట్ గా వరుణ్ ధావన్ పై ఒక స్ట్రైకింగ్ పోస్టర్ రిలీజ్ చేసి ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 25 క్రిస్మస్ కానుకగా వస్తున్నట్టుగా రివీల్ చేశారు. దీనితో కీర్తి సురేష్ బాలీవుడ్ డెబ్యూ అప్పటివరకు ఆగాల్సిందే అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా అట్లీతో పాటుగా జియో స్టూడియోస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.





## ఈ పాటను ఆస్వాదించండి ఏఆర్ రెహ్మాన్

భారత జట్టు టీ20 వరల్ కప్ గెలవడంతో భారత్ విజయాన్ని సినీ ప్రముఖులు కూడా భారీగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే టీ20 వరల్ కప్లో భారత్ విజయాన్ని తాను కూడా బాగా సెలబ్రేట్ చేసుకున్నట్లు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ తన ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. పైగా తమ 'టీమ్ ఇండియా హై హమ్' సాంగ్ ప్రదర్శనను ఆస్వాదించాలని 'మైదాన్' సినిమాలోని పాటను కూడా ఏఆర్ రెహ్మాన్ షేర్ చేయడం విశేషం. తన టీమ్తో కలిసి ప్రదర్శన చేసిన వీడియోను ఈ సందర్భంగా ఏఆర్ రెహ్మాన్ పంచుకున్నారు. కాగా అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మైదాన్' సినిమాలోని ఈ పాట ఆటగాళ్లలో జోష్ నింపేలా ఉంది. ఇక 'టీమ్ ఇండియా' విజయంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ పాజిటివ్ పోస్ట్‌లు పెట్టి వైరల్ చేశారు. కొందరు సినీ రాజకీయ ప్రముఖులు కూడా టీ20 వరల్ కప్ విజయంపై స్పందిస్తూ అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే.

## పవర్ గ్రిడ్ ఎస్ఆర్ 1సిజిఎంగా అఖిలేష్ పాఠక్ బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం / హైదరాబాద్ : పవర్ గ్రిడ్ ఎస్ఆర్ టిఎస్ 1 చీఫ్ జనరల్ మేనేజర్‌గా అఖిలేష్ పాఠక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అఖిలేష్ పాఠక్ ఎస్ఆర్ టీఎస్ 1 బాధ్యతలు చేపట్టక ముందు నేపాల్‌లోని పవర్ గ్రిడ్ కన్సల్టెన్సీ ప్రాజెక్టులోనూ, సదరన్ రీజియన్ 1, చీఫ్ జనరల్ మేనేజర్ గా పనిచేశారు. కాగా అంతకు ముందు ఆయన మంగళూరు విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్, 1993 లో పవర్ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా తన ప్రొఫెషనల్ క్యారియర్‌ను ప్రారంభించారు. ఆయనకు 31 సంవత్సరాలకు పైగా అపారమైన అనుభవం ఉంది. పవర్ ట్రాన్స్ మిషన్ సిస్టమ్ పవర్ ప్రాజెక్టుల అమలు కోసం ఓ అండ్ ఎం, అసెట్ మేనేజ్ మెంట్, కమర్షియల్ ఆపరేషన్స్, ప్రాజెక్ట్ ఎన్విరాన్‌మెంట్ సస్టెయినబిలిటీ మేనేజ్ మెంట్, బిజినెస్ డెవలప్ మెంట్ తదితరాల్లో ఆయన సేవలందించారు.

## సచివాలయం ముందు రైతుల ఆందోళన

తమ గ్రామానికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని వినతి



ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముందు సుమారు 50 మంది రైతులు ఆందోళన చేశారు. మహబూబాబాద్ జిల్లా కే.సముద్రం మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతులు స్థానిక ఎంపిటిసి ధరావత్ రవి నేతృత్వంలో సచివాయం ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. తమకు సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసే అవకాశం ఇవ్వాలంటూ ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులు వారిని శాంతింపజేసి సచివాయం లోపలికి పంపించారు. అంతకు ముందు ఎంపిటిసి ధరవత్ రవి నాయక్ సచివాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 60 ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న పట్టా భూములను గత ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన పేరిట ధరిణిలో తమ పట్టాలను రద్దు చేసిందన్నారు. 2384 జీఓ నెంబర్ ప్రకారం నారాయణపురం గ్రామంలోని భూములను 2021 ఫిబ్రవరిలో రెవెన్యూ పట్టా భూములుగా గుర్తించారన్నారు. ఈ క్రమంలో తాము సిసిఎల్ఏ ను పలు సార్లు కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అసలైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వకుండా అన్యాయం చేసేందుకు గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, రేవంత్ రెడ్డి సర్కారు అయినా తమకు న్యాయం చేయాలని కోరుతున్నామని ధరవత్ రవి నాయక్ అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల తాము సాగు చేసుకుంటున్న భూములకూ రైతు బంధు, రైతు బీమా వర్తింపజేయక పోవడంతో కోట్ల రూపాయల నిధులు రైతులకు అందలేదన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అయినా నారాయణపురంలో సుమారు 1200 ఎకరాల్లో 800 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

## ఇక బినామీ కార్మికులకు చెక్

రోజుకు మూడు సార్లు ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు

బినామీలపై కొనసాగుతున్న విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : పారిశుద్ధ్య కార్మికుల హాజరులో అవకతవకలకు పాల్పడుతున్న అక్రమార్కులకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఉన్నతాధికారులు చెక్ పెట్టాలని నిర్ణయించారు. నూతన హాజరు విధానాన్ని నేటి నుంచి ప్రవేశపెట్టేందుకు నిర్ణయించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదును తప్పుదోవపట్టించి, సంస్థ నిధులను దారిమల్లించిన విషయాన్ని అధికారులు గుర్తించారు. బినామి కార్మికుల పేరిట వేతనాలు తమ జేబుల్లో వేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఉన్నతాధికారులు అక్రమార్కులకు చెక్ పెట్టేందుకు నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కార్మికుల హాజరును మధ్యలోనూ అంటే విధుల్లోకి వచ్చిన అనంతరం మరో నాలుగు గంటలు గడిచిన అనంతరం ప్రతి కార్మికుడు తన ఫేస్ రికగ్నిషన్ విధానంలో హాజరును నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్మికులు ఉదయం విధుల్లోకి వచ్చినప్పుడు, మధ్యాహ్నం విధుల నుంచి వెళ్తున్నప్పుడు నమోదు చేసే హాజరు విధానంలో అదనంగా మధ్యలోనూ కార్మికులు ఫేస్ రికగ్నిషన్ ద్వారా తమ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోజుకు రెండు సార్లు హాజరు నమోదు చేస్తున్నారు. నూతన విధానంలో ప్రతి కార్మికుడు రోజుకు మూడు సార్లు హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంతో అక్రమాలకు చెక్ పెట్టొచ్చు అని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు బినామి కార్మికులతో రెండు సార్లు హాజరు తీసుకొని, విధులు నిర్వహించకుండానే వారిని పంపించేవారనే ఆరోపణలు ఉన్నాయి. బినామి పేర్లతో కొంతమంది అక్రమార్కులు వేతనాలు తీసుకునే వారనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు రోజుకు మూడు సార్లు ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేయనున్నారు.

**ఫేస్ రికగ్నిషన్‌లో సైతం అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నం..**

పారిశుద్ధ్య విభాగంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఫేస్ రికగ్నిషన్ పద్ధతిలో హాజరు నమోదులో గత నెల 14, 15 తేదీల్లో సాంకేతిక లోపం ఏర్పడింది. 14వ తేదీన ఉదయం, మధ్యాహ్నం రెండుపసార్లు, 15వ తేదీన ఉదయం సమయంలో సాంకేతిక లోపాలు ఏర్పడ్డాయి. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు కార్మికులు అక్రమంగా హాజరు నమోదుకు 80 సార్లు ప్రయత్నించారని తెలిసింది. ఈ విధంగా ఎవరూ చేశారనే అంశంపై అధికారులు విచారణ చేపట్టారని సమాచారం. ఏజెన్సీకి, కిందిస్థాయి అధికారులకు నోటీసులు జారీచేసినట్టు తెలిసింది. ఈ అక్రమాల వెనుక ఎవ్వరు ఉన్నారనే విషయాన్ని గుర్తించేందుకు లోతుగా విచారణ జరుపుతున్నట్లు బల్దియా వర్గాల సమాచారం.

## నూతన చట్టాలపై ఎస్‌ఓపిని విడుదల చేసిన డిజిపి రవిగుప్త



ప్రజాపక్షం/హైదరాబాద్: మూడు కొత్త క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, మరియు భారతీయ సాక్ష్యాచట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రత్యేకంగా ముద్రించిన పోస్టర్లను డిజిపి రవిగుప్తా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా డిజిపి రవిగుప్తా మాట్లాడుతూ..కొత్త చట్టాలపై పోలీసులతో పాటు ప్రజలకు కూడా అవగాహన పెరగాలన్నారు.కొత్త చట్టాల గురించి పౌరులకు మార్గనిర్దేశం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్లలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పై సమగ్రంగా ఉన్న బుక్లెట్‌ను కూడా ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో 43 SOP లు, 31 ప్రొఫార్మాలు ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దర్యాప్తు అధికారులు ఒకే రకమైన విధానాలను పాటించేందుకు స్పష్టత ఉంటుందన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సహకారంతో సిఐడి ద్వారా ఎస్ ఓ పి లు తయారు చేశారని డిజిపి అన్నారు. సిఐడి అడిషనల్ డిజిపి శ్రీమతి శిఖా గో యెల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవర్, ఎసిబి జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతిలు కృషి చే శారని వారిని ఈ సందర్భంగా డిజిపి ప్రశంసించా రు. కొత్త చట్టాలపై దర్యాప్తు అధికారులకు మార్గనిర్దేశం చేసేందు కు సిఐడి విభాగంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కేంద్రం సోమవారం నుంచి పనిచేయడం ప్రారంభించిందనీ ఇది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇప్పటికే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులందరూ శిక్షణ పొందారని డిజిపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్ అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, ఐజిలు జి.సుధీర్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

## స్కూలుకు దారి ఇవ్వండి

ఎమ్మార్వో కార్యాలయాన్ని స్కూల్‌కు కేటాయించాలి

ప్రజావాణిలో కలెక్టర్ కు సిపిఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి.



ప్రజాపక్షం/ హైదరాబాద్ : చిలకలగూడ,దూద్ బావిలోని గల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరియైన రోడ్డు మార్గాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్‌అనుదీప్ దురిశెట్టికి సిపిఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణిలో సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. అంగన్ వాడి కేంద్రం కూడ ఉన్న ఈ పాఠ శాలకు వెళ్లేందుకు రోడ్డు సరైన రోడ్డు లేకపోవడంతో పాటుప్రధాన గేటు కూడ లేదని, దీంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు వాహనాలతోపాటు గర్భిణీ లకు అందించే పోష కాహారాన్ని తీసుకు రావాలన్నా వాహనాల రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడుతుండడంతో గర్భిణీలు చిన్నపిల్లలు నిత్యం అవస్థల గురవుతున్నారని సిపిఐ నాయకులు కలెక్టర్‌కు వివరించారు. తక్షణమే స్కూల్ తూర్పు వైపున ప్రధాన ద్వారం ( పెద్ద గేట్) ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు సహకారం అందించాలని కోరారు. అదే విధంగా అడ్డగుట్టలోని మారేడుపల్లి రెవె న్యూ కార్యా లయం అక్కడి నుండి తరలించి ప్రభుత్వ స్కూలుకు ఆ భవనాన్ని అప్పజెప్పాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ కలెక్టర్ విన్నవించా. ఇక్కడ సరిపోను తరగతి గదులు లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయ కులు కొమురెల్లి బాబు, గౌరి నాగరాజ్, గువ్వల మల్లేష్ పాల్గొన్నారు.

## ఎన్‌డిపిఎస్ చట్టంపై ఎక్సైజ్ అధికారులకు శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్: అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలపై ఎక్సైజ్ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ (ఎన్‌డిపిఎస్ చట్టం)పై అధికారులకు సోమవారం అవగాహన కల్పించారు. పాత చట్టాల పేర్లతోపాటు కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుక వచ్చింది. ఈచట్టాల అమలు, జరిగిన మార్పులపై నార్కోటిక్ నాబ్ కమిషనర్ ఎక్సైజ్ శాఖకు ఎన్‌డిపిఎస్ చట్టంలో వచ్చిన మార్పులపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఎన్‌డిపిఎస్ మాదక ద్రవ్యాలు పట్టుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర మార్పులపై జూమ్ మీటింగ్లో తెలంగాణ నాబ్ శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా ఏడు సంవత్సరాలు జైలు శిక్ష కలిగిన కేసు నమోదు చేస్తే.. సంబంధిత కేసులో పూర్తి స్థాయిలో వీడియో తీసీ న్యాయమూర్తి ముందు ఎలా ఉంచాలనే విషయంలో శిక్షణ ఇచ్చారు. నేరాన్ని పరిశోధన సయంలోను, సంబంధిత నేరానికి సంబంధించిన డ్రగ్స్ పట్టుకున్నప్పుడు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ జూమ్ శిక్షణలో ఎక్సైజ్ శాఖ నుంచి జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్న ఎస్‌టిఎఫ్ అధికారులతో పాటు 139 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు పాల్గన్నారు. ఎన్‌డిపిఎస్ కేసులో ఎక్సైజ్ సిబ్బంది శిక్షణ తీసుకున్నందుకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్రెడ్డి అభినందించారు.

## ఆన్‌లైన్‌లో కరెంటు బిల్లుల చెల్లింపుపై బిగ్ అలర్ట్

ఇకపై వెబ్ సైట్ , మొబైల్ యాప్ ద్వారానే చెల్లించాలి

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణలోని విద్యుత్ వినియోగదారులకు టిజి ఎన్‌పిడిసిఎల్ సోమవారం కీలక సూచనలు చేసింది. ఇకపై కరెంటు బిల్లులు టిజి ఎన్‌పిడిసిఎల్ వెబ్ సైట్ లేదా టిజి ఎన్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌లలో మాత్రమే చెల్లించాలని తెలిపింది. ఈ సమాచారాన్ని టిజి ఎన్‌పిడిసిఎల్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా తెలియజేసింది. ట్విట్టర్‌లో ఇలా ఉంది. ప్రియమైన వినియోగదారులారా..ఆర్‌బిఐ ఆదేశాల ప్రకారం సర్వీస్ ప్రొవైడర్లు అనగా గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం, అమెజాన్ పే అలాగే బ్యాంకులు జూలై ఒకటో తేదీ నుంచి టిజి ఎన్‌పిడిసిఎల్ కు సంబంధించిన విద్యుత్ బిల్లులను అంగీకరించడం నిలిపివేశామని తెలిపింది. అందువల్ల ఇకపై వినియోగదారులందరూ దయచేసి టిజి ఎన్‌పిడిసిఎల్ వెబ్ సైట్ లేదా జిటి ఎన్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే నెలవారీ కరంటు బిల్లు చెల్లింపులను చేయవలసిందిగా అభ్యర్థిస్తున్నామని పేర్కొంది. కాగా గతంలో ఈ విద్యుత్ బిల్లులు గ్రామాల్లోని కరెంటు ఆఫీస్‌కి వెళ్లి చెల్లించే వారు. తర్వాత ఈ సేవ, మీ సేవలు అందుబాటులోకి వచ్చాక..ఆన్ లైన్ సెంటర్లకు వెళ్లి చెల్లించడం మొదలు పెట్టారు. టెక్నాలజీ మరింత పెరిగాక ఆన్ లైన్ సర్వీస్ ప్రొవైడర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు విద్యుత్ బిల్లులు సహా ఇతర బిల్లులు ఇంటి వద్ద నుంచే చెల్లించే సదుపాయం ఉంది. ఇటీవల సవరించిన ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం ఆన్ లైన్ సర్వీస్ ప్రొవైడర్లు విద్యుత్ బిల్లులను అంగీకరించడం నిలిపివేశాయి. దీంతో ఇప్పటి నుంచి విద్యుత్ బిల్లులు కేవలం విద్యుత్ శాఖకు చెందిన యాప్‌ల ద్వారా లేదా నేరుగా విద్యుత్ శాఖకు చెందిన ఆఫీస్‌ల వద్ద మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.